


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 08 గురువారం | మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 233
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

# ఆపరేషన్ సిందూర్

- తెల్లవారు జామునుంచే ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు
- 9 చోట్ల ఉగ్రస్థావరాల ధ్వంసం..వందకు పైగా టెర్రరిస్టుల హతం
- ఈ దాడుల్లో జైషె మహ్మద్, లష్కరే తొయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన ఉగ్రవాద క్యాంపులు ధ్వంసం
- మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు హతం..భారత్‌కు ప్రపంచ దేశాల మద్దతు
- 12 రోజులుగా కవ్వింపులకు పాల్పడుతున్న పాక్ సైనికులు
- అంతర్జాతీయంగా పాక్‌ను ఏకాకి చేసిన భారత్

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో కిందటి నెల 22వ తేదీన ఉగ్రవాదులు సాగించిన నరమేధానికి ప్రతీకారానికి దిగింది భారత్. 26 మంది అమాయక పర్యాటకుల ప్రాణాలను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులను పెంచిపోషిస్తోన్న పాకిస్తాన్‌పై మిస్సైళ్లతో దాడి చేసింది. తెల్లవారు జామున 2 గంటల సమయంలో తొలి మిస్సైల్ పాకిస్తాన్ భూభాగంపై పడింది. ఇక దాని తరువాత ఒకదాని వెంట ఒకటి భారత క్షిపణులు పాకిస్తాన్ గడ్డపై కనీవినీ ఎరుగని విధంగా విధ్వంసాన్ని సృష్టించాయి. ఈ దాడుల్లో జైషె మహ్మద్, లష్కరే తొయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన ఉగ్రవాద క్యాంపులు ధ్వంసం అయ్యాయి. పలువురు ఉగ్రవాదులు మరణించినట్లు వార్తలు వస్తోన్నాయి.

ఈ దాడుల గురించి అన్ని మిత్ర దేశాలకు సమాచారం ఇస్తోంది కేంద్ర ప్రభుత్వం. పాకిస్తాన్ భూభాగంతో పాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పై ఎందుకు మిస్సైళ్ల దాడి చేయాల్సి వచ్చిందనే విషయాన్ని వివరిస్తోంది. అంతర్జాతీయంగా పాకిస్తాన్‌ను ఏకాకి చేసే ప్రయత్నాలను మరింత ముమ్మరం చేసింది. అమెరికా, చైనా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతర్, తజకిస్తాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్.. వంటి దేశాలతో

# యావద్దేశం గర్విస్తోంది

- ఇది గర్వించే సమయం... ఆపరేషన్ సిందూర్‌పై మోదీ
- హర్షధ్వానాలు చేసిన క్యాబినెట్ సభ్యులు
- ఆపరేషన్ వ్యూహాత్మకంగా ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరక్కుండా కచ్చితంగా అమలు చేశాం

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా పాక్‌లోని ఉగ్రస్థావరాలు టార్గెట్‌గా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన క్యాబినెట్ సహచరులతో సమావేశమయ్యారు. "ఇది మనమంతా గర్వించదగిన సమయం" అని అభివర్ణించారు. సాయుధ బలగాలు కచ్చితమైన లక్ష్యాలపై దాడులు జరిపారంటూ ప్రశంసించారు. పాకిస్థాన్ లోపలకు చొచ్చుకెళ్లి పంజాబ్ ప్రావిన్స్‌లో 4 చోట్ల, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5 చోట్లు సాయుధ బలగాలు దాడులు జరిపిన తీరును ఆయన వివరించారు.

భారత బలగాలు కచ్చితమైన లక్ష్యాలు ఛేదించడం మనమంతా గర్వించదగని విషయం అని మోదీ చెప్పగానే క్యాబినెట్ సభ్యులు హర్షధ్వానాలు వ్యక్తం చేసారు. ఆపరేషన్ వ్యూహాత్మకంగా ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరక్కుండా కచ్చితంగా అమలు చేశారని, ప్రతీకారదాడులు విజయవంతంగా పూర్తయ్యాయని చెప్పారు. ముందస్తుగానే సమగ్రమైన సన్నాహకాలు చేసుకుని తూచ తప్పకుండా మిషన్ నిర్వహించిందన్నారు. ఆర్మీ

## 9 ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులు

2

- పీఓకేతో పాటు పాక్ భూభాగంలోని పలు ఉగ్రస్థావరాలపై దీర్ఘశ్రేణి
- ఆయుధాలతో భారత్ భీకర దాడులు
- 4 ఉగ్రవాద శిబిరాలపై భారత్ మిస్సైళ్లు

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

పహల్గాం దాడికి బదులు తీర్చుకుంటామని హెచ్చరించిన భారత్.. పాక్‌పై భీకర దాడుల ప్రారంభించింది. ఉగ్రదాడిలో తమ జీవిత భాగస్వాములను కోల్పోయిన మహిళల కన్నీరు

# మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు హతం

- భారత్ దాడిలో టెర్రరిస్ట్ కుటుంబంలో 10 మంది బలి..!
- మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజహర్ కుటుంబం హతం
- భారత్ ప్రతీకార దాడులు చేస్తుందని ఊహించిన మసూద్ పరారీ
- జైషె మహ్మద్, లష్కరే తొయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ తీవ్రవాదుల హతం

2




తప్పించుకున్న మసూద్

**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో**

కాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి కౌంటర్‌గా భారత్ చేసిన సర్జికల్ స్ట్రైక్ ఆపరేషన్ సిందూర్‌లో అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. భారత్‌లో గతంలో పలు ఉగ్రదాడులకు కారణమైన ఉగ్రవాదుల శిబిరాల్ని కుప్పకూల్చడంతో పాటు ఆయా తీవ్రవాదుల కుటుంబ సభ్యుల్ని కూడా హతమార్చింది. ఇందులో గతంలో కాందహార్ విమాన హైజాక్ సమయంలో భారత్ అప్పగించిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, పార్లమెంట్ పై సహా ఇతర దాడుల్లో ప్రమేయం ఉన్న మసూద్ అజహర్ కుటుంబం కూడా ఉంది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో పాకిస్తాన్‌లో ఉంటూ మన దేశంలో ఎన్నో దాడులకు ప్లాన్లు వేసిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజహర్ కుటుంబంలో 10 మంది చనిపోయారు. అతని మరో నలుగురు

# ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్



- ఎదురుకాల్పుల్లో 22 మంది మావోయిస్టులు మృతి
- ధృవీకరించిన బస్తర్ ఐజీ సుందర్ రాజ్
- మావోల నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాల స్వాధీనం
- కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న భద్రతాదళాలు

**బీజాపూర్-నవభూమిబ్యూరో**

ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నక్సల్స్ ఏరివేతే లక్ష్యంగా భద్రతా దళాలు ముందుకు సాగుతున్నాయి. ఆంధ్రా గ్రే హౌండ్స్, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో కీలక మావోయిస్టు నాయకులు మృతి చెందారు. నక్సల్స్ నుంచి భద్రతా దళాలు రెండు ఏకే 47 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇప్పటివరకూ నలుగురు మావోయిస్టులు కాల్పుల్లో మృతి చెందినట్లు సమాచారం. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఇంకా కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి.

కాగా, ఇవాళ ఉదయం తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లోనూ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. 22 మావోయిస్టులు మృతి చెందినట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ ధృవీకరించారు. భద్రతా దళాలు మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో తలదాచుకుంటున్న మావోయిస్టులను మట్టుబెట్టడమే ధ్యేయంగా భద్రతా దళాలు ఈ కీలక ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.

# పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు బీసీసీఐ షాక్

- పహల్గామ్ దాని నేపథ్యంలో బీసీసీఐ షాకింగ్ నిర్ణయం
- పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లు రద్దు
- పనిలో పనిగా బంగ్లాదేశ్‌కు కూడా షాక్
- భద్రతా కారణాల రీత్యా పాక్,బంగ్లా మ్యాచ్‌లు రద్దు
- దీని వల్ల పాక్‌కు రూ.220 కోట్లు,బంగ్లాకు రూ.130 కోట్లు



2

**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో**

ఇటీవల జమ్మూ, కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పౌరులు మరణించిన నేపథ్యంలో పాకిస్తాన్, భారత్ మధ్య

# ఆపరేషన్ సిందూర్‌తో బోర్డర్‌లో హైటెన్షన్..!

- రక్తమోడుతున్న సరిహద్దు గ్రామాలు
- పాక్ కాల్పుల్లో గ్రామీణులు హతం
- ఎల్ఓసీ వద్ద కాల్పులకు తెగబడిన పాక్
- సరిహద్దు గ్రామాల్లో ప్రజలను ఖాళీ
- చేయిస్తున్న భారత సైనికులు


2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ ఇవాళ పాకిస్తాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని తీవ్రవాద శిబిరాలపై ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. ఇందులో వందకు పైగా ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. ఈ చర్యతో పాక్ భగ్గుమంది. సరిహద్దుల్లో నియంత్రణ రేఖ వద్ద భారీగా కాల్పులకు దిగింది. ఈ కాల్పులతో ఇరు దేశాల సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో సైన్యం సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని ఖాళీ చేయిస్తోంది. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్ బలగాలు

# హైదరాబాద్‌లో మోగిన సైరన్లు..!

- పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్‌డ్రిల్
- దాడి జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన
- నగరంలో పలుచోట్ల మోగిన సైరన్లు..ప్రజలు అప్రమత్తం
- నానల్‌నగర్, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, ఈసీఐఎల్ ఎన్‌ఫ్‌సీలలో మాక్‌డ్రిల్
- ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, రక్షణశాఖ, అగ్నిమాపకశాఖ సిబ్బంది హాజరు



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** పాకిస్తాన్ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్ సాయంత్రం 4 గంటలకు మొదలైంది. మొదట నగరంలో పలుచోట్ల సైరన్లు మోగాయి. హైదరాబాద్ నగరంలో పలుచోట్ల సైరన్లు మోగాయి. ప్రధాన కూడళ్లు, అపార్ట్‌మెంట్ల వద్ద సైరన్లు మోగించారు. అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కోసం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రజలు, సహాయక సిబ్బంది వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించేందుకు పోలీసుల మాక్‌డ్రిల్ నిర్వహించారు. హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాల్లో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహణ జరిగింది. నానల్‌నగర్, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, ఈసీఐఎల్ ఎన్ఎఫ్‌సీ ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. సివిల్ మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, రక్షణశాఖ, అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్ బాగ్ డీఆర్‌డీఓ, మౌలాలి ఎన్ఎఫ్‌సీలో అధికారులు మాక్ డ్రిల్ జరగ్గా.. వైమానిక దాడి జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆపరేషన్ అభ్యాస్ పేరుతో 12 సివిల్ డిఫెన్స్ సర్వీసెస్ అధికారులు అవగాహన కల్పించారు. దాదాపు అరగంట పాటు ఈ కార్యక్రమం కొనసాగింది.

# లిక్కర్ స్కాం కేసులో జగన్ బ్యాచ్‌కు హైకోర్టు నుంచి నిరాశ..

- మద్యం కుంభ కోణం కేసులో కీలక పరిణామం
- ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసిన జగన్ సన్నిహితులు
- బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన ఏపీ హైకోర్టు
- చట్టపరంగా అరెస్టు చేసే అవకాశముందని కోర్టు వ్యాఖ్య

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపిన మద్యం కుంభ కోణం కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో మాజీ సీఎం జగన్ బ్యాచ్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది.ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మరో షాక్ తగిలింది. తన సన్నిహితులైన కె. ధనుంజయ రెడ్డి, పి.కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలు ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా, హైకోర్టు కొట్టివేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019-2024) ఏపీలో జరిగిన రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిది. ఈ కేసులో మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి భారీ ఎత్తున ముడుపులు వసూలు చేసినట్లు ఆరోపణలు


# సీబీఐ చీఫ్ ప్రవీణ్ సూద్ సర్వీస్ పొడిగింపు



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ సర్వీస్ ను కేంద్ర ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. కొత్త సీబీఐ డైరెక్టర్ ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం కుదరక పోవడంతో ఆయన పదవీ కాలాన్ని పొడిగించింది. ఈ పదవీకాలం పొడిగింపునకు అపాయింట్స్ కమిటీ ఆఫ్ కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రవీణ్ సూద్ పదవీకాలం వాస్తవానికి ఈ నెల 24తో ముగియాల్సి ఉంది. 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్ సూద్ 1989లో మైసూరులో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా తన పోలీస్ కెరీర్ ను ప్రారంభించారు.

# వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్ కొట్టివేత



**అమరావతి-నవభూమిబ్యూరో**

సత్యవర్ధన్ కిడ్నప్ కేసులో కూడా నిన్న వంశీ రిమాండ్ పొడిగింపుమాజీ శాసనసభ్యుడు వల్లభనేని వంశీకి మరోసారి నిరాశ ఎదురయింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆయన రిమాండ్ ను విజయవాడలోని సీఐడీ కోర్టు పొడిగించింది. ఈ కేసులో వంశీ రిమాండ్ గడువు ఈరోజుతో ముగిసింది. ఈ నేపథ్యంలో, పోలీసులు ఆయనను జిల్లా జైలు నుంచి తీసుకువచ్చి విజయవాడలోని సీఐడీ కోర్టు ముందు హాజరుపరిచారు. విచారణ అనంతరం, వంశీకి మే 21వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో పోలీసులు ఆయనను తిరిగి జిల్లా జైలుకు తరలించారు.సత్యవర్ధన్ కిడ్నాప్ కేసుకు సంబంధించి నిన్న కూడా వంశీకి నిరాశే ఎదురైంది. ఈ కేసులో రిమాండ్ గడువు ముగియడంతో ఆయనను విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయస్థానం మే 13 వరకు రిమాండ్‌ను పొడిగించింది. ఈ కేసులో వంశీతో పాటు వెలినేని శివరామకృష్ణ ప్రసాద్, గంటా వీర్రాజు, నిమ్మ చలపతి, వేల్పూరు వంశీబాబులను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన సంగతి విదితమే.

# సుప్రీంలో శ్రీలక్ష్మికి చుక్కెదురు

- ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంలో నిరాశే..
- తెలంగాణ హైకోర్టు ఇచ్చిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం
- ప్రతివాదుల వాదనలను పరిగణనలోకి తీసుకోలేదన్న సీబీఐ
- సీబీఐ వాదనలను ఏకీభవించిన సుప్రీం.. కేసు తాజా విచారణ

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఓబుళాపురం అక్రమమైనింగ్ కేసులో ఆమెకు విముక్తి కల్పిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం ధర్మాసనం కొట్టివేసింది. ప్రతివాదుల వాదనలను పరిగణలోకి తీసుకోకుండా హైకోర్టు తీర్పు ఇచ్చిందని సీబీఐ వాదనలు వినిపించింది. సీబీఐ వాదనతో సుప్రీం కోర్టు ఏకీభవించింది. మళ్లీ శ్రీలక్ష్మి కేసును తాజాగా విచారించాలని తెలంగాణ హైకోర్టుకు ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల్లోగా విచారణను ముగించాలని హైకోర్టును సుప్రీం ఆదేశించింది.

వైఎస్సార్ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా ఓబుళాపురం మైనింగ్స్‌లో అక్రమాలు జరిగాయంటూ సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితురాలిగా ఐఏఎస్ అధికారిణిని శ్రీలక్ష్మి అరెస్ట్ అయి కొంత కాలం జైలు జీవితం కూడా అనుభవించారు. అయితే ఈకేసులో శ్రీలక్ష్మిపై నమోదు అయిన కేసును తెలంగాణ హైకోర్టు

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in


## జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో 'స్కేటింగ్' శిక్షణ



**హైదరాబాద్- నవభూమి:** గ్రేటర్ హైద రాబాద్ మున్సిపల్ కార్పొ ేషన్ ప్రతి సంవత్సరం సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహణ ద్వారా విపరీతమైన ప్రజాదరణ పొందుతోంది. 6 నుండి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ప్రసిద్ధ క్రీడల్లో ప్రాథమిక నైపుణ్యాల బోధనకు విస్తారమైన అవకాశాలను అందిస్తుంది. జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ విభాగం 44 క్రీడా విభాగాల్లో విస్తృత శ్రేణి కార్యకలాపాలను నిర్వహిస్తుంది. వీటిని 29 మల్టీ-స్పోర్ట్స్ కాంప్లెక్సులు, 13 స్విమ్మింగ్ పూల్స్, 521 ప్లే గ్రౌండ్‌లలో నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలకు 77 మంది పార్ట్-టైమ్ కోచ్‌లు, 76 మంది స్విమ్మింగ్ కోచ్‌లు-కమ్-లైఫ్‌గార్డ్‌లు అలాగే జీహెచ్ఎంసీ ఆరు జోన్లలో దాదాపు 800 మంది గౌరవ కోచ్‌లు మద్దతు ఇస్తున్నారు.
సమ్మర్ కోచింగ్ క్యాంప్ 2025లో స్కేటింగ్ శిక్షణ
జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో రోలర్ స్కేటింగ్ అత్యంత ప్రజాదరణ పొందింది. గ్రేటర్ హైదరాబాద్ అంతటా 915 కేంద్రాల్లో నిర్మాణాత్మక రోలర్ స్కేటింగ్ లో శిక్షణను అందిస్తుంది.
సమయం : ఉదయం 6:15 నుండి 8:15 గంటల వరకు
లక్ష్యం : వేసవి సెలవుల్లో పిల్లలలో శారీరక శ్రమ, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడం అలాగే విద్యా ఒత్తిడిని తగ్గించడం.
స్కేటింగ్ కోసం నమోదు
%https://sports.ghmc.gov.in% వెబ్‌సైట్‌కు లాగిన్ అయి పేర్లు నమోదు చేసుకోవచ్చు.

## బ్యాగ్ మర్చిపోయి సికింద్రాబాద్‌లో దిగేసిన ప్రయాణికుడు.. సిబ్బంది తెరిచి చూడగా..

**హైదరాబాద్-నవభూమి:**భారతీయ రైల్వేలు కేవలం ప్రయాణ సాధనమే కాదు.. దేశంలోని వివిధ ప్రాంతాలు, భాషలు, సంస్కృతుల కలయికకు వేదిక. నిత్యం లక్షలాది మంది రైళ్లలో తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు. అయితే.. ఈ ప్రయాణాల్లో కొన్నిసార్లు వస్తువులు లేదా బ్యాగ్స్ లాంటివి మర్చిపోవడాలు, పోగొట్టుకోవడాలు జరుగుతుంటాయి. ముఖ్యంగా లగేజీ విషయంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయినప్పటికీ.. పొరపాటున తమ విలువైన వస్తువులను రైళ్లలో వదిలి వెళ్లిన వారికి రైల్వే సిబ్బంది మానవత్వంతో సహాయం చేస్తున్న ఘటనలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి.తాజాగా తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా రామాయంపేట మండలం దాయారాకు చెందిన రమేష్ పటేల్ అనే ప్రయాణికుడు తన కుటుంబ సభ్యులు.. బంధువులతో కలిసి గుజరాత్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా అహ్మదాబాద్‌లో భావనగర్ టెర్మినల్-కాకినాడ పోర్టు రైలు ఎక్కారు. దురదృష్టవశాత్తూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగిపోతూ తన లగేజీ బ్యాగును రైలులోనే మర్చిపోయారు. ఆ బ్యాగులో దుస్తులతో పాటు రూ. 3,13,460 నగదు ఉంది. ఈ డబ్బు ఆయన తన కుమార్తె వివాహం కోసం దాచి ఉంచినట్లు తెలిపారు.
ఆదివారం మధ్యాహ్నం 3.55 గంటల సమయంలో ఆ రైలు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తర్వాత.. అక్కడి జీఆర్పీ (గవర్నమెంట్ రైల్వే పోలీస్) మరియు ఆర్పీఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) సిబ్బంది సాధారణ తనిఖీలు చేస్తుండగా ఒక కోచ్‌లో ఆ లగేజీ బ్యాగ్ కనిపించింది. వారు వెంటనే బ్యాగును తెరిచి చూడగా అందులో నగదు.. దుస్తులు ఉండటం గమనించారు. వెంటనే స్పందించిన సిబ్బంది.. బ్యాగులో ఉన్న ఆహ్వాన పత్రికలో ఉన్న ఫోన్ నంబర్ల ఆధారంగా ప్రయాణికుడిని గుర్తించి సమాచారం అందించారు.బాధిత ప్రయాణికుడు రమేష్ పటేల్ సోమవారం రాజమహేంద్రవరం జీఆర్పీ స్టేషన్‌కు చేరుకుని తన బ్యాగును క్షేమంగా తిరిగి పొందారు. తన కుమార్తె వివాహం కోసం దాచిన డబ్బు తిరిగి రావడంతో ఆయన ఆనందానికి అవధులు లేవు. ఈ ఘటనలో అప్రమత్తంగా వ్యవహరించిన జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బందిని జీఆర్పీ డీఎస్పీ జయరామ్ ప్రత్యేకంగా అభినందించారు. వారి నిజాయితీకి ప్రశంసించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చినప్పటికీ.. రైల్వే సిబ్బంది మానవతా దృక్పథానికి ఇది ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది.
ప్రజలు రైలు ప్రయాణాలను ఎంచుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. సుదూర ప్రాంతాలకు చేరుకోవడానికి అనువైనదిగా ఈ రైలు ప్రయాణం ఉంటుంది. అంతేకాకుండా, రైల్వే శాఖ ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. ఇలాంటి ఘటనలు రైలు ప్రయాణాలు సురక్షితమైనవనే భావనను మరింత బలపరుస్తాయి. అప్రమత్తంగా ఉండటం ఎంత ముఖ్యమూ.. సిబ్బంది సహాయక స్వభావం కూడా ప్రయాణికులకు భరోసా కలిగిస్తుంది.

## అగ్నిప్రమాదంలో ఇండ్లు కోల్పోయిన సాయినగర్ వాసులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**మన్సురాబాద్-నవభూమి:** ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ఇండ్లను కోల్పోయిన సాయి నగర్ గుడిసెవాసులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధి సాయి నగర్ గుడిసెల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులను బుధవారం మరోసారి ఆయన పరామర్శించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. బాధితులకు ప్రభుత్వం తరఫున అందాల్సిన సదుపాయాలు ఇప్పించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి తక్షణ సహాయం కింద రూ. 8 వేలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇప్పటికే కొందరు దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసిందని.. మిగతా వారు సైతం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్‌తో మాట్లాడి ప్రతి ఒక్కరూ ఇల్లు కట్టుకునే విధంగా ఆర్థిక సహాయం అందింపజేస్తామని చెప్పారు. మంటల్లో కాలిపోయిన ఇంటి పట్టాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. పట్టాలు లేని వారికి ప్రతి ఒక్కరికి పట్టాలు ఇప్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం బాధితులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు.

## కొత్త రేషన్ కార్డుల కోసం మలక్‌పేట-1లో 18 వేల దరఖాస్తులు



**హైదరాబాద్-నవభూమి:** హైద రాబాద్ మలక్‌పేట సర్కిల్-1 పరిధిలో కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవ ద్వారా 18,121 దరఖాస్తులు, ప్రజావాణి ద్వారా 133 దరఖాస్తులు వచ్చినట్లు సర్కిల్-1 అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి ఏఎస్‌వో నర్సింగ్ రాజ్ తెలిపారు. మ్యుటేషన్ల (రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల పేర్ల నమోదు) కోసం 25,403 అర్జీలు రాగా, 19 వేల యూనిట్లు యాడ్ అయినాయని ఆయన తెలిపారు.సర్కిల్ వన్ పరిధిలో మొత్తం 68,868 కార్డులు ఉండగా, అందులో 63,774 ఎఫ్ఎస్‌సీ కార్డులు, 3,889 అంత్యోదయ కార్డులు, 1205 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయని నర్సింగ్ రాజ్ తెలిపారు. మలక్ పేట నియోజకవర్గంలో 5013, యాకుత్‌పురా నియోజకవర్గంలో 10,897, సైదాబాద్ లో 2,211 కార్డులు ఉన్నాయని, కొత్త కార్డుల కోసం సర్కిల్ వన్ పరిధిలో 18,121 దరఖాస్తులు రాగా, 4583 ఎంక్వయిరీలు పూర్తయినవని పేర్కొన్నారు. అంత్యోదయ కార్డులపై 35 కిలోల బియ్యం కిలో పంచదార రూ.13.50 లకు ఇవ్వబడుతుందని, అన్నపూర్ణ కార్డులపై 10 కిలోల బియ్యం, అన్ని కార్డులకు ఐదు కిలోల గోధుమలు రూ.7లకు కిలో చొప్పున ఇవ్వబడతాయని ఆయన వివరించారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని అమ్ముకుంటే కార్డులను రద్దు చేస్తామని ఏఎస్ఓ నర్సింగ్ రాజ్ హెచ్చరించారు.

## 54 ఏళ్ల తర్వాత.. హైదరాబాద్ నగరంలో మరోసారి, కళ్లకు కట్టినట్లుగా..!



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ మహా నగరంలో 54 ఏళ్ల తర్వాత మళ్లీ మాక్ డ్రిల్ సైరన్ మోగింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాక్ ఉద్రిక్తతల కారణంగా కేంద్ర హోంశాఖ ఆదేశాలతో దేశవ్యాప్తంగా 244 ప్రాంతాల్లో సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహించారు. 1971 భారత్-పాక్ యుద్ధం తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు హైదరాబాద్ నగరంలో ఇలాంటి మాక్ డ్రిల్ జరిగింది. హైదరాబాద్‌లోని సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్‌బాగ్ డీఆర్‌డీవో, మౌలాలి ఎన్ఎఫ్‌సీ ప్రాంతాల్లో 'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించారు.సాయంత్రం 4 గంటలకు సైరన్ మోగగా, 12 సివిల్ డిఫెన్స్ సర్వీసెస్ అధికారులు ఈ డ్రిల్‌లో పాల్గొన్నారు. సాయంత్రం 4:15 నుంచి 4:30 గంటల వరకు వైమానిక దాడి జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు, ఫైర్, ఎన్డీఆర్ఎఫ్, వైద్య, రెవెన్యూ, స్థానిక అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. దాడుల నుంచి ఎలా బయటపడాలి.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. తోటి వారికి ఎలా సాయం చేయాలి, క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స, వారిని ఆసుపత్రికి తరలించటం వంటి వాటిని కళ్లకు కట్టినట్లు చూపించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు ఈ మాక్ డ్రిల్‌ను పర్యవేక్షించారు. అధికారులు నిర్దేశించిన సమయానికి ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. సాయంత్రం 4:30 గంటలకు మాక్ డ్రిల్ ముగిసింది.ఇక పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో రాజకీయాలకు తావు లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆర్మీ, పోలీసు, విపత్తు నిర్వహణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అత్యవసర సేవల ఉద్యోగుల సెలవులు రద్దు చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా నివసిస్తున్న వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులు, మంత్రులు విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని, మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేయవద్దని హెచ్చరించారు. అత్యవసర మందులు, ఆహార నిల్వలు సిద్ధం చేయాలని, బ్లడ్ బ్యాంకుల్లో రక్తం అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రైవేట్ ఆస్పత్రుల సమాచారం, రెడ్ క్రాస్ సమన్వయం చేసుకోవాలని తెలిపారు. 24 గంటలు టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని, ఫేక్ న్యూస్‌పై ఉక్కుపాదం మోపాలని, ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
జిల్లా కేంద్రాలు, సున్నిత ప్రాంతాల్లో భద్రత పెంచాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని, విదేశీ రాయబార కార్యాలయాలు, ఐటీ సంస్థల వద్ద భద్రత పెంచాలని ఆదేశించారు. సైబర్ సెక్యూరిటీపై దృష్టి సారించాలని, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థ ఏర్పాటు చేయాలని, అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలని సూచించారు. దేశ సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు సెక్రటేరియట్ నుండి నెక్లెస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీలో సీఎం, మంత్రులు పాల్గొంటారు.

## తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు ఎప్పుడంటే..?




**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలోని గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులకు పోటీ చేసే ఆశావహులు ఓటర్లను ఆకర్షించేందుకు ఇప్పటికే ప్రచారాలు మొదలుపెట్టారు. కొన్ని గ్రామాల్లో అయితే ప్రత్యేక మేనిఫెస్టోలు, సర్పంచ్ పదవుల వేలం పాటలు కూడా నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందని ఆశగా చూస్తున్నారు. త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని గతంలో పలువురు మంత్రులు కూడా చెప్పారు. అయితే తాజాగా.. స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక అప్డేట్ వచ్చింది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జూన్ చివరి వారంలో నిర్వహిస్తామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. మొదట జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఆ తర్వాత జూలై చివరి వారంలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు.

**స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు..**

ఇక తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం బిల్లును ఆమోదించింది. ఈ బిల్లు ఆమోదం పొందితే.. తెలంగాణలో మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి చేరుతాయి ఇది సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితిని దాటుతుంది. అయితే ఈ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది, తద్వారా న్యాయ సమీక్ష నుండి రక్షణ పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ బిల్లు ప్రస్తుతం గవర్నర్ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఈ బిల్లు ఆమోదం పొందిన తర్వాత తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ బిల్లు ఆమోదం పొందితే, తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం పెరుగుతుంది.
తెలంగాణ రాష్ట్రంలోని 540 మండలాల పరిధిలో ఉన్న 12,966 గ్రామాలకు సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే, 1,14,620 వార్డులకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించిన జాబితాను పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందజేసింది. గత ఎన్నికల్లో 535 మండలాల్లోని 12,732 గ్రామాల్లో 1,13,152 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఈసారి అదనంగా 5 మండలాలు, 234 గ్రామాలు, 1,468 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

## పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు బీసీసీఐ షాక్

(1వపేజీ తరువాయి)ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీంతో భారత క్రికెట్ నియంత్రణ మండలి మరో షాకింగ్ నిర్ణయం తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది. పనిలో పనిగా బంగ్లాదేశ్‌కు షాక్ ఇవ్వబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి.భారత జట్టు, పాకిస్తాన్ క్రికెట్ టీమ్ ఓ ద్వైపాక్షిక సిరీస్‌లో తలపడి దాదాపు 15 సంవత్సరాలకు పైనే అయింది. కేవలం ఐసీసీ ఈవెంట్లు, ఆసియా కప్‌లలో మాత్రమే దాయాది జట్లు తలపడుతున్నాయి. ఇటీవల జమ్మూ, కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పౌరులు మరణించిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీంతో భారత క్రికెట్ నియంత్రణ మండలి మరో షాకింగ్ నిర్ణయం తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది.
పాకిస్తాన్ క్రికెట్ బోర్డును పూర్తిగా బహిష్కరించాలని బీసీసీఐ భావిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. అంటే ఇకపై ఐసీసీ టోర్నీలో, ఆసియా కప్‌లతో సహా పాకిస్తాన్‌తో ఏ రూపంలోనూ ఆడకపోవచ్చు. ఈ బహిష్కరణను మహిళా, యువ క్రికెట్‌కు కూడా అన్వయించే అవకాశం ఉంది. అంటే ఇకపై ఇక ఏ రూపంలోనూ పాకిస్తాన్‌తో టీమిండియా తలపడేది ఉండదు. ఇప్పటికే భారత్‌తో సిరీస్‌లు లేకపోవడం వల్ల పాకిస్తాన్ చాలా కోల్పోతోంది. ఐపీఎల్‌లో ఎంట్రీ లేకపోవడంతో పాకిస్తాన్ క్రికెటర్లు కూడా చాలా ఆదాయాన్ని కోల్పోతున్నారు. ఇక, ఐసీసీ ఈవెంట్లలో కూడా పాకిస్తాన్‌తో ఆడకూడదని బీసీసీఐ నిర్ణయించుకుంటే పాక్ మరింత ఆదాయం కోల్పోక తప్పదు.
పాకిస్తాన్‌తో మాత్రమే కాదు.. ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్ కూడా భారత్‌కు ప్రత్యర్థిగా మారాలని తహతహలాడుతోంది. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వం కూలిపోయినప్పటి నుంచి ఆ దేశంతో భారత ప్రభుత్వ సంబంధాలు దెబ్బతిన్నాయి. బంగ్లాదేశ్ తాత్కాలిక అధ్యక్షుడిగా మహ్మద్ యూనస్ నియమితుడైన తర్వాత ఆ దేశంలో హిందువులపై దాడులు జరుగుతున్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.ఇక, ఇటీవల పహల్గామ్ దాడి తర్వాత బంగ్లాదేశ్ రిటైర్డ్ మేజర్ జనరల్ ఏఎల్ఎమ్ ఫజ్లూర్ రెహ్మాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పాకిస్తాన్‌పై దాడి చేస్తే భారతదేశంలోని ఈశాన్య ప్రాంతాన్ని బంగ్లాదేశ్ స్వాధీనం చేసుకోవాలని ఆయన సూచించడం వివాదానికి దారితీసింది. దీంతో బంగ్లాదేశ్‌ను కూడా భారత్ అనుమానంగా చూస్తోంది. ఈ ఏడాది చివర్లో ఆసియా కప్ కంటే ముందు భారత్ మూడు వన్డేలు, మూడు టీ20ల కోసం బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది.

## లిక్కర్ స్కాం కేసులో జగన్ బ్యాచ్‌కు హైకోర్టు నుంచి నిరాశ..

(1వపేజీ తరువాయి)వచ్చాయి.
ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసును విచారిస్తూ, రాజ్ కసిరెడ్డి ప్రధాన నిందితుడిగా (ఏ1) గుర్తించింది. అతను ప్రతి నెలా రూ.50-60 కోట్ల మేర ముడుపులు వసూలు చేసి, ఈ డబ్బును జగన్‌కు చేర్చినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ధనుంజయ రెడ్డి (ఏ31), కృష్ణమోహన్ రెడ్డి (ఏ32), బాలాజీ గోవిందప్ప (ఏ33)లను కూడా నిందితులుగా సిట్ చేర్చింది. ధనుంజయ రెడ్డి నాటి సీఎంఓ కార్యదర్శిగా, కృష్ణమోహన్ రెడ్డి జగన్ ఓఎస్డీగా, బాలాజీ గోవిందప్ప భారతి సిమెంట్స్ డైరెక్టర్‌గా, జగన్ సతీమణి భారతి తరఫున ఆర్థిక వ్యవహారాలు చూసేవారు. ఈ ముగ్గురూ మద్యం సిండికేట్‌లో కీలక పాత్ర పోషించినట్లు సిట్ నిర్ధారించింది.
మద్యం కుంభకోణం కేసులో అరెస్టు భయంతో ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప హైకోర్టులో ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు, వారికి అరెస్టు నుంచి రక్షణ కల్పించే మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించింది. ప్రాసిక్యూషన్ వివరాలు సమర్పించేందుకు సమయం కోరడంతో, ఈ దశలో బెయిల్ మంజూరు చేయలేమని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో చట్టపరంగా అరెస్టు చేసే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది. ఇది జగన్ బ్యాచ్‌కు ఊహించని షాక్ అని చెప్పవచ్చు.

## ఆపరేషన్ సిందూర్.. పోలీసులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

**హైదరాబాద్-నవభూమి:** దేశ సైన్యంతో మనమంతా అండగా ఉన్నామనే సందేశం ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితెలిపారు. ఈ సమయంలో రాజకీయాలు, పార్టీలకు తావులేదని స్పష్టం చేశారు. అత్యవసర సర్వీస్‌లు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తున్నామని ప్రకటించారు. ఉద్యోగులు అంతా ప్రభుత్వానికి అందుబాటులో ఉండాలని చెప్పారు. మంత్రులు, అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బుధవారం ఇండియన్ ఆర్మీ పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది.
ఈ నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డీజీపీ జితేందర్,హోం సెక్రటరీ రవి గుప్తా, ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల రక్షణకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు.భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం(మే8) సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు,ఇతర నేతలు పాల్గొననున్నారు.

## ఆపరేషన్ సిందూర్

(1వపేజీ తరువాయి) సంప్రదింపులు జరిపింది. తాజాగా ఐక్యరాజ్యసమితితోనూ మాట్లాడింది భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ. ఐరాస భద్రత మండలికి ఈ దాడులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందజేసింది. ఐక్యరాజ్యసమితి భద్రతమండలిలో సభ్య దేశాలైన అమెరికా, యూకే, ఫ్రాన్స్, రష్యా, చైనాతో విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధితో పాటు ఐరాసలో భారత శాశ్వత రాయబారి పర్వతనేని హరీష్.. ఈ విషయాలతో మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఉగ్రవాదంపై పాకిస్తాన్ అనుసరిస్తోన్న వైఖరి గురించి వివరించారు. పాకిస్తాన్ భూభాగంపై ఉగ్రవాద క్యాంపులు కొనసాగుతున్నాయంటూ సాక్ష్యాలను అందజేశారు. అలాగే- భద్రత మండల నాన్ పర్మనెంట్ మెంబర్స్ దేశాలు- అల్జీరియా, డెన్మార్క్, గ్రీస్, గయానా, పనామా, దక్షిణ కొరియా, సియెర్రా లియోన్, స్లోవేనియా, సోమాలియా దేశాలకూ ఈ దాడుల గురించి పూర్తి సమాచారాన్ని తెలియజేశారు. ఆయా దేశాల నుంచి సంపూర్ణ మద్దతు కోరారు.

## మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు హతం

(1వపేజీ తరువాయి)అనుచరులు కూడా చనిపోయారు. ఈ విషయాన్ని స్వయంగా మసూద్ నిర్ధారించాడు. పాకిస్తాన్ లోని బహావ్ పూర్ లోని సుభానల్లా మసీద్ పై భారత్ జరిపిన దాడిలో వీరంతా చనిపోయారు. ' జైషే మొహమ్మద్ తీవ్రవాద సంస్థను నడుపుతున్న మసూద్ అజహర్ స్వయంగా చేసిన ప్రకటనలో భారత్ జరిపిన దాడిలో తన పెద్దక్క, ఆమె భర్త, మన మేనల్లుడు, అతని భార్య, మేనకోడలు, ఐదుగురు పిల్లలు చనిపోయినట్లు వెల్లడించాడు. 2019లో కశ్మీర్‌లోని పుల్వామాలో ఈయన నడుపుతున్న తీవ్రవాద సంస్థ జరిపిన దాడిలో 40 మంది సైనికులు చనిపోయారు. అప్పటి నుంచీ భారత్ మసూద్‌పై దాడులకు ప్లాన్ చేస్తూనే ఉంది. కానీ ఈసారి దాడిలోనూ అతను బతికిపోగా కుటుంబ సభ్యులు, అనుచరులు కలిపి 14 మంది చనిపోయారు. పహల్గాం దాడుల తర్వాత భారత్ ప్రతీకార దాడులు చేస్తుందని ఊహించిన మసూద్ అజహర్ పాకిస్తాన్ ప్రభుత్వం నుంచి మూడంచెల భద్రత తీసుకున్నాడు. అందుకే భారత్ జరిపిన దాడులకు దొరక్కుండా తప్పించుకున్నట్లు తెలుస్తోంది. అయితే భారత్ పై గతంలో ఎన్నో దాడులకు పాల్పడ్డ మసూద్ అజహర్ ను ఇప్పటికే ఐక్యరాజ్యసమితి సైతం మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిగా ప్రకటించింది. అయినా పాకిస్తాన్ మాత్రం తమ దేశంలో స్వేచ్ఛగా తిరగనిస్తోంది.

## ఆపరేషన్ సిందూర్‌తో బోర్డర్‌లో హైటెన్షన్..!

(1వపేజీ తరువాయి)నియంత్రణ రేఖ వెంబడి ఇవాళ కాల్పుల్ని ముమ్మరం చేశాయి. వాస్తవానికి పహల్గాం దాడి తర్వాత భారత్ ప్రతీకార దాడి చేస్తుందన్న భయంతో కాల్పులు మొదలుపెట్టిన పాకిస్తాన్ బలగాలు.. ఇవాళ వాటిని మరింత పెంచాయి. దీంతో సరిహద్దులు రక్తమోడుతున్నాయి. పాకిస్తాన్ కాల్పుల్లో 15 మంది భారతీయ పౌరులు చనిపోయారు. మరో 43 మంది గాయపడ్డారు. ఈ పరిణామాలతో సరిహద్దుల్లో ఉన్న గ్రామాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొంటున్నాయి. పాకిస్తాన్ బలగాలు నియంత్రణ రేఖ వెంబడి జరుపుతున్న కాల్పుల నేపథ్యంలో సరిహద్దుల్లో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్ చేసి మాట్లాడారు. సరిహద్దు గ్రామాల్ని వేగంగా ఖాళీ చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అందుకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని ఆయా రాష్ట్రాల సీఎంలకు అమిత్ షా తెలిపారు. దీంతో సరిహద్దుల్లో గ్రామాల నుంచి జనాన్ని ఖాళీ చేయించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. మరోవైపు పాకిస్తాన్ బలగాల కాల్పులకు భారత్ దీటుగా సమాధానం ఇస్తూనే ఉంది. అయినా పలు చోట్ల అమాయక పౌరులు మృత్యువాత పడుతున్నారు. తాజాగా జరిగిన కాల్పుల్లో 10 మంది సిక్కులు చనిపోయారు. దీనిపై అకాలీదళ్ నేత సుఖ్ బీర్ సింగ్ బాదల్ స్పందించారు. పాకిస్తాన్ చర్యల్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

## వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్ కొట్టివేత

(1వపేజీ తరువాయి)నిన్న వీరందరి రిమాండ్ ముగియడంతో కోర్టులో హాజరుపర్చగా, వారందరికీ కూడా రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ కేసుకు సంబంధించి పరారీలో ఉన్న మరికొంతమంది నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## సుప్రీంలో శ్రీలక్ష్మికి చుక్కెదురు

(1వపేజీ తరువాయి)కొట్టివేసింది. 2022లో శ్రీలక్ష్మిని ఈ కేసు నుంచి హైకోర్టు డిశ్చార్జ్ చేసింది. దీంతో ఈ తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై ఈరోజు (బుధవారం) సుప్రీం కోర్టులో విచారణ జరగగా.. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. మళ్లీ శ్రీలక్ష్మి కేసును విచారించాలని ఆదేశాలు జారీ చేసింది.

## యావద్దేశం గర్విస్తోంది

(1వపేజీ తరువాయి) ప్రశంసనీయమైన పాత్ర నిర్వహించిందని మోదీ ప్రశంసించారు. యావద్దేశం మనవైపు చూస్తోందని, ఆర్మీ మనకు గర్వకారణంగా నిలిచిందని అన్నారు.
ఏప్రిల్ 22న హహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని ముందుకు నడిపించిన మోదీ సారథ్యాన్ని మంత్రులంతా ఈ సందర్భంగా ప్రశంసించారు. కాగా, ఆపరేషన్ సింధూర్ నిర్వహించిన తీరు, పరిణామాలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొద్దికేపటి క్రితం కలుసుకున్నారు.

## 9 ఉగ్ర స్థావరాలపై మెరుపు

(1వపేజీ తరువాయి) తుడిచేలా ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత త్రివిధ దళాలు భీకర దాడులు ప్రారంభించాయి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌తో పాటు పాక్‌లోని నాలుగు ఉగ్రవాద శిబిరాలపై భారత్ మిసైళ్ల వర్షం కురిపించింది. లష్కరే తయ్యిబా, జైష్ ఏ మహ్మద్, హిజ్బులు ముజాహిద్దీన్, ఇతర ఉగ్రసంస్థల స్థావరాలు టెర్రర్ నెట్వర్క్‌లు ధ్వంసం చేయడమే లక్ష్యంగా బుధవారం తెల్లవారుజాము నుంచి మెరుపుదాడులకు దిగింది. బహావల్‌పూర్, మురిద్కే, కోట్లీ, గుల్‌పూర్, సవాయ్, సర్జాల్, బర్నాలా, మెహమూనా ప్రాంతాలపై దాడి దాడులకు దిగింది.బహావల్‌పూర్‌లో జైష్ ఏ మహ్మద్ హెడ్‌క్వార్టర్స్ ఉంది. మురిద్కే లో లష్కరే తయ్యిబా శిక్షన క్యాంపు ఉంది. కోట్లీలో సూసైడ్ బాంబర్ల శిక్షణ కార్యక్రమాలు సాగుతుంటాయి. గుల్‌పూర్‌లో నుంచి ఉగ్రవాదులు తరచూ పూంచ్, రాజౌలీలపై దాడులకు దిగుతుంటారు. సవాయ్, సర్జాల్, బర్నాలా, మెహమూనా వంటి ప్రాంతాలు ఉగ్రకార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నాయి.

# నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

3 | హైదరాబాద్ | గురువారం | 08 । మే । 2025




## అందుకే.. ఆపరేషన్ సిందూర్.. త్రివిధ దళాల రియాక్షన్



**న్యూఢిల్లీ-నవభూమి:**పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై భారత త్రివిధ దళాల అధికారులు స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ గతంలో పార్లమెంట్‌పై దాడి నుంచి తాజాగా జరిగిన పహల్గామ్ దాడి వరకూ మొత్తం 350 మంది పౌరులు మృతి చెందారని చెప్పారు. అలాగే 600 మందికి పైగా సైనికులు మృతిచెందారన్నారు. ఇకపై ఇలాంటివి జరగకుండా ఉండేందుకే ఆపరేషన్ సిందూర్ చేపట్టినట్లు తెలిపారు. పహల్గామ్‌లో పౌరులను విచక్షణారహితంగా కాల్చి చంపారని, ఈ దాడిలో 25 మంది భారతీయ పౌరులు, ఒక నేపాలీ మృతిచెందారని చెప్పారు. పహల్గామ్ దాడి అత్యంత హేయమైనదని తెలిపారు. ముంబై దాడుల తర్వాత ఇదే పెద్ద దాడి అని, జమ్మూకశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోవడమే ఉగ్రవాదుల పన్నాగమని చెప్పారు. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో ఐరాస విఫలమైందని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. %ు=ఖీ% అనేది లష్కరే తొయిబాకు ఒక ముసుగు వంటిదన్నారు. ఉగ్రసంస్థల కోసమే %ు=ఖీ% పనిచేస్తోందన్నారు. నిఘా వ్యవస్థల ద్వారా ఉగ్రదాడులకు పాల్పడ్డవారిని గుర్తించామని చెప్పారు. అంతర్జాతీయ వేదికలపై ప్రపంచ దేశాలను పాక్ తప్పుదారి పట్టిస్తోందని, ఉగ్రవాదానికి పాకిస్థాన్ స్వర్గధామంగా మారిందని దుయ్యబట్టారు. భారత్‌పై రానున్న రోజుల్లో ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందని.. నిఘా వర్గాలు హెచ్చరించాయన్నారు. ఉగ్రసంస్థల మౌలిక వసతులు ధ్వంసం చేసేందుకే సరిహద్దు దాటి భారత్ దాడి చేసిందని స్పష్టం చేశారు. పహల్గామ్ దాడి తర్వాత పాక్ ఎలాంటి దిద్దుబాటు చర్యలు చేపట్టలేదని తెలిపారు.

## మారిపోతున్న అమెరికా పౌరసత్వం.. ట్రంప్ కీలక నిర్ణయాలు



**అమెరికా:నవభూమి:**అమెరికా పౌరసత్వ విధానాలు త్వరలో గణనీయంగా మారే అవకాశం ఉంది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైతే, సంపన్నులకు పౌరసత్వాన్ని సులభతరం చేస్తూనే, వలసదారులు, శరణార్థులు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారిపై కఠినమైన చర్యలు తీసుకునే దిశగా విధానాలను రూపొంది స్తున్నారు. – సంపన్నులకు 'గోల్డ్ వీసా': ట్రంప్ ప్రతిపాదించిన ముఖ్య మార్పులలో ఒకటి 'గోల్డ్ వీసా'. దీని ప్రకారం.. 5 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టే అతి సంపన్న విదేశీయులకు కేవలం రెండు వారాల్లోనే అమెరికా పౌరసత్వం పొందే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం పౌరసత్వం పొందడానికి సంవత్సరాలు పడుతున్న సాధారణ ప్రక్రియను ఇది పూర్తిగా తగ్గిస్తుంది. సంపద ఆధారిత పౌరసత్వానికి ఇది పెద్దపీట వేస్తుందని విమర్శకులు అంటున్నారు. ఇతరులకు పెరగనున్న ఆర్థిక భారం: ఇదిలా ఉండగా కొత్త రిపబ్లికన్ పార్టీ మద్దతుగల బడ్జెట్ ప్రతిపాదనలు పౌరసత్వం పొందాలనుకునే ఇతరులపై భారీ ఆర్థిక భారాన్ని మోపనున్నాయి. తల్లిదండ్రులు లేని మైనర్లకు 3,500 డాలర్లు, వర్క్ పర్మిట్లకు 550 డాలర్లు, ఇంతకు ముందు ఉచితంగా లభించిన ఆశ్రయం దరఖాస్తులకు 1,000 డాలర్లు రుసుము వసూలు చేయాలని ప్రతిపాదించారు. ఇది ఆర్థిక స్థోమత లేనివారికి అమెరికా పౌరసత్వం లేదా చట్టబద్ధమైన హోదా పొందడాన్ని అత్యంత కష్టతరం చేస్తుంది. పుట్టుకతో వచ్చే పౌరసత్వంపై సవాల్: ట్రంప్ అమెరికా రాజ్యాంగం హామీ ఇచ్చే పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని కూడా రద్దు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.. అమెరికాలో చట్టబద్ధమైన పత్రాలు లేకుండా నివసిస్తున్న వలసదారుల పిల్లలకు లేదా తాత్కాలిక వీసాలపై ఉన్నవారి పిల్లలకు పుట్టుకతో పౌరసత్వం లభించకుండా చేయాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కేసు త్వరలో సుప్రీంకోర్టు విచారణకు రానుంది. ఒకవేళ ఇది ఆమోదం పొందితే, అమెరికాలో కొత్తగా దేశం లేని వ్యక్తుల వర్గం ఏర్పడే ప్రమాదం ఉంది.పౌరసత్వం రద్దు ప్రయత్నాలు ముమ్మరం: మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, సహజసిద్ధమైన పౌరసత్వాన్ని రద్దు చేసే ప్రయత్నాలను ట్రంప్ పునరుద్ధరించి, విస్తృతం చేశారు. గత ఫిబ్రవరిలో, జస్టిస్ డిపార్ట్మెంట్ "డెన్యాచురలైజేషన్ సెక్షన్" ను ఏర్పాటు చేసింది. దీనికి కాలపరిమితి లేదు. గతంలో చిన్న చిన్న తప్పులకు 700,000 మంది సహజసిద్ధ పౌరసత్వం పొందిన వారి పౌరసత్వాన్ని సమీక్షించే ప్రయత్నాలను ఇది గుర్తుచేస్తుంది. ట్రంప్ మాజీ సలహాదారు స్టీఫెన్ మిల్లర్ ఈ ప్రయత్నాలను "టర్బోచార్జ్" చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. – ఈ చర్యలు అమెరికా యొక్క సంప్రదాయ విలువలు అయిన చేరిక , వైవిధ్యం , న్యాయం నుండి తీవ్రంగా వైదొలగడాన్ని సూచిస్తాయి. ట్రంప్ పౌరసత్వ విధానం మెరిట్ , మానవ గౌరవం కంటే సంపద , విధేయతకు ప్రాధాన్యత ఇస్తుందని విమర్శకులు అంటున్నారు. ఇది శతాబ్దాల నాటి వలసదారులకు స్వాగతం పలికి, అమెరికా వృద్ధికి దోహదపడిన వారసత్వాన్ని బలహీనపరుస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. ఈ విధాన మార్పులు చట్టబద్ధమైన ప్రక్రియ కు కూడా ప్రమాదం కలిగించవచ్చు. ట్రంప్ గాజా విధానాన్ని విమర్శిస్తూ ఒక వ్యాసం రాసిన టర్కిష్ విద్యార్థిని రుమేసా ఓజ్టర్క్ అరెస్ట్, పౌరసత్వ ఇంటర్వ్యూ సమయంలో రాజకీయ అభిప్రాయాలు వ్యక్తం చేసినందుకు మొహ్సెన్ మహదావి నిర్బంధం వంటి కేసులు, కొత్త నిబంధనల ప్రకారం భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారిని ఎలా లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందో చూపిస్తున్నాయి. ఇవన్నీ ఉన్నప్పటికీ మహదావి తాను ఇప్పటికీ అమెరికన్ ప్రజాస్వామ్యం , న్యాయవ్యవస్థను నమ్ముతున్నానని అంటున్నారు. అయితే ట్రంప్ దృష్టిలో పౌరసత్వం అందరికీ సమానత్వం , అవకాశాల వాగ్దానం కాకుండా, ధనవంతులకు ,విధేయులకు లభించే ఒక ప్రత్యేక హక్కుగా మారుతుందని చాలా మంది హెచ్చరిస్తున్నారు.

## ఆపరేషన్ సిందూర్.. పాక్, పీఓకేలో భారత్ ఎలా దాడులు జరిపిందంటే?




**జమ్ము కశ్మీర్:నవభూమి:**పాకిస్తాన్ భూభాగంతోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలు, శిక్షణా శిబిరాలపై.. బుధవారం తెల్లవారుజామున.. భారత త్రివిధ దళాలు ఆపరేషన్ సిందూర్ పేరుతో చేపట్టిన మెరుపు దాడులు ప్రపంచ దేశాలను భారత్ వైపు చూసేలా చేశాయి. పహల్గామ్ మారణహోమానికి పాల్పడిన ఉగ్రవాదులను ఎక్కడ ఉన్నా మట్టిలో కలిపేస్తామని.. ప్రధాని మోదీ శపథం చేసిన కొన్ని రోజుల వ్యవధిలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. మొత్తం 9 ప్రాంతాల్లో భారత సైన్యం ఈ మెరుపు దాడులు సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించింది. భారత గడ్డపై నుంచే ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టాయి. ఈ ఆపరేషన్ గురించి స్పందించిన రక్షణ మంత్రిత్వ శాఖ.. గురి తప్పని, సమయానుకూలమైన, పరిస్థితిని మరింత దిగజార్చని చర్య అని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఈ దాడుల్లో పాకిస్తాన్ సైనిక స్థావరాలను తాకలేదని కూడా తెలిపింది. ఈ ఆపరేషన్ సిందూర్ గురించి.. బుధవారం తెల్లవారుజామున 1:44 గంటలకు రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ దాడుల్లో జైషే మహమ్మద్ హెడ్ క్వార్టర్స్ ఉన్న బహవల్‌పూర్‌తోపాటు లష్కరే తోయిబా ఉగ్రస్థావరం ఉన్న మురిద్కేలు ఉన్నాయని తెలిపింది.

1999లో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించబడిన మసూద్ అజార్.. విడుదలైనప్పటి నుంచి బహవల్‌పూర్‌లో జైషే మహ్మద్ ప్రధాన స్థావరంగా కొనసాగుతోంది. పుల్వామా, పార్లమెంట్‌పై దాడితో సహా భారత్‌లోని అనేక భారీ ఉగ్రదాడుల వెనుక జైషే మహ్మద్ హస్తం ఉంది. మరోవైపు.. మురిద్కే నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న హాఫీజ్ సయీద్ నేతృత్వంలోని లష్కరే తోయిబా.. 2008 ముంబై దాడులకు పాల్పడింది.

ఆపరేషన్ సిందూర్ దాడులు ఎలా జరిగాయంటే?

కచ్చితమైన సమాచారం ఆధారంగా ఉగ్రవాద శిబిరాలకు సంబంధించిన లక్ష్యాలను భారత నిఘా సంస్థలు సైన్యానికి అందించాయి.

భారత బలగాలు జైషే మహమ్మద్, లష్కరే తోయిబా అగ్ర నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ ప్రాంతాలను సెలెక్ట్ చేసుకున్నాయి. ఈ ఉగ్ర సంస్థల చీఫ్‌లు భారత్‌లో ఉగ్రకుట్రలకు కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఈ ఆపరేషన్ సిందూర్‌ను భారత ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా నిర్వహించాయి. ఆయుధాలు, దళాల సమీకరణలో కూడా త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేశాయి.

ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రత్యేకమైన కచ్చితత్వంతో కూడిన మందుగుండు సామగ్రిని ఉపయోగించారు.

భారత బలగాలు విజయవంతంగా ఛేదించిన 9 లక్ష్యాల్లో 4 పాకిస్తాన్ భూభాగంలో ఉండగా.. మరో 5 పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉన్నాయి.

పాకిస్తాన్‌లోని లక్ష్యాల్లో బహవల్‌పూర్, మురిద్కే, సియాల్‌కోట్ ఉన్నాయి.

ఆపరేషన్ సిందూర్ గురించి ఇతర దేశాలకు భారత్ సమాచారం

ఈ ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్‌పై, పీఓకేపై నిర్వహించిన మెరుపు దాడుల తర్వాత.. పలు దేశాలకు భారత్ సమాచారం అందించింది. పాకిస్తాన్‌పై చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక చర్యల గురించి ఆయా దేశాల సీనియర్ అధికారులకు భారత్ వివరించింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ అమెరికా నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో మాట్లాడి.. దీనికి సంబంధించి తీసుకున్న చర్యల గురించి తెలియజేశారు. పహల్గామ్ ఉగ్రదాడిలో పాక్ ఉగ్రవాదుల ప్రమేయం ఉన్నట్లు తెలిపే విశ్వసనీయ ఆధారాలు, టెక్నికల్ డేటా, ప్రాణాలతో బయటపడిన వారి వాంగ్మూలం, ఇతర సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది.

## ఆపరేషన్ సిందూర్‌పై అసదుద్దీన్ ఒవైసీ రియాక్షన్



**హైదరాబాద్ - నవభూమి:** పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార చర్యలను కొనసాగిస్తోంది. మంగళవారం రోజు అర్ధరాత్రి ఉగ్రస్థావరాలే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. ఈ ఘటనలో మొత్తంగా 80 మంది వరకు ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తుండగా.. దేశంలోని రాజకీయ నాయకులంతా స్పందిస్తున్నారు. ఒక్కొక్కరూ ఒక్కో విధంగా కామెంట్లు చేస్తూనే.. భారత దేశానికి అండగా నిలబడుతున్నారు. అయితే తాజాగా ఆపరేషన్ సిందూర్‌పై ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తాను ఈ దాడిని స్వాగతిస్తున్నానంటూనే మరికొన్ని కామెంట్లు చేశారు.ఏప్రిల్ 22వ తేదీన జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆ దాడిని తీవ్రంగా వ్యతిరేకిస్తూనే.. ఉగ్రవాదులను సమూలంగా నాశనం చేయాలంటూ అన్ని పార్టీల నేతలు చెప్పుకొస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏం చేసినా తోడుగా ఉంటామని వివరిస్తున్నారు. ముఖ్యంగా ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సైతం.. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. బీజేపీ సర్కారు తీసుకుంటున్న ప్రతీ చర్యకు మద్దతు పలుకుతూనే వస్తున్నారు. సింధూ నదీ జలాల రద్దును సైతం స్వాగతించారు.

అంతేకాకుండా భారత్ తీసుకున్న ఈ చర్యపై పాకిస్థాన్ మంత్రులు తీవ్ర వ్యాఖ్యలు చేయగా.. గట్టిగా బదులిచ్చారు. ముఖ్యంగా పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ ఛైర్మన్ బిలావల్ భుట్టో జర్దారి.. పాకిస్థాన్‌లో ఉగ్రావాదులే లేరని, సింధు నదిలో పాకిస్థాన్ నీళ్లైనా పారాలని లేదా భారతీయుల రక్తమైనా పారాలంటూ వ్యాఖ్యానించగా.. ఒవైసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భుట్టో మాట్లాడే మాటలు వింటుంటే చిన్నపిల్లలు మాట్లాడుతున్నట్లుగానే అనిపిస్తుందని.. ఆయన తల్లిని, తాతను కూడా ఉగ్రవాదులే చంపారని గుర్తు చేశారు. ఇలా ఎప్పుడూ భారత సర్కారుకు మద్దతుగా నిలుస్తున్న ఒవైసీ.. ఆపరేషన్ సిందూర్‌ను కూడా స్వాగతించారు.

ఎక్స్ వేదికగా ఆపరేషన్ సిందూర్‌పై కూడా అసదుద్దీన్ ఒవైసీ ఓ పోస్టు పెట్టారు. పాకిస్థాన్ సహా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని రక్షణ దళాలు దాడులు చేయడాన్ని తాను స్వాగతిస్తున్నానని చెప్పుకొచ్చారు. పాకిస్థాన్ దేశానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. అలా చేస్తేనే దాయాది దేశం మరోసారి ముందడుగు వేయదని వెల్లడించారు. ఇక్కడితోనే ఆగిపోకుండా పాకిస్థాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూడా నాశనం చేయాలని సూచించారు. చివర్లో జై హింద్ అని రాశారు. ప్రస్తుతం అసదుద్దీన్ ఒవైసీ చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.

## గాలి జనార్ధన్‌రెడ్డికి ఏడేళ్ల జైలు.. 'పాలిటిక్స్' ఎండేనా?



**బెంగళూరు - నవభూమి:** గాలి జనార్ధన్‌రెడ్డి. ఒకప్పుడు దక్షిణాదిలో ఆయనను మించిన కుబేరుడు లేరు. కుమార్తె పెళ్లికి అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేసి అందరినీ మెస్మరైజ్ చేసిన ఆయనకు తిరుమల శ్రీవారంటే అమిత భక్తి. అందుకే.. అప్పట్లోనే ఆయన నిలువెత్తు కిరీటం చేయించి శ్రీవారికి కానుకగా ఇచ్చారు. అయితే.. ఆయనపై అక్రమాలు, అవినీతి కేసులు నమోదైన తర్వాత.. తిరుమల తిరుపతి దేవస్థానం సదరు కానుకను వెనక్కి ఇచ్చింది. అయితే.. ఆయన అది తిరిగి తీసుకోలేదు. ప్రస్తుతం ఈ కిరీటం.. ఎస్ బీఐ బ్యాంకులో ఉంది. ఇదిలావుంటే.. ప్రస్తుతం ఏడు సంవత్సరాలు జైలు శిక్ష పడిన నేపథ్యంలో గాలి జనార్ధన్‌రెడ్డి ఫ్యూచర్ ఏంటి? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. జనార్ధన్‌రెడ్డి ప్రస్తుతం వ్యక్తి మాత్రమే కాదు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన గంగావతి నియోజకవర్గం ఎమ్మెల్యే కూడా. ఆయన కళ్యాణ రాజ్య ప్రగతి పక్షపార్టీకి అధినేత కూడా. ఆయన పార్టీ 2023లో జరిగిన రాష్ట్ర ఎన్నికల్లో 45 స్థానాల్లో పోటీ చేసింది. ఆయన సతీమణి లక్ష్మి కూడా నాయకురాలే. ప్రస్తుతం ఈ పార్టీ విస్తరణ దశలో ఉంది. వచ్చే ఎన్నికల నాటికి పార్టీని ప్రగతి పథంలో నడిపించేందుకు, కుదిరితే.. మరోసారి బీజేపీతో చేతులు కలిపేందుకు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో అనూహ్యంగా గాలికి ఏడేళ్ల జైలు పడడంతో ఆయన జైలుకు వెళ్లక తప్పదు. సీబీఐ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించిన నేపథ్యంలో గాలి శాసన సభ్యత్వం రద్దు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిణామాలు రాజకీయంగా ఆయనపై పెను ప్రభావం చూపించనున్నాయి. ప్రస్తుతం ఒక్క మైనింగ్ కేసు మాత్రమే కాకుండా.. కర్నాటక లోకాయుక్త గతంలోనే నమోదు చేసిన కేసుల్లో పలు ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో గత కొన్నాళ్లు పార్టీని కూడా నడిపించలేక.. విరాళాలు తీసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో అనూహ్యంగా ఆయన జైలుకు వెళ్లాల్సి వచ్చింది. దీంతో రాజకీయాలకు ఇక, గాలి స్వస్తి చెప్పినట్టే అవుతుందని అంటున్నారుకళ్యాణ రాజ్య ప్రగతి పక్ష పార్టీలో గాలి జనార్ధన్‌రెడ్డి వ్యవస్థాపకుడిగా ఉండగా.. ఆయన మిత్రుడు బి. శ్రీరాములు బీజేపీలో ఉన్నారు. ఆయన ఈ పార్టీని తునాతునకలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే టాక్ ఉంది. గత ఎన్నికల్లో శ్రీరాములు.. గాలికి వ్యతిరేకంగా క్యాంపెయిన్ నిర్వహించారు. దీంతో బలమైన గాలి మాట వినే నియోజకవర్గాల్లోనూ పార్టీ పుంజుకోలేక పోయింది. ఇక, ఇప్పుడు ఆయన జైలుకు వెళ్తే.. పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారనుందని అంటున్నారు. చిత్రం ఏంటంటే.. ఈ పార్టీలో 45 మంది పోటీ చేస్తే.. ఒకే ఒక్క గాలి జనార్ధన్‌రెడ్డి మాత్రం గంగావతి నియోజకవర్గం నుంచి 7 వేల మెజారిటీతో అతి కష్టంమీద విజయం దక్కించుకున్నారు. మరి భవిష్యత్తు ఏం కానుందో చూడాలి.

## ఆపరేషన్ సిందూర్.. డొనాల్డ్ ట్రంప్ ఏమన్నారంటే..



**అమెరికా:నవభూమి:**పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యలుంటాయని తెలిపిన కేంద్ర ప్రభుత్వం.. బుధవారం అర్ధరాత్రి 1.44 గంటలకు భారత్ ఆపరేషన్ సిందూర్ ప్రారంభించింది. పాక్‌లో ఉగ్రస్థావరాలే టార్గెట్‌గా దీన్ని మొదలు పెట్టారు. దీనిలో భాగంగా భారత సాయుధ దళాలు మంగళవారం అర్ధరాత్రి తర్వాత పాకిస్తాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడి చేశాయి. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) ప్రాంతంలోని కొన్ని భాగాలపై కూడా దాడి మొదలు పెట్టాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలు మరీ ముఖ్యంగా అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆపరేషన్ సిందూర్‌పై స్పందించారు.ఈ సందర్భంగా డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. "మాకు ఆపరేషన్ సిందూర్ గురించి కాసేపటి క్రితమే తెలిసింది. అక్కడ (భారత్-పాక్ దేశాల మధ్య) చాలా ఏళ్లుగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఇది త్వరగా ముగిసిపోవాలని ఆశిస్తున్నా" అని ఆయన అన్నారు. భారత్, పాక్ ఉద్రికత్తలపై మీడియా అడిగిన ప్రశ్నకు అమెరికా అధ్యక్షుడు ఈ మేరకు సమాధానమిచ్చారు.ట్రంప్ గతంలో మాట్లాడుతూ తాను భారత్‌తో తనకు చాలా దగ్గర సంబంధంఉందని తెలిపారు. అలానే పాకిస్థాన్ కూడా తమకు దగ్గరి సంబంధాలే ఉన్నాయని పునరుద్ఘాటించారు. ఇదిలా ఉండగా.. ఆపరేషన్ సిందూర్ గురించి భారత రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌లోని పౌర, ఆర్థిక, సైనిక లక్ష్యాలేవీ దెబ్బతినలేదు. ఉగ్రవాద శిబిరాలుగా గుర్తించిన వాటిని మాత్రమే లక్ష్యంగా చేసుకున్నాము అని వెల్లడించింది. అంతేకాకుండా, దాడులు జరిగిన కొద్దిసేపటికే, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్.. అమెరికా ఎన్ఎస్ఏ విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో మాట్లాడి, తీసుకున్న చర్యల గురించి ఆయనకు వివరించారు అని పేర్కొంది.మంగళవారం అర్ధరాత్రి సుమారు 1.44 గంటలకు భారత్.. ఆపరేషన్ సిందూర్ ప్రారంభించింది. ఈ దాడుల్లో సుమారు 80 మంది ఉగ్రవాదులు హతం అయినట్లుగా సమాచారం. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత ప్రభుత్వం పీఓకేలో ఉన్న ఉగ్రస్థావరాలపైన బాంబుల వర్షం కురిపించిందని వర్గాలు వెల్లడించాయి. ఈ దాడుల్లో భారత ఆర్మీ మిగ్ 29కే, రఫేల్ యుద్ధ విమానాలు మిసైళ్లతో దాడులు చేసినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే ఆపరేషన్ సిందూర్‌కి ముందే భారత ఆర్మీ ఒక వీడియోని విడుదల చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.అంతేకాక దాడుల తరువాత భారత్, పాక్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చినట్టు కూడా తెలుస్తోంది. పరిస్థితిని మరింత దిగజార్చేలా ఎలాంటి చర్యలకు పాల్పడొద్దని దాయాది దేశానికి స్పష్టం చేసినట్టు తెలిసింది. ఇక ఈ ఆపరేషన్ సిందూర్‌పై కేంద్ర మంత్రులు స్పందిస్తూ.. భారత్ మాతాకీ జై అంటూ పోస్టులు పెడుతున్నారు.

## మా నమ్మకమే గెలిచింది.. పహల్గామ్ దాడిలో మరణించిన ఆదిల్ తండ్రి కీలక వ్యాఖ్యలు..



**జమ్ము కశ్మీర్:నవభూమి:**సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా.. పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన ఒక పర్యాటక గైడ్. 28 సంవత్సరాల ఆదిల్ ఉగ్రవాద దాడిలో పర్యాటకులను కాపాడే ప్రయత్నంలో తన ప్రాణాలను పణంగా పెట్టి వీర మరణం పొందాడు. ఉగ్ర దాడిలో చనిపోయిన ఏకైక స్థానికుడు ఇతడే. టూరిస్టులను తన గుర్రంపై స్వారీ చేయించి జీవనం సాగిస్తుండే అతను ఉగ్రవాదులకు ఎదురు తిరిగాడు. వారి నుంచి గన్నులు లాక్కోవడానికి ప్రయత్నించగా ఆ కిరాతకులు అతడ్ని కాల్చి చంపేశారు.సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా ధైర్య సాహసాలకు ఇటీవలె కేంద్ర ప్రభుత్వం ' బ్రేవరీ అవార్డు'ను ప్రకటించింది. అంతేకాకుండా, ఆదిల్ సోదరుడు సయ్యద్ నాజకత్ హుస్సేన్‌కు ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించింది. కాగా, ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్ లోని 9 ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసింది. ఈ విషయంపై సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా తండ్రి హైదర్ షా స్పందించారు.తన కొడుకుతో సహా పహల్గామ్‌కు చెందిన 28 మంది హత్యకు భారత్ ప్రతీకారం తీర్చుకున్నందుకు తాము చాలా సంతోషంగా ఉన్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భద్రతా దళాలు, ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకున్నాయని, మాకు ప్రధాని మోదీపై నమ్మకం ఉందని, ఆ నమ్మకమే ఈరోజు మాకు న్యాయం జరిగేలా చేసిందని హర్షం వ్యక్తం చేశారు.

## అహంకారం కొన్ని గంటల్లో మాయం... పాక్ కీలక ప్రకటన!



**జమ్ము కశ్మీర్:నవభూమి:**పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం ప్రతీకారం తీర్చుకునేందుకు భారత సైన్యం అర్ధరాత్రి ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... పాక్, పీవోకేలోని 9 ఉగ్ర శిభిరాలపై దాడులు నిర్వహించింది. ఈ ఆపరేషన్ లో జైషే మహ్మద్, లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయాలు ధ్వంసమయ్యాయి. సుమారు 80 మంది ఉగ్రవాదులు మృతి చెందినట్లు తెలుస్తోంది. అయితే... ఈ దాడికి ముందు వరకూ పాకిస్థాన్ నుంచి వచ్చిన మాటలు ఇప్పుడు చల్లబడటం గమనార్హం. ఇందులో భాగంగా... పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్పందిస్తూ... భారత్ గనుక పాక్ పై దాడి చేసే సాహసానికి ఒడిగడితే.. ప్రపంచంలో ఎవరూ మిగలరని ఆయన చెప్పుకొచ్చారు. అయితే.. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆయన మాట పూర్తిగా మారింది. ఆపరేషన్ సిందూర్ కి ఒక్కరోజు ముందు మీడియాతో మాట్లాడిన పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్.. తమ దేశ భద్రతకు ఏమాత్రం ముప్పు వాటిల్లినా, భారత్ తమపై దాడికి పాల్పడినా.. ఆ తర్వాత ఎవరూ మిగలరని హెచ్చరించారు. అయితే మంగళవారం అర్ధరాత్రి భారత్ దాడుల అనంతరం ఆయన మాట పూర్తిగా మారింది.. అహంకారం తగ్గినట్లుగా వస్తుంది! ఇందులో భాగంగా... భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత మాట్లాడిన పాక్ రక్షణ మంత్రి... భారత్ ప్రస్తుతం ఆపరేషన్లను ఆపితే తాము ఆపుతామని అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. ఈ సమయంలో భారత్ దాడులు ఆపితే సంయమనం పాటించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని.. పాకిస్థాన్ యుద్ధం కోరుకోవట్లేదని చెప్పుకొచ్చారు. మరోపక్క భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పై పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ స్పందించారు. ఈ దాడులను "యుద్ధ చర్య"గా ఖండించారు. తగిన సమాధానం ఇస్తామని, దీనిపై స్పందించే హక్కు పాకిస్థాన్ కు ఉందని చెప్పుకొచ్చారు. పాకిస్థాన్ సాయుధ దళాలకు శత్రువుతో ఎలా వ్యవహరించాలో తెలుసని, శత్రువు ఎప్పటికీ విజయం సాధించలేదని

## అటు ఆపరేషన్ సింధూర్ సక్సెస్..

### ఇటు రాజస్థాన్‌లో మిస్సైల్ కలకలం



**జమ్ము కశ్మీర్:నవభూమి:**జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దాడికి 15 రోజుల తర్వాత భారత సైన్యం మంగళవారం రాత్రి పీవోకే, పాకిస్తాన్ లో ఎయిర్ స్ట్రైక్ చేసి క్షిపణులను ప్రయోగించింది. ఈ ఆపరేషన్‌కు సింధూర్ అని పేరు పెట్టారు. పాకిస్తాన్‌పై ఎయిర్ స్ట్రైక్ కోసం భారత వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు రాజస్థాన్‌లోని బికానెర్ జిల్లాలోని ఖాజువాలా నుంచి బయలుదేరాయి. పాకిస్తాన్‌పై జరిగిన ఈ ఎయిర్ స్ట్రైక్‌లో భారత సైన్యం రాఫెల్ విమానాలలో బ్రహ్మోస్ క్షిపణులను ఉపయోగించారు. రాజస్థాన్ నుంచి ఒక వీడియో బయటకు వచ్చింది. అందులో ఒక పొలంలో క్షిపణి కవర్ పడి ఉండడం కనిపించింది. ఈ క్షిపణి కవర్ రాజస్థాన్‌లోని బికానెర్ జిల్లాలోని బంధనావు గ్రామానికి చెందిన రాంప్రసాద్ జోషి పొలంలో పడింది. దీనిని చూడటానికి గ్రామస్తులు గుమిగూడారు. క్షిపణి కవర్ దాదాపు 15 అడుగుల పొడవు ఉంది.గ్రామస్తులు తాము ఒక ప్రకాశవంత మైనటువంటి కాంతిని చూశామని .. పెద్ద శబ్దం కూడా విన్నామని చెప్పారు. బంధనావుతో పాటు, మోమాసర్, ఉదరాసర్, సురన్‌జసర్ మొదలైన గ్రామాల్లో కూడా పెద్ద శబ్దం వినిపించినట్లు చెప్పారు. వైరల్ వీడియోలో పొలంలో క్షిపణి కవర్ పడి ఉండడం స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామస్తులు ఆ కవర్‌ను ఆసక్తిగా చూస్తున్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాకిస్తాన్‌లోని 9 టెర్రరిస్ట్ స్థావరాలను భారత సైన్యం ధ్వంసం చేసింది. ఈ స్థావరాలు పాకిస్తాన్, పీవోకేలో ఉన్నాయి, వీటిని భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. రాత్రి 1:30 గంటలకు ఆపరేషన్ సింధూర్ కింద బహవల్‌పూర్, మురిద్కే, బాఘ్, కోట్లి, ముజఫరాబాద్‌లలో భారత సైన్యం దాడులు చేసింది. భారత సైన్యం దాడిలో 100 మందికి పైగా టెర్రరిస్టులు హతమయ్యారని సమాచారం అందుతోంది.ఈ దాడి తర్వాత భారతదేశంలోని మూడు సైనిక దళాలు అప్రమత్తంగా ఉన్నాయి. ఏప్రిల్ 22న పాకిస్తాన్ నుండి వచ్చిన టెర్రరిస్టులు జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లోని బైసరన్ లోయలో దాడి చేశారు. ఈ పిరికిపందల దాడిలో 26 మంది పౌరులు మరణించారు. ఈ దాడి తర్వాత దేశం దుఃఖంలో, ఆగ్రహంతో ఉంది. ప్రతి దేశ పౌరుడు పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పాలని కోరుకుంటున్నాడు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



## రఫేల్ యుద్ధ విమానాన్ని పాక్ కూల్చిందా? పీఐబీ ఫ్యాక్ట్ చెక్ ఏం చెప్పిందంటే

న్యూఢిల్లీ: ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత్‌కు చెందిన రఫేల్ యుద్ధ విమానాన్ని కూల్చినట్లు సోషల్ మీడియాలో వార్తలు వ్యాపిస్తున్నాయి. రఫేల్ ఫైటర్ జెట్‌కు చెందిన కొన్ని శకలాల ఫోటోలు కూడా వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ వివరణ ఇచ్చింది.సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న ఫోటోలు గతంలో కూలిన మిగ్ 21 ఫైటర్ జెట్‌కు చెందినవని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పేర్కొన్నది. 2021లో పంజాబ్‌లోని మోగా జిల్లాలో మిగ్21 విమానం




కూలిన దృశ్యాలు మీడియాలో వైరల్ అవుతున్నట్లు పీఐబీ తెలిపింది. ప్రో పాకిస్తానీ యూజర్లు పోస్టు చేస్తున్న మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పీఐబీ పేర్కొన్నది. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్పీఆర్ విభాగం తప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నట్లు పీఐబీ ఆరోపించింది. భారతీయ యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు, భారతీయ ఆర్మీ బేస్‌లపై దాడి చేస్తున్నట్లు వచ్చిన వార్తలను పీఐబీ ఖండించింది. భారతీయ సైనిక దళాలను తప్పుడు సమాచారంతో టార్గెట్ చేస్తున్నట్లు పీఐబీ తెలిపింది. ఇండియన్ బ్రిగేడ్ ప్రధాన కార్యాలయం ధ్వంసమైనట్లు, శ్రీనగర్ ఎయిర్‌బేస్‌పై దాడి జరిగినట్లు వస్తున్న వార్తలను ఇండియా ఖండించింది.

## కృష్ణా జలకాటకం

సుప్రీంకోర్టు స్టే ఉన్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్2 తుది తీర్పు(2013)పై గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేందుకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సన్నాహాలు చేస్తున్నారు. బేసిన్‌లోని రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించి తీర్పును గెజిట్ నోటిఫికేషన్ చేయదలచారు. ఇదే జరిగితే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రానికి పంగనామాలు మిగులుతాయి. ఈ నెల ఏడవ తేదీన బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేశారు. వాస్తవంలో కర్ణాటక ఆల్మట్టి జలాశయం నిర్మించిన తర్వాత కృష్ణకు వరద ఆలస్యంగా వస్తోంది. ఈ తీర్పు నోటిఫై జరిగి, ఆల్మట్టి ఎత్తు 525 మీటర్లకు పెరిగితే, ఇంతే సంగతులు. పైగా వర్షాభావ నీటి సంవత్సరాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఈ తీర్పు ద్వారా ఎగువ రాష్ట్రాలు పొందిన లబ్ధికి వ్యతిరేకంగా కొంత చురుకుగా వ్యవహరించారు. కాని రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన కేసీఆర్ ఎగువ రాష్ట్రాలు పొందిన లబ్ధి గురించి పట్టించుకోవడం మానేశారు.కేసీఆర్ భావోద్వేగాలు పెంచి పోషించే వ్యూహం రచించి, కృష్ణ నదీ జలాల వాటాల గురించి అవశేష ఆంధ్రప్రదేశ్‌తో వాదులాటకు దిగారు. తుదకు 2020లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని బుట్టలో వేసుకొని తిరిగి ఉభయ రాష్ట్రాల మధ్య కృష్ణ నదీ జలాల పంపిణీకి ట్రిబ్యునల్ నియామకం గురించి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందారు. ఈ ప్రతిపాదన కేంద్ర న్యాయశాఖ వద్ద మూడేళ్ల కాలం దస్త్రాలకే పరిమితమవగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2023 తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఏకంగా ట్రిబ్యునల్ నియామకానికి ఆమోదం తెలిపి, ఆంధ్రప్రదేశ్ గొంతు కోసింది.గమనార్హమైన అంశమేమంటే ఇదే ట్రిబ్యునల్ రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 మేరకు 2015 నుంచి విచారణ జరుపుతుండగా, 1956 అంతర్ రాష్ట్ర జల వివాద చట్టం సెక్షన్ 3 కింద అదనపు అంశాలు జోడించి, విధి విధానాలతో విచారణకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతం విచారణ జరుపుతున్న ట్రిబ్యునల్ రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 మేరకు రెండు రాష్ట్రాలు కోరిన 31 అంశాలు పక్కన బెట్టి, తాజాగా కేంద్రం జారీ చేసిన ఆదేశాల మేరకు విచారణ సాగిస్తోంది. ఇదంతా ఎందుకంటే, తాజాగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గైకొంటున్న చర్యలు ఫలిస్తే, రెండు తెలుగు రాష్ట్రాలకూ ప్రమాదం పొంచి ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక లబ్ధి పొందుతాయి. పైగా అదనంగా 258 టియంసిల నికర జలాలు ఎగువ రాష్ట్రాలు తన్నుకుపోతాయి. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల జల వనరులు శాఖ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయడంలోని ఆంతర్యమేమిటి? ఇటీవల కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆల్మట్టి ఎత్తు 525 మీటర్లకు పెంచుతామని రైతుల సమావేశంలో ప్రకటించారు. దానికి, కేంద్ర మంత్రి చొరవకు ఏమైనా సంబంధముందా?బచావత్ ట్రిబ్యునల్ తీర్పు కాల పరిమితి ముగిసిన తరువాత 2004లో నియామకమైన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో తుది తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర శరాఘాతంగా ఉండడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకెక్కింది. సుప్రీంకోర్టు ఈ తీర్పుపై స్టే విధించడంతో కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ నిలుపుదల చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు యథాతథస్థితి కొనసాగుతోంది. అయితే రాష్ట్ర విభజన తర్వాత 2015లో తెలంగాణ కూడా ఈ కేసులో ఇంప్లీడ్ అయింది. గత రెండు మూడేళ్లుగా మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో స్టే వెకేట్ చేయించేందుకు శతవిధాల విఫల యత్నాలు చేశాయి.కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడు కనీసం షరతులతో ఆల్మట్టి ఎత్తు పెంచుకొనేందుకు అనుమతి ఇవ్వమని సుప్రీంకోర్టును కోరింది. కాని జరగలేదు. ఇప్పుడు తాజాగా కేంద్ర జల శక్తి శాఖ మంత్రి ఏకాభిప్రాయం సాధనకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయనకు ఇప్పుడు ఎందుకు ఈ ఆలోచన వచ్చిందో, దీని వెనుక ఎవరు ఉన్నారో తెలియదు.దేశంలో ఏ నదీ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చినా నదికి ఆఖరుగా ఉండే రాష్ట్రం నీటి ఎద్దడి రోజుల్లో వాడుకొనేందుకు మిగులు జలాలు కేటాయించే సంప్రదాయముంది. వర్షాభావ రోజుల్లో ఆ నీరే గతి. కాని బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కృష్ణ నదిలో చుక్క మిగులు నీళ్లు లేకుండా మొత్తం బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య పంపకం చేసింది. మిగులు జలాలు ఉండివుంటే నేడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఈ స్థాయిలో నీటి వివాదాలు ఉండేవి కావు. పైగా క్యారీ ఓవర్ అనే హెడ్ కాకుండా మిగిలిన రెండు రాష్ట్రాలకు కేటాయించిన నీటిని నేరుగా వాడుకొనే అవకాశం కల్పించింది. కనీసం ఇతర రాష్ట్రాలతో సమానంగా ఇంచుమించు కేటాయింపులు లేకుండా కేవలం 38 టీయంసీలు మాత్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించింది.కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఏర్పాటు చేసే సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ కూడా ఏకాభిప్రాయ ప్రకటనను గట్టిగా వ్యతిరేకించవలసి ఉంది. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఇతర జల వివాదాలు ఈ సమిష్టి పోరాటానికి అడ్డు రాకూడదు. ఏకాభిప్రాయ సాధన పేరుతో కేంద్రం ఇతర తాయిలాలతో మభ్యపరిస్తే మాత్రం రెండు రాష్ట్రాల కొంపలు కొల్లేరవుతాయి.ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వంశధార ట్రిబ్యునల్ తుది తీర్పు నోటిఫై చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయాలి. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తుది తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఉంది. అలాంటి వివాదాన్ని కోర్టు బయట పరిష్కారానికి పూనుకుంటున్న కేంద్ర జలశక్తి శాఖ మంత్రి, కేసులున్నా, సుప్రీంకోర్టు స్టే లేని వంశధార ట్రిబ్యునల్ తుది తీర్పు ఎందుకు నోటిఫై చేయలేదో అర్థం కాదు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు నోటిఫై కోసం మహారాష్ట్ర, కర్ణాటక ముఖ్యమంత్రుల స్థాయిలో చర్యలు ఉంటున్నాయి, ఫాలో అప్ చేస్తున్నారు. ఏపీ కూడా లాబీయింగ్ మొదలు పెట్టి ఉంటే వంశధార ట్రిబ్యునల్ ఇంకా పెండింగ్‌లో ఉండేది కాదు. ఇప్పటికైనా ఏపీ ఇంజనీరింగ్ అధికారులు బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్%-%2 తీర్పు నోటిఫైకి వ్యతిరేకంగా పోరాడుతూ, అదే సమయంలో సుప్రీంకోర్టు స్టే లేని వంశధార ట్రిబ్యునల్ తుది తీర్పు నోటిఫై చేయించుకోవాలి. ఇదే జరిగితే అతి తక్కువ నిధులతో వంశధార, నాగావళి నదులు అనుసంధానికి మార్గం సుగమం అవుతుంది.

## దేశ వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవం - జన్యు సవరణాధారిత వరి వంగడాల అభివృద్ధి “






ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఒక చారిత్రాత్మక ప్రకటన చేస్తూ మొట్టమొదటిసారిగా జన్యు సవరణ (జీనోమ్ ఎడిటెడ్) ద్వారా అభివృద్ధి చేయబడి విడుదల చేయబడిన వరి వంగడాలైన ‘కమల’ (డిఆర్ఆర్ ధాన్ 100), ‘పూసా డీఎస్టీ రైస్ 1’ లను మనదేశం విజయవంతంగా అభివృద్ధి చేసిందని ప్రకటించారు. జన్యు సవరణ మొక్క సొంత జన్యువులను ‘ఎడిట్’ చేసే పద్ధతిగా భవిష్యత్ వ్యవసాయ సవాళ్లను ఎదుర్కోవడంలో ఒక కొత్త ఆశ ఇచ్చే మార్గంగా కనిపిస్తోంది. ఈ సాంకేతికత సరైన నియంత్రణలు, పారదర్శకతతో ఉపయోగించడం ద్వారా భారతీయ వరి సాగులో గణనీయ పురోగతి సాధ్యమవుతుంది. ఇది కేవలం ఒక సాంకేతిక విజయం మాత్రమే కాదు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న జనాభా అవసరాల నేపథ్యంలో దేశ వ్యవసాయ భవిష్యత్తుకు బలమైన భరోసాను ఇచ్చే పరిణామం. ఈ వంగడాలను మే 2025లో అధికారికంగా విడుదల చేశారు. ఇవి పరిశోధనా దశ నుండి క్షేత్రస్థాయి సాగుకు రావడానికి ఇంకా కొంత సమయం పడుతుంది. రైతుల కోసం నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, విస్తృత పంపిణీ ప్రక్రియలు పూర్తి కావాల్సి ఉంది. దీనికి సుమారు రెండు నుండి నాలుగు సంవత్సరాలు పట్టవచ్చని అంచనా.నూతన వంగడాల ఆవిష్కరణ - ఒక మైలురాయి:

ఈ నూతన వంగడాల అభివృద్ధిలో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్ ) ఆధ్వర్యంలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్, హైదరాబాద్‌బీ ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, న్యూఢిల్లీ శాస్త్రవేత్తలు కీలక పాత్ర పోషించారు. ఆధునిక జన్యు సవరణ పద్ధతులైన క్రిస్పర్-కాస్ ఆధారిత టెక్నాలజీని ఉపయోగించి వీటిని రూపొందించారు. ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన అంశం ఏమిటంటే ఇవి గతంలో చర్చకు వచ్చిన జన్యుమార్పిడి (జియం) పంటల కోవలోకి రావు. జన్యుమార్పిడిలో బయటి జీవుల నుండి జన్యువులను చేర్చడం జరుగుతుంది. కానీ జన్యు సవరణలో వరి మొక్క సొంత జన్యువులలోనే నిర్దిష్ట, ఖచ్చితమైన మార్పులు చేస్తారు. బయటి నుండి అదనపు డీఎన్ఏను చేర్చరు. ఈ తేడా సాంకేతికంగానే కాకుండా, నియంత్రణపరంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సాంకేతికతలో రెండు ముఖ్య పద్ధతులున్నాయి. అవి “జన్యుమార్పిడి (జన్యుపరంగా మార్పు చెందినది)”, “జన్యు సవరణ “. ఈ రెండు పద్ధతుల మధ్య ప్రాథమిక తేడాలను చూద్దాం.

జన్యుమార్పిడి వరి:

జన్యుమార్పిడి ప్రక్రియలో ఒక జీవి (వరి మొక్క అనుకుందాం) లోపలి జన్యువులలోకి మరొక పూర్తిగా భిన్న జీవి నుండి తీసుకున్న జన్యువులను ప్రవేశపెడతారు. బ్యాక్టీరియా, వైరస్ లేదా వేరే మొక్కల నుండి వేరు చేసిన జన్యువులను వరి మొక్క లోపలి జన్యు పదార్థం లోపలికి శాశ్వతంగా కలిసిపోయేలా చేస్తారు. ఈ బయటి నుండి చేర్చబడిన జన్యువుల ద్వారా వరి లోపలి కొత్త లక్షణాలు పుడతాయి. లేదా ఉన్న లక్షణాలు బాగా మారతాయి. ఉదాహరణకు, పురుగులకు నిరోధకత కలిగించడానికి, లేదా పోషక విలువలు పెంచడానికి బయటి జన్యువులను చేర్చవచ్చు. ఈ ప్రక్రియలో వరి మొక్క లోపలి జన్యు పదార్థంలోకి ‘విదేశీ జన్యు పదార్థం’ చేరుతుంది.

**జన్యు సవరణ వరి:**

జన్యు సవరణ అనేది జన్యు సాంకేతికత లోపలి ఒక కొత్త విధానం. ఇది ఒక మొక్క సొంత జన్యువులలోనే అత్యంత ఖచ్చితమైన, నిర్దిష్టమైన మార్పులు చేసే పద్ధతి. క్రిస్పర్-కాస్9 వంటి అధునాతన జన్యు సవరణ సాధనాలను ఉపయోగించి డీఎన్ఏ లోని కావలసిన నిర్దిష్ట భాగాలను కత్తిరించడం, తొలగించడం లేదా స్వల్ప మార్పులు చేయడం జరుగుతుంది. ఇది ప్రకృతిలో సహజంగా జరిగే ఉత్పరివర్తనాల మాదిరిగానే ఉంటుంది. కానీ ప్రయోగశాలలో అత్యంత నియంత్రిత, ఖచ్చితమైన పద్ధతిలో జరుగుతుంది. ఈ పద్ధతిలో బయటి నుండి ఎలాంటి అదనపు జన్యువులను వరి మొక్క లోపలికి పంపరు. బదులుగా, ఆధునిక జన్యు సవరణ సాధనాలను ఉపయోగించి వరి మొక్క సొంత జన్యు పదార్థం లోపలి నిర్దిష్ట, ఖచ్చిత భాగాలను కత్తిరించడం, తీసివేయడం, లేదా స్వల్ప మార్పులు చేయడం చేస్తారు. ఈ మార్పులు ప్రకృతిలో సహజంగా జరిగే ఉత్పరివర్తనాల మాదిరిగానే ఉంటాయి. కానీ అవి చాలా నిర్దిష్టంగా, నియంత్రిత పద్ధతిలో జరుగుతాయి. లక్ష్యం ఏటంటే, బయటి జన్యువులను చేర్చకుండానే వరి లోపలి కావలసిన లక్షణాలు (ఉదాహరణకు, ఎక్కువ దిగుబడి, కరువును తట్టుకునే శక్తి, తెగుళ్ళ నిరోధకత) తీసుకురావడం. ముఖ్య తేడా ఒక్క మాటలో చెప్పాలంటే

జన్యుమార్పిడి వరిలో బయటి జీవుల నుండి జన్యువులు చేరుతాయి. జన్యు సవరించిన వరిలో వరి సొంత జన్యువులలోనే ఖచ్చిత మార్పులు జరుగుతాయి. బయటి జన్యు పదార్థం సాధారణంగా ఉపయోగించరు. వీటిని అభివృద్ధి చేసింది వీరే !

“ కమల (డీఆర్ఆర్ ధాన్ 100)” వంగడాన్ని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) ఆధ్వర్యం లోని భారతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్), హైదరాబాద్ లోని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది తెలుగు రాష్ట్రాలతో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో రైతులు, వినియోగదారులు బాగా ఇష్టపడే సాంబ మసూరి (బీపీటీ 5204) వరి రకం నుండి జన్యు సవర ణ ద్వారా మెరుగుపరచబడింది. ఇక “ పూసా డీఎస్టీ రైస్ 1 వంగడాన్ని “ ఐకార్ ఆధ్వర్యంలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఏఆర్ఐ), న్యూఢిల్లీ లోని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీనికి మూలం ఎంటీయు 1010 (కాటన్ డోరా సన్నాలు) అనే మరో ప్రసిద్ధ సన్న గింజల వరి రకం. ఈ రెండు వంగడా లను క్రిస్పర్-కాస్ ఆధారిత ఎస్డీఎన్1 అనే నిర్దిష్ట జన్యు సవరణ పద్ధతిని ఉపయోగించి అభివృద్ధి చేశారు.

**కమల, పూసా డీఎస్టీ రైస్ 1 ప్రత్యేకతలు:**

విడుదలైన రెండు వంగడాల్లో ‘కమల’ వంగడాన్ని రైతులు బాగా ఇష్టపడే సాంబ మసూరి రకం నుండి అభివృద్ధి చేశారు. కమల వంగడం దాని మూల రకం సాంబ మసూరి కంటే దాదాపు 19% అధిక దిగుబడినిచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీని ప్రధాన ప్రయోజనం ఏమిటంటే, సాధారణంగా 145-150 రోజులు పట్టే సాంబ మసూరితో పోలిస్తే, కమల కేవలం సుమారు 130 రోజుల్లోనే అంటే 15-20 రోజులు ముందుగానే కోతకు వస్తుంది (పక్వానికి రావడం). ఈ తక్కువ కాల వ్యవధి వల్ల సాగునీటి వినియోగం గణనీయంగా తగ్గి నీటిని ఆదా చేయవచ్చు. ఇది కరువు పరిస్థితులను కూడా తట్టుకునే శక్తిని కలిగి ఉంది. అధిక నత్రజని వినియోగ సామర్థ్యం కలిగి ఉండటం వల్ల ఎరువుల వాడకం తగ్గించవచ్చు. దీని కాండం గట్టిగా ఉండి పంట పడిపోకుండా (పడిపోవడం) తట్టుకుంటుంది. తక్కువ కాల వ్యవధి పర్యావరణానికి మేలు చేస్తూ మీథేన్ వంటి హరితగృహ వాయువుల ఉద్గారాలను తగ్గిస్తుంది. వరి నాణ్యత విషయంలో, ఇది సాంబ మసూరి యొక్క మంచి గింజ, వంట నాణ్యతను నిలుపుకుంది. ఇక పూసా డీఎస్టీ రైస్ 1 వంగడం కరువుతో పాటు నేలలోని అధిక లవణీయతను (ఉప్పదనం) సమర్థవంతంగా తట్టుకోగల లక్షణాన్ని కలిగి ఉంది. డీఎస్టీ జన్యువును సవరించడం ద్వారా ఈ లక్షణాన్ని సాధించారు. దీనిని కరువు ప్రభావిత ప్రాంతాలు, లవణీయత కలిగిన నేలలు లేదా తీర ప్రాంతాలకు అనుకూలంగా అభివృద్ధి చేశారు. ఒత్తిడితో కూడిన (లవణీయత, కరువు) పరిస్థితుల్లో సాగు చేసినప్పుడు ఇది మూల వంగడం ఎంటీయు 1010 కంటే గణనీయంగా ఎక్కువ దిగుబడినిచ్చింది (దాదాపు 9.66% నుండి 30.4% వరకు). ఈ వంగడం కూడా ఎంటీయు 1010 యొక్క సన్న గింజల నాణ్యతను కలిగి ఉంది. ఈ రెండు వంగడాలు తక్కువ ఎరువులతో పెరిగే సామర్థ్యం, తక్కువ కాల వ్యవధి వల్ల మీథేన్ వంటి హరితగృహ వాయువుల ఉద్గారాల తగ్గింపు వంటి పర్యావరణ ప్రయోజనాలను కూడా కలిగి ఉన్నాయి.

**రైతులకు, దేశానికి ప్రయోజనాలు:**

ఈ నూతన వంగడాలు భారతీయ వ్యవసాయ రంగంలో అనేక సానుకూల మార్పులకు దోహదం చేస్తాయి. అధిక దిగుబడి రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. కరువు, లవణీయత వంటి వాతావరణ సవాళ్లను తట్టుకునే వంగడాలు పంట నష్టాన్ని తగ్గించి, రైతాంగానికి భరోసాను ఇస్తాయి. నీటి వినియోగం తగ్గడం, పర్యావరణ హితమైన సాగు పద్ధతులు భవిష్యత్ తరాలకు వనరులను సంరక్షించడంలో సహాయపడతాయి. పెరుగుతున్న జనాభాకు ఆహారం అందించడానికి, దిగుబడిని పెంచడం తప్పనిసరి. ఈ కొత్త వంగడాలు ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కేంద్ర మంత్రి పేర్కొన్నట్లుగా, ఇది భారతదేశంలో ‘రెండవ హరిత విప్లవానికి’ నాంది పలకవచ్చు.ఈ వంగడాల వినియోగంలో సవాళ్లు - పరిష్కారాలు:

కొత్త వంగడాలు ఆశించిన ప్రయోజనాలను అందించినప్పటికీ వాటిని క్షేత్రస్థాయిలో రైతులకు చేర్చడంలో విస్తృతంగా వినియోగించడంలో కొన్ని సవాళ్లున్నాయి. జన్యు సవరణ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు, సాధారణ ప్రజలలో పూర్తి అవగాహన లేకపోవడం, జన్యుమార్పిడి పంటలపై ఉన్న అపోహలు దీనిపై కూడా ప్రభావం చూపవచ్చు. వీటి భద్రతపై శాస్త్రీయ ఆధారాలతో కూడిన సమాచారాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యత. ప్రయోగశాల, పరిశోధనా క్షేత్రాల్లో చూపిన అద్భుతమైన ఫలితాలు రైతుల పొలాల్లో కూడా అదే స్థాయిలో రావాలంటే సరైన సాగు పద్ధతులను అనుసరించాలి. దీనిపై రైతులకు శిక్షణ అవసరం. నాణ్యమైన, ప్రమాణీకరించిన విత్తనాలను సకాలంలో సరైన ధరలకు రైతులందరికీ అందుబాటులో ఉంచడం మరో సవాలు. ఈ కొత్త వంగడాల విస్తృత సాగు వల్ల స్థానిక, సంప్రదాయ వరి రకాల జీవ వైవిధ్యం ప్రభావితం కావచ్చనే ఆందోళనలు కూడా ఉన్నాయి. ఈ సవాళ్లను అధిగమించడానికి, ఈ కొత్త శాస్త్రీయ ఆధారిత సమాచారాన్ని సరళమైన భాషలో రైతులకు, ప్రజా సంఘాలకు, వినియోగదారులకు అందించి అవగాహన కల్పించాలి. రైతులకు ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేసి, వారు స్వయంగా వీటి పనితీరును చూసే అవకాశం కల్పించాలి. సమర్థవంతమైన విత్తన ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఈ నూతన ఆవిష్కరణలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారానే భారతదేశం భవిష్యత్తులో ఆహార భద్రతను సాధించడమే కాకుండా, ప్రపంచ వ్యవసాయ రంగంలో తన నాయకత్వాన్ని నిలుపుకోగలదు. జన్యు సవరణ సాంకేతికతను ఇతర పంటలైన పప్పుధాన్యాలు, నూనెగింజలు, పండ్లు, కూరగాయలు వంటి వాటిలో కూడా ఉపయోగించి, వాటి దిగుబడిని, పోషక విలువలను, తెగుళ్ల నిరోధకతను పెంచడానికి అవకాశం ఉంది. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు స్వాగతించదగినవి. భవిష్యత్తులో మరిన్ని పటిష్ట చర్యలు ఆశిద్దాం.

జనక మోహన రావు దుంగ
ఫోన్ : 8247045230

## గవర్నమెంట్ జాబ్ ముద్దు- గవర్నమెంట్ బడులు వద్దా?



నేటి సమాజంలో ఒక విస్మయకరమైన వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. లక్షలాది కుటుంబాలు తమ పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలని కలలు కన్నున్నారు. కానీ అదే కుటుంబాలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడానికి మాత్రం వెనకడుగు వేస్తున్నాయి.ఇది సగటు సమాజంలో ప్రభుత్వ పాఠశాలల పట్ల ఏర్పడిన అపనమ్మకానికి ప్రతిబింబం.ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఎందుకు తగ్గింది? లిప్రభుత్వ బడులపై వ్యతిరేకతకు కొన్ని కారణాలుమౌలిక వసతుల లోపం:లి తాగునీరు, టాయిలెట్లు, మెస్ లు, ఇన్ఫ్రాస్ట్రక్చర్, వంటివి చాలా చోట్ల సరిగా లేకపోవడం. శాశ్వత భవనాల లేమి:లి కొన్ని స్కూల్లు అద్దె భవనాల్లో నడుస్తూ, ఆటస్థలాల్లేకుండా కొనసాగుతుండడం.ఉపాధ్యాయుల కొరతలి : ఖాళీ పోస్టులు నింపకపోవడం, తరచు బదిలీలు. లినిర్లక్ష్య బోధన:లి కొంతమంది ఉపాధ్యాయుల్లో ఉన్న అంకితభావ లోపం.ఆంగ్ల మాధ్యమ ఆకర్షణ:లి “ఇంగ్లీష్ మాధ్యమం తప్ప భవిష్యత్తు లేదు” అన్న అపోహ.ఫలితాలపై అపోహలు:లి ప్రైవేట్ పాఠశాలలు 100% ఫలితాలతో ఆకట్టుకుంటే, ప్రభుత్వ బడుల విజయాలు ప్రచార లోపంతో మిగులుతాయి.ప్రతిష్టాపరమైన అపోహలు:లి “పేదవాళ్ళ పిల్లల స్కూల్” అనే తప్పుడు దృక్పథం. కానీ



వీటన్నిటిని అధిగమించి చాలా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనలతో ప్రైవేటు పాఠశాలకు దీటుగా మంచి ఫలితాల రాబట్టడం జరిగింది. ఇటీవల పదవ తరగతి ఫలితాల్లో అనేక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లవారికంటే మెరుగైన ఫలితాలు సాధించారు.పలు ప్రభుత్వ బడులు నూతన మౌలిక వసతులు, ఆంగ్ల మాధ్యమ బోధనతో ఆకర్షణీయంగా మారాయి.దేశంలో ఉన్నత స్థానాల్లో ఉన్న రాజకీయ నాయకులు, సివిల్ సర్వెంట్లు, ప్రముఖులు చాలామంది ప్రభుత్వ బడులే చదివినవారే.

**ప్రభుత్వ బడుల విలువ**

ప్రభుత్వ బడులలో మంచి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడం , ఉచితంగా విలువలతో కూడిన విద్యా బోధనలు చేయడం అది సామాజిక సమానత్వంకి:లి అన్ని వర్గాల పిల్లలు ఒకే స్థాయిలో విద్యనభ్యసించడం వంటివి ప్రభుత్వ బడుల విశ్వసనీయతను మచ్చు తునకప్రభుత్వ బడుల విశ్వసనీయతను పెంచే కొన్ని మార్గాలుమౌలిక వసతుల అభివృద్ధి:లి స్మార్ట్ క్లాస్‌రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, పరిశుభ్రత, ఆటస్థలాలు. ఉపాధ్యాయ నియామకాలు:లి ఖాళీ పోస్టుల భర్తీ, శిక్షణతో నాణ్యత గల బోధన.విద్యా విధానాల నవీకరణలి : నైతిక విలువలు, పౌర శాస్త్రం, సామాజిక బాధ్యతలపై ఆధారిత పాఠ్యాంశాలు.సానుకూల అవగాహన:లి విజయవంతమైన విద్యార్థుల కథలు, ప్రభుత్వ పాఠశాలల విజయాలను ప్రజల్లోకి తీసుకురావడం.ప్రభుత్వాలు గవర్నమెంట్ బడులలో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత పెంచితే ప్రభుత్వ పాఠశాలల పట్ల సమాజపు ఆలోచనలు కొంత వరకు మారవచ్చు

**మార్పు ఎవరి నుండి మొదలవాలి?**

ప్రభుత్వాలు వసతులు కల్పించాలి, నాణ్యమైన టీచర్లను నియమించాలి.

ఉపాధ్యాయులులి- తమ బాధ్యతను నిబద్ధతగా నిర్వర్తించాలి.

తల్లిదండ్రులు -ప్రభుత్వ బడులపై విశ్వాసంతో పిల్లలను చేర్చాలి.

సమాజంలి - ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టను అర్థం చేసుకుని ఆ మౌలికతను గౌరవించాలి.ప్రభుత్వాలు ఇప్పటికే ప్రభుత్వ బడులలో మధ్యాహ్న భోజనం కల్పించడం, ప్రభుత్వ హాస్టలలో మెస్ ఛార్జీలు పెంచడం, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం చేస్తున్నా కూడా ఇంకా చాలా మందిలో ప్రభుత్వ పాఠశాలల పట్ల అపనమ్మకం పోవట్లేదు, బడుగు, బలహీన వర్గాలకు మాత్రమే ప్రభుత్వ బడులు అనే నినాదం మారి అందరికి నాణ్యమైన విద్య ప్రభుత్వ బడులతో కూడా సాధ్యం అనే విధంగా ముందుకు సాగినప్పుడే ప్రభుత్వ బడుల పట్ల సమాజంలో నమ్మకం పెరుగుతుంది గవర్నమెంట్ బడులు పిల్లలను ఉన్నతమైన భవిష్యత్తు వైపు నడిపించే గుడులు, వాటిని నమ్మడం ప్రోత్సహించడం అందరి బాధ్యతలి

జి. అజయ్ కుమార్



## ఉగ్రమూర్తి.. మంత్రకీర్తి..



ఈ నెల 11న నరసింహ జయంతి

ప్రహ్లాదుడిని కాపాడటం కోసం అవతరించిన మూర్తి నరసింహస్వామి. అలా వచ్చి.. ఇలా రాక్షస సంహారం చేసిన ఆ నరకేసరి కేవలం ఉగ్రమూర్తి మాత్రమే కాదు.. మంత్రమూర్తి. నరసింహుడి పరబ్రహ్మస్వరూపం, తత్త్వం స్వామి నామ మంత్రాన్ని పరిశీలిస్తే అవగతమవుతుంది.

**ఉగ్రం వీరం మహావిష్ణుం**
**జ్వలంతం సర్వతోముఖం**
**నృసింహం భీషణం భద్రం**

మృత్యుం మృత్యుం నమామ్యహం?నరసింహుడి నామ రూపంలో ఉన్న మంత్రం ఇది. ఇందులో ఉన్న ఒక్కొక్క నామం స్వామి ఒక్కో తత్త్వాన్ని ప్రకటిస్తుంది. ఉగ్రం: స్వామి ఉగ్రమూర్తి. ఈ ఉగ్రత్వమే సకల లోకాలనూ పాలిస్తుంది. నరసింహుడి హుంకారాన్ని విన్నంత మాత్రాన అంతర్గత, బహిర్గత శత్రునాశనం జరుగుతుంది. వీరం: సకల కార్యకారణాలకు మూలంగా ఉన్న శక్తినే వీరం అంటారు. నరసింహస్వామి వీరమూర్తి. సకల కార్యకారణ స్వరూపుడు ఆయనే. మహావిష్ణుం: అన్నిలోకాల్లో, అంతటా ఉండే నరసింహ తత్త్వానికి ఈ నామం ప్రతీక. సకల ప్రపంచంలోని జీవరాశులన్నిటిలో తానే వ్యక్తంగాను, అవ్యక్తంగాను పరమాత్మ భాసిస్తాడు. నరసింహ తత్త్వంలోని మరొక విశేషం ఇది. జ్వలంతం: ఈ నామం నరసింహుడిలోని యోగ తత్త్వాన్ని తెలియజేస్తుంది. సకల లోకాల్లో, సర్వాత్మల్లో తన తేజస్సును ప్రకాశింపజేయటం ద్వారా వాటి ప్రకాశానికి కారణమైన నరసింహ తత్త్వమే ‘జ్వలంతం’ శబ్దానికి అర్థం. సర్వతోముఖం: ఇంద్రియ సాయం లేకుండా సకల విశ్వాన్ని చూడగల పరమాత్మ తత్త్వమే సర్వతోముఖత్వం. నరసింహుడు సర్వతోముఖుడు. సృష్టి ఆరంభంలో ఉన్న పరమాత్మ, ఆ తర్వాత ప్రపంచ నిర్వహణ కోసం అనేక శక్తులుగా మారిన తత్త్వమే సర్వతోముఖత్వం.నృసింహం: సకల జంతుజాలంలో సింహం చాలా శ్రేష్ఠమైనది. అందుకనే పరమాత్మ లోకాలను ఉద్ధరించటానికి శ్రేష్ఠమైన సింహాకృతి ప్రధానంగా నరసింహుడిగా ఆవిర్భవించాడు. సింహం పర్వతగుహల్లో నివసిస్తుంది. భక్తుల హృదయగుహల్లో నరసింహుడు కొలువై ఉంటాడు. ఇదీ నరసింహతత్త్వం. భీషణం: నరసింహుడి శాసన శక్తికి ప్రతీక భీషణత్వం. సూర్యచంద్రాదుల ప్రకాశకత్వం, అష్టదిక్పాలకుల నిర్వహణతో సమస్తం నరసింహుడి భీషణశక్తి కారణంగా నడుస్తున్నాయి. అత్యంత భయంకరమైన స్వరూపం ఇది. భద్రం: భయాన్ని కలిగించే భీషణుడైన పరమాత్మే, ఆ భయాన్ని పోగొట్టి అభయాన్ని కూడా ఇస్తాడు. అదే భద్రత్వం. నరసింహ తత్త్వంలోని మరో కోణానికి ప్రతీక ఇది. తనను శరణు వేడిన వారికి భద్రతను కల్పిస్తాడు స్వామి. మృత్యుం మృత్యుం: నామ స్మరణ మాత్రం చేత అపమృత్యువును దూరం చేసేవాడు స్వామి. అందుకే మృత్యువుకే మృత్యువు అన్నారు. స్వాత్మ స్థితిని కలుగజేసి, అమృతత్వాన్ని కలుగజేసే స్వరూపం ఆయన.

## ఒత్తయిన జుట్టు కోసం



జుట్టు ఒత్తుగా నిగనిగలాడుతూ ఉండాలని ప్రతిఒక్కరూ ఆశపడతారు. కానీ, నేటి ఉరుకులు పరుగుల జీవితంలో జుట్టుపై శ్రద్ధపెట్టే సమయమెక్కడిదీ? జుట్టు సమస్యలకు ఒత్తిడి, నిద్రలేమి వంటి కారణాలెన్నో. చాలామంది జుట్టురాలడం, చుండ్రు వంటి సమస్యలను తగ్గించుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. హెయిర్ ప్యాక్‌లు, మసాజ్‌లు, రకరకాల చిట్కాలు పాటిస్తారు. ఒత్తయిన జుట్టుకోసం మీరూ ఓసారి ఇలా ట్రై చేయండి.క్యారెట్: క్యారెట్ వెంట్రుకలను దృఢంగా ఉంచడంలో తోడ్పడుతుంది. దీనిలో విటమిన్ బీ7 పుష్కలంగా ఉంటుంది. దీన్నే బయోటిన్ అని పిలుస్తారు. ఇది జుట్టు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. అందుకే దీన్ని ఆహారంలో భాగం చేసుకోవాలి. అలాగే క్యారెట్‌ని ఉపయోగించి తయారుచేసిన హెయిర్‌ప్యాక్‌ని అప్పుడప్పుడూ వేసుకోవడం ద్వారా మంచి ఫలితం పొందచ్చు. దీనికోసం కొన్ని క్యారెట్ ముక్కలను తీసుకొని నీటిలో వేసి ఉడకబెట్టి మెత్తటి పేస్ట్‌లా తయారుచేయాలి. ఈ మిశ్రమాన్ని తలకు అప్లై చేసి అరగంట పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత తలస్నానం చేయాలి. ఈ ప్యాక్ వెంట్రుకలు రాలడాన్ని నియంత్రించి వాటిని దృఢంగా పెరిగేలా చేస్తుంది.గ్రీన్ టీ: గ్రీన్ టీ తాగడంతో పాటు తలకు ప్యాక్‌లా పట్టించడం వల్ల కూడా జుట్టు రాలే సమస్యను తగ్గించుకోవచ్చు. దీనికోసం నాలుగైదు గ్రీన్ టీ బ్యాగ్‌లను.. అరలీటర్ నీటిలో వేసి వేడి చేయాలి. నీళ్లు చల్లారిన తర్వాత పక్కన పెట్టుకోవాలి. తలస్నానం చేసిన తర్వాత ఈ నీటితో తలను బాగా తడపాలి. పది నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. ఇది మంచి కండిషనర్‌గా పనిచేస్తుంది.

# బెల్లీ ఫ్యాట్‌కి..టీ దెబ్బ



జీవనశైలి లోపాలు.. మహిళల రూపురేఖలనూ ప్రభావితం చేస్తున్నాయి. వ్యాయామం తగ్గడం.. ఒత్తిడి పెరగడం.. సరైన నిద్ర లేకపోవడం.. అన్నీ కలిసి అమ్మాయిలను 'బెల్లీ' బారిన పడేస్తున్నాయి. అధిక కేలరీలతో కూడిన ఆహారం, జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ కూడా జత కలిసి.. నడుము చుట్టుకొలతను అమాంతం పెంచేస్తున్నాయి. రకరకాల కారణాల వల్ల బెల్లీ సమస్య ఉత్పన్నం అవుతుంది. అయితే, కారణానికి తగ్గ చిట్కా వైద్యమూ ఉందండోయ్! రకరకాల టీలు పెరిగిన పొట్టను కరిగించేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అవేంటంటే..దేశంలో నాలుగన్నర కోట్ల మంది మహిళలు థైరాయిడ్‌తో బాధపడుతున్నారు. వీరిలో అధికశాతం మందికి పొట్ట దగ్గర కొవ్వు పేరుకుపోతుంది. ధనియాల టీ తీసుకోవడం వల్ల పొట్ట తగ్గుతుంది. ఇందులో పుష్కలంగా లభించే యాంటి ఆక్సిడెంట్లు.. ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. పొట్ట దగ్గర కొవ్వు పేరుకుపోకుండా చూస్తాయి.ప్రస్తుతం మహిళల్లో ఎక్కువగా కనిపిస్తున్న సమస్య.. పీసీఓఎస్. ఈ సమస్య ఉన్నవారిలో ఇన్సులిన్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. దాంతో హార్మోన్లలో తేడాలు వచ్చి.. పొట్ట పెరుగుతుంది. ఇలా వచ్చే బెల్లీని తగ్గించుకోవాలంటే.. రోజూ దాల్చిన చెక్క టీని తాగాలి. ఇది హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. రక్తంలో చక్కెరను కూడా కంట్రోల్‌లో ఉంచుతుంది.ఆడవాళ్లు ఎదుర్కొనే మరో సమస్య మెనోపాజ్. ఈ సమయంలో మహిళల్లో ఈస్ట్రోజెన్ లెవెల్స్ తగ్గిపోతాయి. వారి శరీరంలో అనేక మార్పులు వస్తాయి. అదే సమయంలో ఇన్సులిన్ ఉత్పత్తితోపాటు బెల్లీ ఫ్యాట్ కూడా పెరుగుతుంది. ఇలాంటి సమయంలో పుదీనాతో చేసే పిప్పర్మెంట్ టీ బాగా హెల్ప్ చేస్తుంది. ఇందులో ఉండే యాంటి ఆక్సిడెంట్లు కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తాయి. జీర్ణక్రియను మెరుగుపరిచి, పొట్ట దగ్గర కొవ్వు పెరగకుండా రక్షణ కల్పిస్తాయి.

# అమృత ఫలం.. ఐస్ ఆపిల్!

**తాటి ముంజలు.. ఎండకాలంలో మాత్రమే లభించే అమృత ఫలాలు. చూసేందుకు తెల్లని మంచు ముద్దలా నోట్లో వేసుకుంటే కరిగిపోయే వీటిని 'ఐస్ యాపిల్' అని పిలుస్తారు.**



తాటి ముంజలు.. ఎండకాలంలో మాత్రమే లభించే అమృత ఫలాలు. చూసేందుకు తెల్లని మంచు ముద్దలా నోట్లో వేసుకుంటే కరిగిపోయే వీటిని 'ఐస్ యాపిల్' అని పిలుస్తారు. ఎన్నో పోషకాలు, విటమిన్లతో నిండిన ఈ పండ్లు ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు అందిస్తాయి.

తా టి

ముంజల్లో యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి బ్యాక్టీరియల్, యాంటి క్యాన్సర్, యాంటి డయాబెటిక్ లక్షణాలు అధికం. ఇవి.. వివిధ వ్యాధులను దరిచేరనీయకుండా.. మన ఆరోగ్యానికి భరోసా కల్పిస్తాయి. తాటిముంజల్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి, వేసవిలో డీహైడ్రేషన్‌ను సమర్థంగా నివారిస్తాయి. వడదెబ్బకు గురైనవారికి తక్షణ ఉపశమనం అందిస్తాయి. శరీరానికి కావాల్సిన మినరల్స్, చక్కెర పదార్థాలను సమతుల్యం చేస్తాయి. శరీరాన్ని చల్లబరచడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంచడంలోనూ సహాయపడతాయి. ఇందులో అధికంగా లభించే ఫైబర్.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.



ఇక తక్కువ కేలరీలతో కూడిన తాటిముంజలు బరువు తగ్గడంలోనూ సాయపడతాయి. ముంజల్లో లభించే యాంటి ఆక్సిడెంట్లు.. చర్మ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. ఫైటోకెమికల్స్, ఆంథోసయనిన్ లాంటివి శరీరంలో వివిధ రకాల ట్యూమర్స్, బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేస్తాయి. వీటిని తాటి ముంజలు నిర్మూలిస్తాయని పలు పరిశోధనల్లో తేలింది. అందుకే, ఐస్ యాపిల్స్‌ను రెగ్యులర్‌గా తినేవారు.. వివిధ క్యాన్సర్ల బారిన పడకుండా ఉంటారని పరిశోధకులు చెబుతున్నారు. ఇక ఇందులోని పొటాషియం.. కాలేయ సంబంధ వ్యాధులను తగ్గిస్తుంది.



ఇక చాలామంది గర్భిణులు మలబద్ధకం, అసిడిటీ సమస్యతో బాధపడుతుంటారు. అలాంటివాళ్లు తాటిముంజలను తీసుకుంటే.. వారి జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. అసిడిటీ, మలబద్ధకం తగ్గుముఖం పడతాయి. ఎండల్లో తిరగడం వల్ల ముఖంపై వచ్చే చిన్నచిన్న మొటిమల్లాంటి పొక్కులను తాటి ముంజలు సమర్థంగా అడ్డుకుంటాయి. అయితే, కొందరు ముంజలపై గోధుమ రంగులో ఉండే పొట్టును తీ సే సి . . కేవలం తెల్లటి పదార్థాన్ని మాత్రమే తింటారు. కానీ, ఆ పొట్టులోనే ఎన్నో రకాల పోషకాలుంటాయని, అది ఆరోగ్యానికి మరింత మంచిదంటున్నారు నిపుణులు.

## ఆమ్ కీ ఖీర్



**కావల్సినవి:**బాస్మతీ బియ్యం – కప్పు (గంట ముందు నానబెట్టుకోవాలి),చక్కెర – ఒకటిన్నర కప్పు, పాలు – రెండులీటర్లు, మామిడిపండ్లు పెద్దవి – నాలుగు,గులాబీనీరు – రెండు చుక్కలు,బాదం, పిస్తా పలుకులు – రెండూ కలిపి పావుకప్పు, కోవా – అరకప్పు.

**తయారీ:** మామిడిపండ్ల చెక్కు తీసి ముక్కల్లా కోసి పెట్టుకోవాలి. అలాగే నానిన బియ్యాన్ని మిక్సీ జారులోకి తీసుకుని మెత్తని పిండిలా చేసుకుని పెట్టుకోవాలి. ఇప్పుడు పాలను వేడిచేసి అందులో బియ్యప్పిండి వేసి మంట తగ్గించాలి. కాసేపటికి అది ఉడుకుతుంది. అప్పుడు చక్కెరా, కోవా వేసి బాగా కలపాలి. ఇది చిక్కగా అయ్యాక ముందుగా కోసి పెట్టుకున్న మామిడిపండు ముక్కలూ, గులాబీనీరూ వేసి కలిపి రెండు నిమిషాలయ్యాక దింపేయాలి. చివరగా బాదం, పిస్తా పలుకులు వేసి వేడి చల్లారాక ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇది చల్లగా తీసుకుంటేనే బాగుంటుంది.

## యాపిల్ మిల్క్‌షేక్



**కావల్సినవి:** యాపిల్ ముక్కలు – పెద్ద కప్పు, గింజల్లేని ఖర్జూరాలు – మూడు (సన్నగా తరగాలి), తేనె – పావుకప్పు, చల్లటి పాలు – ఒకటిన్నర కప్పు.

తయారీ: యాపిల్, ఖర్జూర ముక్కలు, పెద్ద చెంచా తేనె, అరకప్పు పాలు తీసుకుని మిక్సీలో మెత్తగా చేసుకోవాలి. యాపిల్ ముక్కలు ముద్దగా అయ్యాక మిగిలిన పాలూ, తేనె వేసి మరోసారి మిక్సీ పట్టాలి. చివరగా గ్లాసుల్లోకి తీసుకుని నాలుగు ఐసుముక్కలు వేసుకుంటే చాలు. చల్లచల్లటి యాపిల్ మిల్క్‌షేక్ తయారైనట్లే.

# లవంగం తింటే లాభాలు

మన దేశంలోనే కాదు అనేక దేశాల్లోనూ లవంగాలను మసాలా దినుసుగా వాడుతారు. వీటిని వంటల్లో వేస్తే వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఇక లవంగాలు వేయకుండా నాన్ వెజ్ వంటలను వండరు. ఇవి అంతలా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అయితే కేవలం వంటలకే కాక ఇవి మనకు పలు ఆరోగ్యకర ప్రయోజనాలను ఇచ్చే అద్భుతమైన ఔషధంగా కూడా పనిచేస్తాయి. ఈ క్రమంలోనే రోజూ 3 పూటలా భోజనం తరువాత ఒక లవంగాన్ని నమిలి తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.



1. లవంగాలను తినడం వల్ల జీర్ణవ్యవస్థ సరిగ్గా పనిచేస్తుంది. జీర్ణాశయం, పేగులు శుభ్రమవుతాయి. గ్యాస్, అసిడిటీ, వికారం, అజీర్ణం తగ్గిపోతాయి. మలబద్ధకం పోతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది.
2. లవంగాల్లో యాంటీ బాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి అనేక రకాల సూక్ష్మ క్రిముల నుంచి, ఇన్‌ఫెక్షన్ల నుంచి మనల్ని రక్షిస్తాయి. శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఫ్లూ, దగ్గు, జలుబు, జ్వరం వంటి వ్యాధులను నయం చేస్తాయి.
3. ఊపిరితిత్తుల క్యాన్సర్ మొదటి దశలో ఉంటే అలాంటి వారు లవంగాలను రోజూ తింటే క్యాన్సర్ బారి నుంచి తప్పించుకోవచ్చని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. లవంగాల్లో ఉండే యాంటీ కార్సినోజెనిక్ గుణాలు క్యాన్సర్ కణాలతో పోరాడి వాటిని నాశనం చేస్తాయి.
4. లవంగాలను రోజూ తినడం వల్ల వాటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు లివర్‌ను శుద్ధి చేస్తాయి. మెటబాలిజంను మెరుగు పరుస్తాయి. దీంతో కొవ్వు కరుగుతుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పోయి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె జబ్బులు రాకుండా ఉంటాయి.
5. డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్నవారు నిత్యం తమ ఆహారంలో లవంగాలను చేర్చుకుంటే దాంతో అద్భుతమైన ఫలితం ఉంటుందని సాక్షాత్తూ వైద్యులే చెబుతున్నారు. లవంగాల్లో ఉండే ఇన్సులిన్ వంటి గుణాలు రక్తంలో ఉండే గ్లూకోజ్ స్థాయిలను క్రమబద్ధీకరిస్తాయి. దీంతో డయాబెటిస్ అదుపులో ఉంటుంది.
6. లవంగాల్లో యుజెనాల్, ఫ్లేవోన్స్, ఐసో ఫ్లేవోన్స్, ఫ్లేవనాయిడ్స్ అని పిలవబడే ఫీనోలిక్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఎముకలను రక్షిస్తాయి. దీంతో వయస్సు మీద పడడకం కారణంగా వచ్చే ఆస్టియో పోరోసిస్ (ఎముకలు గుల్లబారిపోవడం)ను తగ్గిస్తాయి.
7. లవంగాల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కూడా పుష్కలంగానే ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. శరీరంలో నీరు ఎక్కువగా చేరకుండా చూస్తాయి.
8. లవంగాలను తినడం వల్ల దంతాలు, చిగుళ్ల సమస్యలు పోతాయి. దంతాలు ద ృఢంగా మారుతాయి. నోటి దుర్వాసన పోతుంది.

# మూడు పదులు నిండితే...



వయసు పెరుగుతున్న కొద్దీ చర్మం, కండరాలు, శిరోజాలు బలహీనమవుతూ ఉంటాయి. ప్రతిరోజూ యోగా, వ్యాయామం చేస్తూ మంచి పోషకాహారం తీసుకుంటూ ఉంటే ముప్పై ఏళ్లు నిండినా కూడా అందంగా ఆరోగ్యంగా ఉండవచ్చు అంటున్నారు నిపుణులు. ఇలా ఆరోగ్యాన్ని అందిస్తూ అందాన్ని పెంచే ఆహార పదార్థాల గురించి తెలుసుకుందాం...

ప్రతిరోజు ఒక కప్పు బొప్పాయి ముక్కలు తినడం అలవాటు చేసుకోవాలి. ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు చర్మం పొడిబారకుండా, ముడుతలు రాకుండా చేస్తాయి. రక్తాన్ని శుద్ధి చేస్తాయి. జీర్ణక్రియ సజావుగా జరిగేలా తోడ్పడతాయి.

వారానికి రెండు రోజులు పాలకూరని ఆహారంలో చేర్చుకోవాలి. పాలకూరలో ఐరన్, ఫోలేట్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడు పనితీరుని చురుకుగా మారుస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచుతాయి. శిరోజాలకు ఆరోగ్యాన్ని అందిస్తాయి.

తరచూ అవకాడో తినడం మంచిది. దీనిలో ఇ విటమిన్ ఎక్కువగా ఉంటుంది. ఇది చర్మాన్ని తేమగా ఉంచడంతోపాటు అకాల వార్ధక్యాన్ని నివారిస్తుంది.

ప్రతిరోజూ సాయంత్రంపూట బాదం, పిస్తా, జీడిపప్పు, మొలకలు, గుమ్మడి గింజలు లాంటివి తీసుకుంటూ ఉండాలి. వీటిలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు, జింక్ ఎక్కువగా ఉంటాయి. ఇవి వయసు పెరిగే కొద్దీ శరీరంలో ఏర్పడే ఇన్‌ఫ్లమేషన్ సమస్యలను నివారిస్తాయి.

తరచూ గ్రీన్ టీ తాగుతూ ఉంటే శరీరంలో పేరుకునే విషపదార్థాలు విసర్జితమవుతాయి. మెదడు, గుండె ఆరోగ్యంగా పనిచేస్తాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. పొట్ట పెరగకుండా ఉంటుంది.

ప్రతిరోజూ కనీసం ఒక కప్పు పెరుగు తీసుకోవడం మంచిది. దీనిలోని బ్యాక్టీరియా జీర్ణాశయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు బలోపేతమవుతాయి. ఒత్తిడి, ఆందోళన తగ్గి మంచి నిద్ర పడుతుంది.తరచూ డార్క్ చాక్లెట్ తింటూ ఉంటే మెదడు ఉత్తేజితమవుతుంది. నీరసం, అలసట తగ్గుతాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
10 హైదరాబాద్ గురువారం 08 । మే । 2025

# బిజినెస్




## రూ 6 లక్షల కోట్లు ఆవిరి



**ముంబై-నవభూమి:** భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపరులు బ్యాంకింగ్, ఆయిల్ సహా పలు రంగ షేర్లలో లాభాల స్వీకరణకు దిగారు. దాంతో ప్రామాణిక సూచీలు మంగళవారం నష్టాల్లో పయనించాయి. సెన్సెక్స్ ఒక దశలో 315 పాయింట్లు క్షీణించినప్పటికీ, మళ్లీ కాస్త తేరుకుంది. చివరికి 155.77 పాయింట్ల నష్టంతో 80,641.07 వద్ద ముగిసింది. నిఫ్టీ 81.55 పాయింట్లు కోల్పో యి 24,379.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 16 నష్టపోయాయి. ఎటర్నల్ స్టాక్ 3.08 శాతం నష్టంతో సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టాటా మోటార్స్, ఎస్‌బీఐ రెండు శాతానికి పైగా తగ్గాయి. బుధవారం నాడు అమెరికా ఫెడ్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనుండటంతోపాటు యూఎస్-చైనా మధ్య వాణిజ్య చర్చల నేపథ్యంలో ట్రేడర్లు వేచి చూసే ధోరణిలో ఉన్నారని, దాంతో ప్రధాన సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.6 లక్షల కోట్లు తగ్గి రూ.421.31 లక్షల కోట్లకు (4.98 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.గత వారం ఐపీఓకు వచ్చిన విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ ఏథర్ ఎనర్జీ తన షేర్లను మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.321తో పోలిస్తే, బీఎసఈలో తొలి రోజు ట్రేడింగ్ పూర్తయ్యే సరికి కంపెనీ షేరు 5.76 శాతం క్షీణించి రూ.302.50 వద్దకు జారుకుంది.

## యుద్ధం జరుగుతున్నా ఏమాత్రం జంకని భారత స్టాక్ మార్కెట్లు




**న్యూఢిల్లీ-నవభూమి:**భారత స్టాక్ మార్కెట్ల దమ్మేంతో ప్రపంచానికి తెలిసొస్తోంది. ఆఖరికి పాకిస్థాన్ తో యుద్ధం మొదలుపెట్టినప్పటికీ కూడా ఇండియా మార్కెట్లు ఏ మాత్రం జంకలేకుండా తమ దమ్మేంతో చూపించాయి. అటు, ట్రంప్ టారిఫ్స్ పెడితే, యావత్ ప్రపంచం ఒణికిపోతే, ఇండియా మాత్రం ఏ మాత్రం తొణకలేదు. ఇదే ఊపుని చివరికి యుద్ధం సమయంలోనూ చూపించాయి. ఇవాళ (బుధవారం) సెన్సెక్స్ 105.71 పాయింట్లు లాభపడి, 80,746.78 దగ్గర ఉంటే, నిఫ్టీ 34.80 పాయింట్లు పెరిగి 24,414.40 దగ్గర క్లోజ్ అయింది.నిఫ్టీలో టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, జియో ఫైనాన్షియల్, శ్రీరామ్ ఫైనాన్స్, కోల్ ఇండియా ప్రధాన లాభాలను ఆర్జించగా, ఆసియన్ పెయింట్స్, సన్ ఫార్మా, బజాజ్ ఆటో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఐటిసి నష్టపోయాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1 శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరిగింది. ఎఫ్ఎంసిజి, ఫార్మా మినహా అన్ని రంగాలలో మిగతా సూచీలు గ్రీన్‌లో ముగిశాయి.

## ఒప్పో ఎఫ్ 29 సిరీస్ దృఢమైన మార్కెట్ స్పందన నమోదు

### మొదటి విక్రయాలలో హైదరాబాద్ 28% అమ్మకాల వృద్ధి



**హైదరాబాద్ - నవభూమి:** ఒప్పో ఇండియా కొత్తగా విడుదల చేసిన ఒప్పో ఎఫ్ 29 సిరీస్ అద్భుతంగా విజయంతమైందని ప్రకటించేందుకు సంతోషిస్తోంది. దీనికి అద్భుతమైన మార్కెట్ స్పందన లభించింది. హైదరాబాద్‌లో జరిగిన మొదటి 21 రోజుల విక్రయాల అవధిలో, ఎఫ్ 29 సిరీస్ OPPO F27 Pro+ కన్నా 28% అమ్మకాల వృద్ధిని సాధించింది. ఇది ఈ ప్రాంతంలో దానికి పెరుగుతున్న ప్రజాదరణను, దృఢమైన డిమాండ్‌ను తెలియజేస్తోంది.

ఒప్పో ఎఫ్ 29 సిరీస్: భారతదేశం కోసం, కఠినమైన సవాళ్లను అధిగమించేలా తయారు చేశారు.

ఒప్పో ఎఫ్ 29 సిరీస్ భారతదేశ పెరుగుతున్న గిగ్ ఎకానమీని దృష్టిలో ఉంచుకుని తయారు చేశారు. డ్రైవర్లు, డెలివరీ భాగస్వాములు, హెూం-సర్వీస్ నిపుణులు, చిన్న వ్యాపార యజమానులకు ఇది తోడుగా ఉంటుంది. మిలిటరీ-గ్రేడ్ దృఢత్వం, అధునాతన కనెక్టివిటీ, దీర్ఘకాలిక బ్యాటరీ శక్తిని కలిపి, ఎఫ్ 29 సిరీస్ సన్నని, స్టైలిష్ డిజైన్‌లో ఏదైనా సవాలును స్వీకరించేలా తయారు చేశారు.

భారతదేశం కోసం ఇంజనీరింగ్ చేయబడింది, భారతదేశం కోసం పరీక్షించబడింది

ఎఫ్ 29 సిరీస్ పరిశ్రమ-ప్రముఖ దుమ్ము, ద్రవ రక్షణను అందిస్తుంది. కేరళ రుతుపవనాల నుంచి రాజస్థాన్ వేడి వరకు భారతదేశంలోని విభిన్న వాతావరణాలలో దీన్ని పరీక్షించారు. IP66, IP68 మరియు P69 రేటింగ్‌లతో, ఇది శక్తివంతమైన వాటర్ జెట్‌లు, నీటిలో పడిపోవడం, అధిక-పీడనం, అధిక-ఉష్ణోగ్రత నీటి బహిర్గతం తట్టుకుంటుంది- ఇది పారిశ్రామిక కార్మికులకు, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో పని చేసే వారికి ఈ పరికరం అనువైనదిగా ఉంటుంది. నీటిలో పడిన అనంతరం, స్పీకర్ నుంచి నీటిని తొలగించేందుకు ఒక పల్సేటింగ్ ధ్వనిని కూడా విడుదల చేస్తుంది. భారతదేశంలో బెంగళూరులోని SGS (సొసైటీ జనరల్ డి సర్వైలెన్స్) ద్వారా దీన్ని పరీక్షించగా, ఇది అత్యధిక %IP66, IP%68 మరియు %IP%69 ప్రమాణాలకు అనుగుణంగా ఉంది. %F%29 సిరీస్ దాని విభాగంలో అత్యంత కఠినమైన స్మార్ట్‌ఫోన్.

ఎఫ్ 29 సిరీస్ ద్రవ నిరోధకతను మరింత ముందుకు తీసుకెళ్తుంది. భారీ వర్షం, నది నీరు, వేడి నీటి బుగ్గలు, జ్యూస్, టీ, పాలు, కాఫీ, బీరు నుండి రోజువారీ నీరు చిందడం, ఆవిరి, డిష్ వాటర్, డిటర్జెంట్ వంటి గృహోపకరణ ద్రవాలు మరియు మంచు నీటికి గురికావడం, నురుగు, బురద నీరు పడడం వంటి వాటి నుంచి మెరుగైన రక్షణను అందిస్తుంది. మునిగిన నీటి నుంచి బయటకు తీసిన అనంతరం, స్పీకర్ నుంచి నీటిని తొలగించేందుకు ఇది ఒక ప్రత్యేకమైన పల్సేటింగ్ ధ్వనిని విడుదల చేస్తుంది.అదనంగా, నెట్‌వర్క్ విషయానికి వస్తే, %OPPO F%29 సిరీస్ నెట్‌వర్క్ కనెక్టివిటీలో కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పింది. ఇది ఉత్తమ 5G పనితీరును అందించే పరికరంగా జియో ధృవీకరించింది. జియో పరీక్షల ఆధారంగా, OPPO F29 ðÞ¯dt %INR 20K - INR 30K ధరల విభాగంలో నెట్‌వర్క్ కోసం ఉత్తమ పరికరాల్లో ఒకటిగా నిలిచింది.F29 సిరీస్ OPPO ప్రత్యేకమైన హంటర్ యాంటెన్నా ఆర్కిటెక్చర్‌ను ప్రవేశపెట్టింది. ఇది సిగ్నల్ బలాన్ని 300% పెంచింది. దీని సిమెట్రిక్ యాంటెన్నా లేఅవుట్ కనీస సిగ్నల్ నష్టాన్ని నిర్ధారిస్తుంది. మారుమూల ప్రాంతాలు, హైవేలు మరియు బేస్‌మెంట్ పార్కింగ్‌లో కూడా స్థిరమైన కనెక్టివిటీని అందిస్తుంది. రీన్‌ల్యాండ్ సర్టిఫికేషన్ నమ్మకమైన నెట్‌వర్క్ పనితీరును హామీ ఇస్తుంది.

**ధర - లభ్యత**

OPPO F29 Pro రెండు రంగులలో లభిస్తుంది: అధునాతనంగా ఉన్నప్పటికీ, కఠినమైన సౌందర్యాన్ని అందించేందుకు సహజమైన పాలరాయి నుంచి ప్రతిబింబించే సూర్యకాంతి నుంచి ప్రేరణ పొందిన మార్బుల్ వైట్ మరియు చల్లని అధునాతనత కోసం దాని బోల్డ్, టెక్స్చర్డ్ బ్లాక్ ఫినిషింగ్‌తో గ్రానైట్ బ్లాక్. F29 Pro 5G ధర రూ. 27999/29999/31999 8GB + 128GB, 8GB + 256G, 12GB + 256GB వేరియంట్‌లకు వరుసగా OPPO E-store, Flipkart, Amazon, JioMart మరియు అన్ని ప్రధాన రిటైల్ అవుట్‌లెట్‌లలో లభిస్తుంది.

## ఇంకా నగదే రారాజు



**న్యూఢిల్లీ-నవభూమి:**డిజిటల్ చెల్లింపులు ఎంతగా పుంజుకున్నా మన దేశ ఆర్థిక వ్యవస్థలో ఇంకా నగదు హవా కొనసాగుతోంది. గత పదేళ్లలో, చలామణిలో ఉన్న కరెన్సీ నోట్ల (నగదు) పరిమాణం 157 శాతం, ఏటీఎంల సంఖ్య 32 శాతం, బ్యాంకు శాఖల సంఖ్య 36 శాతం పెరగడం ఇందుకు ఉదాహరణ. బ్యాంకు లు, ఆర్థిక సంస్థలకు నగదు నిర్వహణ సేవలు అందించే సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశంలోని ఒక్కో ఏటీఎం నుంచి సగటున రూ.1.3 కోట్ల నగదు ఉపసంహరణలు (విత్‌డ్రాయల్స్) నమోదయ్యాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.28 లక్షలు ఎక్కువ. గత ఏడాది మార్చి నాటికి చూసినా మన దేశ వినియోగదారుల చెల్లింపుల లావాదేవీల్లో 60 శాతం నగదు ద్వారానే జరిగాయి.

దక్షిణ భారత్‌తో పోలిస్తే ఉత్తర భారత్‌లో నగదు హవా మరింత ఎక్కువగా ఉంది. నిజానికి దక్షిణ భారత్‌లో గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేసే నగదు పరిమాణం వృద్ధి రేటు తగ్గింది. తమిళనాడు, తెలంగాణల్లో జీరో వృద్ధి రేటు నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో మైనస్ ఒక శాతం, కేరళలో మైనస్ 14 శాతం, కర్ణాటకలో మైనస్ రెం డు శాతం నమోదైంది. ఇదే సమయంలో బిహార్ లో 8 శాతం, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌ల్లో 4 శాతం, ఛత్తీసగఢ్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో 2 నుంచి 3 శాతం నగదు విత్‌డ్రాయల్స్ పెరిగినట్టు సీఎంఎస్ ఇన్ఫో నివేదిక వెల్లడించింది.

**సగటు విత్‌డ్రాయల్స్ రూ.5,658**

గత ఆర్థిక సంవత్సరం ఒక్కో వ్యక్తి ఏటీఎం నుంచి విత్‌డ్రా చేసిన సగటు నగదు మొత్తం రూ.5,658కు చేరింది. అంతకు ముందు సంవత్సరం (2023-24)తో పోలిస్తే ఇది 3 శాతం ఎక్కువ. గత ఏడాది అక్టోబరు నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు చూస్తే కొన్ని నెలల్లో నగదు ఉపసంహరణలు 4 నుంచి 6 శాతం పెరిగాయి. ఇదే సమయం లో సగటు డిజిటల్ చెల్లింపులు తగ్గాయి. 2023 ప్రథమార్ధంలో రూ.1,603గా ఉన్న యూపీఐ చెల్లింపుల సగటు.. గత ఏడాది తొలి ఆరు నెలల్లో రూ.1,478కు తగ్గింది. ఇదే సమయంలో పర్సన్-2-మర్చంట్ (పీ2ఎం) చెల్లింపులూ రూ.667 నుంచి రూ.643కు తగ్గినట్టు సీఎంఎస్ నివేదిక తెలిపింది.

## ఐకానిక్ గోల్ఫ్ జీటీఐ కోసం ఫోక్స్ వ్యాగన్ ఇండియా ప్రీ-బుకింగ్‌లను ప్రారంభించనుంది




**న్యూఢిల్లీ-నవభూమి:**లెజెండరీ వోక్స్‌వ్యాగన్ గోల్ఫ్ జీటీఐ కోసం ప్రీ-బుకింగ్‌లు 2025 మే 5 నుంచి ప్రారంభిస్తున్నామని ఫోక్స్‌వ్యాగన్ ఇండియా సగర్వంగా ప్రకటించింది. తాజా తరం గోల్ఫ్ జీటీఐ Mk 8.5తో, భారతీయ ఔత్సాహిక వినియోగదారులు పరిమిత కేటాయింపు ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కార్ల శ్రేణిని మొదటిసారిగా అందుకోగలరు. దాని గొప్ప మోటార్‌స్పోర్ట్ వారసత్వం, కాలాతీత డిజైన్ భాష , ల్లాసకరమైన పనితీరుతో, గోల్ఫ్ జీటీఐ కేవలం కారు కన్నా ఎక్కువ- ఇది డైనమిక్ డ్రైవింగ్, ఐకానిక్ అప్పీల్‌కు చిహ్నం. గోల్ఫ్ జీటీఐ పూర్తిగా నిర్మించిన యూనిట్ గా అందుబాటులోకి వస్తోంది. ఇది వినియోగదారులకు నిజమైన జీటీఐ డీఎన్ఏను దాని స్వచ్ఛమైన రూపంలో అనుభవించే అవకాశాన్ని అందిస్తుంది.

దీని గురించి ఫోక్స్‌వ్యాగన్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా మాట్లాడుతూ, "గోల్ఫ్ జీటీఐ ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రసిద్ధ కార్లలో ఒకటిగా గౌరవించబడుతోంది. భారతదేశంలోని వినియోగదారులకు ఫోక్స్ వ్యాగన్ పనితీరు వారసత్వాన్ని సొంతం చేసు కునే అవకాశాన్ని అందించడం మాకు నిజంగా గర్వంగా ఉంది. ఇది రోజువారీ వినియోగాన్ని టర్బోచార్జ్‌డ్ డ్రైవింగ్ అనుభవంతో మిళితం చేసే కారు - థ్రిల్లింగ్ పనితీరును అందించేందుకు రూపొందించిన ప్రెసిషన్ ఇంజనీరింగ్‌ను అభినందించే వివేకవంతమైన ఔత్సాహికులకు ఇది సరైనది. ఇది జర్మన్ ఇంజనీరింగ్ అత్యుత్తమ స్వరూపం.

గోల్ఫ్ జీటీఐ Mk 8.5 ప్రత్యేకతలు:

- 265 %PS% పవర్ మరియు 370 %Nm% టార్క్
- 5.9 సెకన్లలో 0-100 కిమీ/గం


ఫోక్స్‌వ్యాగన్ గోల్ఫ్ జీటీఐ కోసం ప్రీ-బుకింగ్‌లు మే 5, 2025న ప్రత్యేకంగా ఫోక్స్‌వ్యాగన్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ లో పరిమిత వ్యవధిలో అందుబాటులో ఉంటాయి. పరిమిత లభ్యత కారణంగా, ముందస్తు ప్రీ-బుకింగ్‌లను సంస్థ బాగా సిఫార్సు చేస్తోంది. డెలివరీలు జూన్ 2025లో ప్రారంభమవు తాయని అంచనా. భారతదేశం వ్యాప్తంగా ఎంపిక చేయబడిన వోక్స్‌వ్యాగన్ డీలర్‌షిప్‌లలో అందుబాటులోకి వస్తాయి.ముందస్తు బుకింగ్ లేదా మరింత తెలుసుకోవడానికి www.volk-swagen.co.in ని సందర్శించండి.

## జెన్‌సోల్ బ్లూస్మార్ట్‌పై కార్పొరేట్ శాఖ దర్యాప్తు



**హైదరాబాద్ - నవభూమి:** కంపెనీల చట్టం ఉల్లంఘనల ఆరోపణలకు సంబంధించి జెన్‌సోల్ ఇంజనీరింగ్, బ్లూస్మార్ట్ మొబిలిటీపై దర్యాప్తునకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ప్రమోటర్లు పెద్దఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడటంతో ఈ రెండు కంపెనీలూ ఆర్థిక సంక్షోభంలోకి జారుకున్నాయి. నిధుల మళ్లింపుతోపాటు కార్పొరేట్ పాలన ప్రమాణాలను అతిక్రమించినందుకు గాను జెన్‌సోల్ ఇంజనీరింగ్, బ్లూస్మార్ట్ ప్రమోటర్లైన అన్‌మోల్ సింగ్ జగ్గీ, పునీత్ సింగ్ జగ్గీ సోదరులను సెబీ ఇప్పటికే సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి నిషేధించింది. కాగా, ఈ రెండు కంపెనీల పద్దులు, ఆర్థిక పత్రాలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సమీక్షిస్తోంది. ఆ ప్రక్రియ ఆరు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. అంతేకాదు, జెన్‌సోల్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు జరుపుతోంది.

## నెలకు రూ. 7 వేలతో దేంట్లో ఎంతొస్తుంది



**న్యూఢిల్లీ-నవభూమి:**భవిష్యత్తును ఆర్థికంగా భద్రంగా ఉంచుకోవడానికి యువతరం ఎన్నో పెట్టుబడి మార్గాలను అన్వేషిస్తోంది. ముఖ్యంగా రిటైర్మెంట్ కోసం పొదుపు చేయాలనుకునే వారికి సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ , నేషనల్ పెన్షన్ స్కీమ్ ప్రముఖ ఎంపికలుగా ఉన్నాయి. అయితే, నెలకు రూ. 7,000 చొప్పున 25 సంవత్సరాల పాటు పెట్టుబడి పెడితే, ఈ రెండింటిలో ఏది ఎక్కువ రాబడినిస్తుంది? నిపుణులు ఏం చెబుతున్నారో చూద్దాం. ఎన్‌పీఎస్ అనేది ప్రభుత్వ మద్దతుతో నడిచే పెన్షన్ స్కీమ్. ఇది ప్రజలు రిటైర్మెంట్ కోసం పొదుపు చేయడానికి, ఇంకా వారు పని చేయడం ఆపేసిన తర్వాత క్రమం తప్పకుండా ఆదాయం పొందడానికి సహాయపడుతుం ది.మరోవైపు, సిప్ అనేది మ్యూచువల్ ఫండ్స్‌లో క్రమం తప్పకుండా ఒక నిర్ణీత మొత్తాన్ని పెట్టుబడి పెట్టే విధానం. మ్యూచువల్ ఫండ్స్ విస్తృత శ్రేణి పెట్టుబడి ఎంపికలను అందిస్తాయి. మీ రిస్క్ తీసుకునే సామర్థ్యం, పెట్టుబడి కాలవ్యవధిని బట్టి, మీరు ఈక్విటీ ఫండ్స్, ఈఎల్ఎస్ఎస్, డెట్ ఫండ్స్, హైబ్రిడ్ ఫండ్స్ లేదా ఫండ్ ఆఫ్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. సరైన పెట్టుబడి ఎంపికను ఎంచుకోవడం అనేది మీరు ఎంత త్వరగా పదవీ విరమణ చేయాలను కుంటున్నారు, మీ పెట్టుబడి కాలవ్యవధి ఎంత, మీరు ఎంత కార్పస్ సంపాదించాల నుకుంటున్నారు ఇంకా ముఖ్యంగా మీ రిస్క్ ప్రొఫైల్‌పై ఆధారపడి ఉంటుంది.భారతదేశంలో ఎన్‌పీఎస్.. పెట్టుబడిదారులకు 2 రకాల పెట్టుబడి ఎంపికలను అందిస్తుంది. ఇందులో యాక్టివ్ ఛాయిస్ ఇన్వెస్ట్‌మెంట్, ఆటో ఛాయిస్ ఇన్వెస్ట్‌మెంట్. యాక్టివ్ ఛాయిస్‌లో.. పెట్టుబడిదారులు వారి రిస్క్ సామర్థ్యం, వయస్సు ప్రకారం వారి ఎంపిక ప్రకారం సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టాలని నిర్ణయించుకుంటారు. ఆటో ఛాయిస్‌లో, పథకం నిర్వాహకుడు పెట్టుబడిదారుడి వయస్సు స్లాబ్ ఆధారంగా వారి తరపున పెట్టుబడి పెట్టడానికి సెక్యూరిటీలను ఎంచుకుంటాడు. ఎన్‌పీఎస్‌లో ఈక్విటీలో గరిష్టంగా 75 శాతం వరకు పెట్టుబడి పెట్టొచ్చు.

**సిప్‌లో పెట్టుబడి ఆప్షన్స్..**

%SIP% ద్వారా, పెట్టుబడిదారులు వారి రిస్క్ సామర్థ్యాన్ని బట్టి ఈక్విటీ ఫండ్స్, డెట్ ఫండ్స్, హైబ్రిడ్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టొచ్చు. ఈక్విటీ ఫండ్స్‌లో ఎక్కువ రాబడి పొందే అవకాశం ఉన్నప్పటికీ, వాటిలో రిస్క్ కూడా ఎక్కువగా ఉంటుంది. డెట్ ఫండ్స్ తక్కువ రిస్క్‌తో స్థిరమైన రాబడిని అందించడానికి ప్రయత్నిస్తాయి. హైబ్రిడ్ ఫండ్స్ ఈక్విటీ, డెట్ రెండింటిలోనూ పెట్టుబడి పెడతాయి, తద్వారా రిస్క్, రాబడి మధ్య సమతుల్యతను అందిస్తాయి.

NPS రాబడి అంచనా..

నెలకు పెట్టుబడి: రూ. 7,000, కాలవ్యవధి: 25 సంవత్సరాలు, వార్షిక పెరుగుదల: 5 శాతంబీ యాన్యుటీ రాబడి రేటు: 6.75 శాతం

పెట్టుబడి మిక్స్: 75 శాతం ఈక్విటీ, 25 శాతం ప్రభుత్వ బాండ్లు

ఈ లెక్కల ప్రకారం, 25 సంవత్సరాలలో మొత్తం పెట్టుబడి రూ. 40,09,076 అవుతుంది. అంచనా వేసిన మూలధన లాభం రూ. 1,33,91,015, అంచనా వేసిన రిటైర్మెంట్ కార్పస్ రూ. 1,74,00,091 అవుతుంది. 60 సంవత్సరాల వయస్సులో, మీరు అంచనాగా రూ. 1,04,40,055 ఉపసంహరించుకోవచ్చు ఇక ఇక్కడ మీ అంచనా నెలవారీ పెన్షన్ రూ. 39,150 ఉంటుంది.

SIP **రాబడి అంచనా..**

నెలకు పెట్టుబడి: రూ. 7,000, కాలవ్యవధి: 25 సంవత్సరాలు, వార్షిక రాబడి: 8 శాతం (డెట్ ఫండ్), 10 శాతం (హైబ్రిడ్ ఫండ్), 12 శాతం (ఈక్విటీ ఫండ్)సిప్ పెట్టుబడిలో స్థిరమైన రాబడి ఉండదు కాబట్టి, వివిధ వార్షిక రాబడి రేట్లను పరిగణనలోకి తీసుకుని లెక్కిద్దాం. 12 శాతం వార్షిక రాబడితో, 25 సంవత్సరాలలో అంచనా వేసిన కార్పస్ రూ. 1,19,15,446 అవుతుంది, ఇందులో మీ మొత్తం పెట్టుబడి రూ. 21,00,000 అంచనా వేసిన మూలధన లాభం రూ. 98,15,446. 10 శాతం వార్షిక రాబడితో, అంచనా వేసిన కార్పస్ రూ. 87,02,117 అవుతుంది, ఇందులో అంచనా వేసిన మూలధన లాభం రూ. 66,02,117. 8 శాతం వార్షిక రాబడితో, అంచనా వేసిన కార్పస్ రూ. 64,03,876 అవుతుంది, ఇందులో అంచనా వేసిన మూలధన లాభం రూ. 43,03,876.

## మార్కెట్లోకి కొత్త ఎలక్ట్రిక్ కార్..ఒక్కసారి ఛార్జ్ చేస్తే 449 కిలోమీటర్ల రేంజ్..



**హైదరాబాద్ - నవభూమి:**ప్రస్తుతం దేశంలో ఎక్కువగా ఎలక్ట్రిక్ వాహనాల ట్రెండ్ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే పలు కంపెనీలు కస్టమర్లను ఆకట్టుకునేందుకు అనేక ఈవీ మోడళ్లను పరిచయం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా MG మోటార్ ఇండియా, తన కొత్త వేరియంట్ అయిన విండ్సర్ ఈవీ ప్రోని భారత మార్కెట్లో ఆవిష్కరించింది. దీనిలో ఎక్కువ బ్యాటరీ సామర్థ్యం, స్మార్ట్ టెక్నాలజీ వంటి అధునాతన డ్రైవింగ్ ఫీచర్లు ఉన్నాయి. ఈ కారు పెట్రోల్, డీజిల్ నుంచి మార్పు కోరుకునే వారికి చక్కని అవకాశమని ఆయా వర్గాలు చెబుతున్నాయి. అయితే దీని ఫీచర్లు, ధర వంటివి ఎలా ఉన్నాయనే విషయాలను ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

MG విండ్సర్ ఈవీ ప్రో ధర రూ.12,49,999 (ఎక్స్-షోరూమ్, ఇండియా)గా నిర్ణయించబడింది. ఇది MG Battery-as-a-Service (BaaS%) పథకం కింద అందుబాటులో ఉంది. విండ్సర్ EVతో పోలిస్తే, విండ్సర్ EV ప్రో ధర రూ.50,000 ఎక్కువగా ఉంటుంది. దీనిలో మరిన్ని ఫీచర్లు మెరుగైన పనితీరును అందిస్తాయి.

బ్యాటరీ..విండ్సర్ EV ప్రో 52.9 kWh బ్యాటరీ ప్యాక్‌తో వస్తుంది. ఇది ఒకేసారి ఛార్జ్ చేస్తే 449 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. దీనిలో విండ్సర్ EVలో ఉన్న 38 %kWh% బ్యాటరీతో పోలిస్తే, దాదాపు 117 కి.మీ. ఎక్కువ పరిధిని అందించడం విశేషం. రెండు వేరియంట్లలో కూడా 134 bhp పవర్, 200 Nm టార్క్‌ను అందిస్తాయి. ప్రో వేరియంట్ 60 kW DC ఫాస్ట్ ఛార్జింగ్‌తో 50 నిమిషాల్లో 20% నుంచి 80% వరకు ఛార్జ్ చేయగలదు.

## పీఎస్‌యూల డీలిస్టింగ్‌కు ప్రత్యేక విధానం




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) స్వచ్ఛంద డీలిస్టింగ్‌ను సులభతరం చేయాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ యోచిస్తోంది. ఇందుకోసం అనుసరించాల్సిన విధి విధానాలతో ఒక చర్చా పత్రం విడుదల చేసింది. ఈ చర్చా పత్రంపై మార్కెట్ వర్గాలు ఈనెల 26లోగా తమ స్పందన తెలియజేయాలని కోరింది.

చర్చా పత్రం ముఖ్యాంశాలు

మొత్తం ఈక్విటీలో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్, ఇతర పీఎస్‌యూలు 90 శాతానికి పైగా వాటా కలిగి ఉండాలి

ఇలాంటి పీఎసయూల ఈక్విటీలో కనీస పబ్లిక్ వాటా లేకపోయినా డీలిస్ట్ కావచ్చు

పీఎస్‌యూలు ఒక నిర్ణీత ధర వద్ద కూడా తమ షేర్లను డీలిస్ట్ చేయవచ్చు

షేర్ల ట్రేడింగ్ ఫ్రీక్వెన్సీతో సంబంధం లేకుండా డీలిస్టింగ్ షేర్ల కనీస ధరపై 15 శాతం ప్రీమియం ఉండాలి


మూడింట రెండు వంతుల మంది వాటాదారుల ఆమోదం నిబంధన పీఎస్‌యూల డీలిస్టింగ్‌కు వర్తించదు.

## రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్-440 బైక్ విక్రయాలు బంద్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌కు చెందిన ప్రముఖ ద్విచక్ర వాహనాల కంపెనీ రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 మోడల్ బైక్ అమ్మకాలను నిలిపివేసింది. ఐదు నెలల కింద లాంచ్ చేసిన ఈ బైక్ ఇంజిన్‌లో సాంకేతిక లోపాలు తలెత్తాయని.. అందుకే విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. ఈ పరిణామంతో ఈ మోడల్ బైక్‌ని కొనుగోలు చేసిన వాహనదారులు ఆందోలనకు గురవుతున్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 మోడల్ బైక్‌ని రూ. 2.08లక్షలకు (ఎక్స్‌షోరూం) ధరతో మార్కెట్‌లోకి లాంచ్ చేసింది.మార్కెట్‌లో ఈ బైక్‌కు మంచి ఆదరణ లభిస్తున్నది. తాజాగా ఈ బైక్‌లో ఇంజిన్ కీలక భాగంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు తెలుస్తున్నది. స్క్రామ్ 440 ఇంజిన్‌లోని మాగ్నెటిక్ కాయిల్‌లో అమర్చే 'వుడ్రఫ్ కీ' భాగంలో లోపాన్ని గుర్తించింది. దీని కారణంగా బైక్ కొంత దూరం వెళ్లాక ఆపిన సమయంలో తిరిగి స్టార్ కావడం లేదంటూ పలువురు ఫిర్యాదు చేశారు.ఇంజిన్ నడుస్తున్న సమయంలో మధ్యలో ఆగిపోవడం వంటి సమస్యలు ఏం లేవని.. కేవలం ఒకసారి ఇగ్నిషన్ స్విచ్ ఆఫ్ చేశాక తిరిగి ఇంజిన్ ప్రారంభం కాకపోవచ్చని సమాచారం. దీన్ని గ్రహించిన కంపెనీ స్క్రామ్ 440 అమ్మకాలు, బుకింగ్స్, డెలివరీలను తాత్కాలికంగా నిలిపివేసింది. ఇప్పటికే విక్రయించిన బైక్‌లో సమస్య తలెత్తిన, లోపాలు లేని బైక్‌లకు సైతం వుడ్రఫ్ కీలను పంపే ప్రక్రియను కంపెనీ ప్రారంభించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. వాటిని సర్వీస్ సెంటర్ల ద్వారా బైక్‌లకు ఉచితంగానే అమర్చనున్నట్లు కంపెనీ వర్గాలు చెప్పాయి.ఇప్పటి వరకు కంపెనీ ఉత్పత్తి చేసిన స్క్రామ్ 440 మోడల్‌లో కేవలం రెండుశాతం బైక్‌లలో మాత్రమే ఈ సమస్య ఉన్నట్లు అంచనా. వినియోగదారుల భద్రత, రైడింగ్ అనుభవానికి ప్రాధాన్యం ఇస్తూ కంపెనీ ఈ నిర్ణయం తీసుకుందని సంబంధిత వర్గాలు తెలిపారు. మళ్లీ బైక్‌ల బుకింగ్, డెలివరీ ఎప్పుడు పునః ప్రారంభిస్తుందనేది కంపెనీ ప్రకటించలేదు. కంపెనీ సమస్య ఉన్న బైక్‌లను సరి చేసిన తర్వాతనే ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే, దీనిపై కంపెనీ అధికారికంగా స్పందించలేదు.

## సినిమా అప్పుడే అయిపోలేదు.. ఆర్మీ మాజీ చీఫ్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా పాక్ ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం విరుచుకుపడి 100 మంది వరకూ ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఏకకాలంలో 9 ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపింది. 'ఆపరేషన్ సింధూర్' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌పై భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే కీలకమైన హింట్ ఇచ్చారు. "సినిమా అప్పుడే అయిపోలేదు.. ఇంకా ఉంది" అంటూ సోషల్ మీడియాలో ఆయన ట్వీట్ చేశారు. దీంతో పాక్ ఉగ్రవాదులపై మరిన్ని చర్యలు భారత ఆర్మీ ప్లానింగ్‌లో ఉన్నాయని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునే దిశగా పావులు కదపవచ్చని నెటిజన్లు ఊహాగానాలు చేస్తున్నారు. దీనికి ముందు భారత రక్షణ శాఖ ఒక ప్రకటనలో భారత బలగాలు 'ఆపరేషన్ సింధూర్' నిర్వహించినట్టు ప్రకటించింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై దాడులు జరిపి ఎక్కడి నుంచైతే ఉగ్రవాదులు భారత్‌పై కాల్పులకు దిగుతున్నారో ఆ ప్రాంతాలను, అక్కడి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నేలమట్టం చేసినట్టు తెలిపింది. తొమ్మిది చోట్ల ఈ దాడులు జరిపామని చెప్పింది. ఇవి బలగాలు జరిపిన అతిసహజమైన దాడులని, ఉద్రిక్తతలకు పెంచే చర్యలు కావని, పాక్ మిలటరీ స్థావరాల జోలికి వెళ్లలేదని తెలిపింది. దాడి లక్ష్యాలు, అమలు విషయంలో భారత బలగాలు సంయమనంగా వ్యవహరించినట్టు పేర్కొంది. కాగా, భారత్ దాడుల్లో జైషే మహమ్మద్ చీఫ్, భారత్‌పై పలు దాడుల ప్రధాన సూత్రధారి మౌలానా మసూద్ కుటుంబానికి చెందిన 14 మంది హతమైనట్టు తెలుస్తోంది. భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైందని, ఇది దేశం గర్వించదగిన సమయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మంత్రివర్గ సహచరులతో జరిగిన సమావేశంలో తెలిపారు.

## ఆపరేషన్ సిందూర్ దాడి వ్యక్తిగతం.. పహల్గామ్ బాధితుడి భార్య ఎమోషనల్ కామెంట్స్..




**శ్రీనగర్--నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సాయుధ దళాలు ప్రతీకారం తీర్చుకున్నాయి. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ లోని 9 ఉగ్రవాద స్థావరాలపై మెరుపుదాడులు నిర్వహిం చారు. ఈ దాడిలో 9 స్థావ రాలు పూర్తిగా నేలమట్టం అయ్యాయి. అంతేకాకుండా దాదాపు 100 మంది మరణించినట్లు తెలుస్తోంది. అయితే, ఈ సందర్భంగా ఉగ్రదాడిలో చనిపోయిన బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర ప్రభ్వుతానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాయి. భారత ప్రతీకార చర్యపై ఉగ్రదాడిలో మరణించిన వ్యాపారవేత్త శుభమ్ ద్వివేది భార్య ఐషాన్య స్పందించారు. తన భర్త మరణానికి ప్రతీకారం తీర్చుకున్నందుకు ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ నమ్మకాన్ని నిలబెట్టారని, ఇదే నా భర్తకు అసలైన నివాళి అని భార్య ఐషాన్య వ్యాఖ్యానించారు. నా భర్త ఆత్మ ఎక్కడున్నా శాంతిస్తుందని ఆమె పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడిని వ్యక్తిగతంగా తీసుకుని %ూవీ% మోదీ, దళాలు ఆపరేషన్ సిందూర్ పేరుతో ప్రతీకారం తీర్చుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. నాలాంటి చాలా మంది మహిళలు తమ సిందూర్‌ను కోల్పోయారని, అలాంటి వారందరికీ మోదీ ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. అమాయకుల మరణాలకు భారతదేశం ప్రతీకారం తీర్చుకుంటుందని తాను ఎప్పుడూ నమ్ముతానని ఆమె పేర్కొన్నారు.

## పాకిస్థాన్ కవ్విస్తే ప్రతీకార దాడికి సిద్ధం..



**శ్రీనగర్--నవభూమి:** ఆపరేషన్ సిందూర్ భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వివిధ దేశాల జాతీయ భద్రతా సలహాదారుల తో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితులను మరింత రెచ్చగొట్టే ఉద్దేశం భారత్‌కు లేదని, పాకిస్థాన్ కవ్విస్తే మాత్రం ధీటుగా ప్రతీకార దాడులు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన తన కౌంటర్ పార్ట్స్‌కు స్పష్టం చేశారు. అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, సౌదీ అరేబియా, జపాన్ దేశాల జాతీయ భద్రతా సలహాదారులతో ఇవాళ అజిత్ దోవల్ సమావేశమయ్యారు. పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద స్థావరాలపై జరిపిన మెరుపు దాడుల గురించి వారికి వివరించారు. అదేవిధంగా రష్యా, ఫ్రాన్స్ జాతీయ భద్రతా సలహాదారులతో కూడా దోవల్ సమావేశమయ్యారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మార్కో రూబియో, యూకే జాతీయ భద్రతా సలహాదారు జొనాథన్ పొవెల్, సౌదీ అరేబియా జాతీయ భద్రతా సలహాదారు ముసైద్ అల్ ఐబన్, సౌదీ అరేబియా జాతీయ భద్రతా సలహాదారు హెచ్‌హెచ్ షేక్ తహనూన్, జపాన్ జాతీయ భద్రతా సలహాదారు మసటక ఒకానోతో దోవల్ భేటీ అయ్యారు. రష్యా జాతీయ భద్రతా సలహాదారు సెర్గీ షోల్గు, ఫ్రాన్స్ ప్రతినిధి వాంగ్ యీతో ఫోన్‌లో మాట్లాడారు.

## భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు.. ఉత్తరప్రదేశ్‌లో రెడ్ అలర్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆపరేషన్ సిందూర్‌తో భారత్ పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉధృతమైన వేళ ఉత్తరప్రదేశ్‌లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున భారత సేనలు పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాల పై ప్రతీకార దాడులకు పాల్పడ్డాయి. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ డీజీపీ కీలక ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఒకవేళ పాకిస్థాన్ ప్రతిదాడులకు పాల్పడినా భద్రతాబలగాలకు సహకరించేందుకు పోలీసులు అందుబాటులో ఉండాలని సూచించారు. 'ఉత్తరప్రదేశ్ పోలీసులు అలర్ట్‌గా ఉన్నారని, కావాల్సిన వనరులు అందుబాటులో ఉన్నాయని, రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి రక్షణ కల్పించేలా తాము సిద్ధమయ్యామని యూపీ డీజీపీ తెలిపారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ప్రతి జిల్లా పోలీసులకు, కమిషనరేట్స్‌కు, రాష్ట్రంలోని అన్ని పోలీస్ యూనిట్స్‌కు డీజేపీ నుంచి ఆదేశాలు వెళ్లాయి.

## స్కాల్ప్, హామర్.. 'ఆపరేషన్ సిందూర్'లో భారత్ వినియోగించిన ఆయుధాలు ఇవే



**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గామ్ దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకున్నది. బుధవారం తెల్లవారుజామున 1 గంట సమయంలో 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ విరుచుకుపడింది. తొమ్మిది ఉగ్రవాద శిబిరాలు, శిక్షణా కేంద్రాలను భారత యుద్ధ విమానాలు ధ్వంసం చేశాయి. భారత్ దాడిలో సుమారు వంద మంది ఉగ్రవాదులు మరణించినట్లు తెలుస్తున్నది. భారత వైమానిక దళంతో పాటు, నేవీ, ఆర్మీ కూడా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. కాగా, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలు, శిక్షణ కేంద్రాలను ధ్వంసం చేసేందుకు భారత్ ఈసారి అత్యాధునిక రాఫెల్ ఫైటర్ జెట్స్‌ను వినియోగించింది. అలాగే పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్రవాద స్థావరాల ధ్వంసం కోసం స్కాల్ప్ క్రూయిజ్ క్షిపణులు, హామర్ అనే ప్రెసిషన్ గైడెడ్ బాంబులను వినియోగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఉగ్రవాదుల లక్ష్యాలను నాశం చేయడంతోపాటు పౌరుల ప్రాణనష్టాన్ని నివారించేందుకు ఈ ఆయుధాలు వాడినట్లు పేర్కొన్నాయి. మరోవైపు స్టార్మ్ షాడో అని కూడా పిలిచే స్కాల్ప్, దీర్ఘ శ్రేణి క్రూయిజ్ క్షిపణి. దూరపు లక్షాల కోసం గాలి నుంచి ప్రయోగించే మిస్సైల్ ఇది. ప్రపంచ వ్యాప్తంగా రక్షణ దళాలు విరివిగా వినియోగిస్తాయి. రాత్రి వేళతోపాటు అన్ని సమయాలు, వాతావరణ పరిస్థితుల్లో వినియోగించవచ్చు. 450 కిలోమీటర్ల రేంజ్ కలిగిన స్కాల్ప్ క్షిపణిలోని నావిగేషన్ సిస్టమ్ ద్వారా ఖచ్చితత్వంతో టార్గెట్‌ను ఛేధిస్తుంది. బంకర్లు, మందుగుండు సామగ్రి నిల్వల్లోకి చొచ్చుకెళ్లి వాటిని ధ్వంసం చేస్తుంది. ఈ క్షిపణిని యూరోపియన్ కన్సార్టియం అయిన ఎంబీడీఏ తయారు చేసింది.

# పాక్‌పై దాడికి ముందు చైనాను పరిగణనలోకి తీసుకోండి



**శ్రీనగర్--నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడి ఘటనతో రగిలిపోతోన్న భారత్... పాకిస్థాన్‌ను అన్ని విధాలుగా అష్టదిగ్బంధం చేసి.. దాని వెన్ను విరిచే ప్రయత్నాలు చేస్తోంది. నేడో రేపో సైనిక చర్య కూడా చేపట్టే అవకాశం ఉంది. పాకిస్థాన్ నాయకులు, అధికారులు కూడా దాడి తప్పదనే భయంతోనే ఉన్నారు. ఈ క్రమంలో అమెరికా మాజీ జాతీయ భద్రతా సలహాదారు భారత్ చేపట్టబోయే సైనిక చర్యను సమర్థించారు. తన దేశ సార్వభౌమత్వం, ప్రజలపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకునే హక్కు న్యూఢిల్లీకి ఉందని ఆయన స్పష్టం చేశారు. 'తన సార్వభౌమత్వం, ప్రజలపై ఉగ్రవాదుల దాడులకు ప్రతీకారం తీర్చుకోవడం, వాటిని నిర్మూలించడానికి ప్రయత్నించడం అనేది భారత్‌కు పూర్తి హక్కు' అని అమెరికా మాజీ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ చెప్పారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ దాడికి పాకిస్థాన్‌పై భారత్ దాడిచేస్తుందనే వార్తల నేపథ్యంలో ఆయన ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. పాక్ దొంగ దెబ్బ తీయడానికి ప్రయత్నాలు చేస్తూ.. భారత రక్షణ రంగ వెబ్‌సైట్లపై సైబర్ దాడికి ప్రయత్నిస్తోంది.


బోల్టన్ మాట్లాడుతూ.. 'భారత్‌కు స్వీయ రక్షణ హక్కు ఉంది.. సైనిక ప్రతిచర్యకు ముందు అన్ని రకాల దౌత్య మార్గాలను పూర్తిగా వినియోగించాలి' అని సూచించారు. ప్రపంచానికి భారత్ ఒక ఉదాహరణగా నిలవాలని, సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు అన్ని ప్రయత్నాలూ చేసినట్టు రికార్డు ఉండాలని చెప్పారు. 'భారత ప్రధాని నరేంద్ర మోదీ 2019 ఫిబ్రవరి పుల్వామా ఉగ్రదాడి సమయంలోనే గొప్ప సహనాన్ని ప్రదర్శించారు' అని గుర్తుచేశారు. పుల్వామాలో జైషే మహ్మద్ ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు అమరులైన విషయం తెలిసిందే.. ఈ ఘటనతో బాలాకోట్‌లోని జైషే శిబిరాలపై భారత వాయుసేన దాడిచేసింది.

పహల్గామ్ దాడికి ప్రతీకారంగా సైనిక చర్య జరగనుందనే ప్రచారం జరుగుతోన్న నేపథ్యంలో "ఇది చాలా క్లిష్టమైన సమస్య. కానీ ఇప్పుడు మనం (అంటే అమెరికా ,ఇతర దేశాలు) ఇరు దేశాలకు హితవు పలికే అవకాశం ఉంది. కానీ, ఈ సమస్య పునరావృతం కాకుండా చూసే మార్గాన్ని మనం అన్వేషిద్దాం' అని ఆయన సూచించారు. ఇందుకు ఆయన రెండు మార్గాలను వెల్లడించారు.

ఆగిపోయిన చీనాబ్ నీళ్లు.. ఎడారిగా పాకిస్థాన్

"పాకిస్థాన్‌పై పెరిగుతున్న చైనా ప్రభావం గురించి భారత్ తీవ్రంగా ఆలోచించాలి... ఇరు దేశాలు ( భారత్, పాక్) పరస్పరం కూర్చుని. మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా చర్చించుకోవాలి' అని బోల్టన్ సూచించారు. 'ఇదే సమయంలో చైనాను సంప్రదించి, ఉగ్రవాద సమూహాలను పాక్ నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేయాలి... ఈ రెండు మార్గాలు విఫలమైన తర్వాతే పాకిస్థాన్‌పై అన్ని దౌత్యపరమైన చర్యలు తీసుకున్నామని ప్రపంచానికి తెలియజేసి సైనిక చర్యపై ముందుకెళ్లాలి' అని ఆయన చెప్పారు. అంతేకాదు.. సైనిక చర్య ఉగ్రసంస్థలే లక్ష్యంగా ఉండాలన్న ఆయన.. తద్వారా పాకిస్థాన్‌కు మళ్లీ చర్చలు ప్రారంభించుకునే అవకాశం ఇచ్చినట్టు అవుతుందని వివరించారు. 'పొరుగు దేశాలతో విభేదాలు ఉండొచ్చు... కానీ దాన్ని వ్యక్తపరించేందుకు ఉగ్రవాదాన్ని ఎంచుకోవడం ఎప్పటికీ సరైన మార్గం కాదు' అని బోల్టన్ ఉద్ఘాటించారు.

## పాక్ గగనతలంపై ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్... పిక్ వైరల్!




**శ్రీనగర్--నవభూమి:** పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తో పాక్ ఒక్కసారిగా విలవిల్లాడిపోయిన సంగతి తెలిసిందే! అంతకంటే ముందు భారత వైమానిక సంస్థ మాత్రమే కాకుండా అంతర్జా తీయ విమానయాన సంస్థలు కూడా తమ విమానాలను దారి మళ్లించడంతో పాకిస్థాన్ వైమానిక గగనతలం మూగబోయింది! అవును... భారత్ తో పాటు అంతర్జాతీయ విమానయాన సంస్థలు తమ విమానాలను దారి మళ్లించడంతో పాక్ వైమానిక ప్రాంతం నిశ్శబ్దంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని ఇస్లామాబాద్ కోల్పోతోందని.. పాక్ వైమానిక సంస్థ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోందని చెబుతున్నారు. గ్ వాస్తవానికి ఎయిర్ ఇండియా, ఇండిగోతో సహా భారత విమానయాన సంస్థలు పాక్ గగనతలాన్ని నివారించడం వల్ల.. పొడవైన మార్గాలు, అధిక నిర్వహణ ఖర్చులు వచ్చాయి. అయితే... విమానయాన ఆదాయం పరంగా ఇది ఇస్లామాబాద్ కు అతి భారీ నష్టాన్ని కలిగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆకాశ యుద్ధంలో భారత్ ఎగురుతుంటే.. పాక్ మునిగిపోయిందని చెబుతున్నారు. ప్రస్తుతం అగ్ర విమానయాన సంస్థలు ఎయిర్ ఫ్రాన్స్, ఎయిరేట్స్, బీఏ, లుఫ్తాన్సా వంటి విమానాలు పాక్ గగనతలాన్ని పూర్తిగా విస్మరించాయి. ఇదే సమయంలో పాకిస్థాన్ కు విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఖతార్ ఎయిర్ వేస్ ప్రకటించింది. దీనివల్ల వందల మిలియన్ల విలువైన ఓవర్ ఫ్లైట్ ఫీజుల కారణంగా పాక్ ఫారెక్స్ కు భారీ దెబ్బ తగిలిందని చెబుతున్నారు. ప్రపంచంలో మూడవ అతిపెద్ద, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్ లో భాగంగా... భారత్ నుంచి పాక్ కు ఓవర్ ఫ్లైట్ ఫీజులు కీలక ఆదాయ వనరుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాక్ గగనతలం నుంచి వెళ్లే అన్ని విమానాలు ఇప్పుడు బంగాళాఖాతం మీదుగా, వయా భారత్ వెళ్తున్నాయి! గగనతలం పరిస్థితి అలా ఉంటే... ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్ లో ఎమర్జెన్సీ ప్రకటించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా... అన్ని ఎయిర్ పోర్టులతో పాటు పోర్టులను మూసేసినట్లు చెబుతున్నారు. అదేవిధంగా... స్కూళ్లు, ఆఫీసులకు కూడా సెలవులు ప్రకటించినట్లు సమాచారం. ఇదే సమయంలో మెడికల్ ఎమర్జెన్సీ కూడా ప్రకటించడం గమనార్హం!

## వ్యోమికా, ఖురేషీ గురించి ఈ విషయాలు తెలుసా



**శ్రీనగర్--నవభూమి:** జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలపై భారత ఆర్మీ మెరుపు దాడి చేసింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు నిర్వహంచగా.. దాదాపు 100 మంది వరకు ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తోంది. భారత్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై బుధవారం ఉదయం విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వివరాలు వెల్లడించారు. మిస్రీతో పాటు ఇద్దరు మహిళా అధికారులు కూడా ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. భారత చరిత్రలోనే తొలిసారిగా ఇద్దరు మహిళా అధికారులు సైనిక్ ఆపరేషన్‌పై అధికారిక విలేకరుల సమావేశానికి నాయకత్వం వహించారు. ఇప్పుడు వీరిద్దరి గురించే యావత్ భారత్ చర్చించుకుంటోంది. కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఈ క్లిష్టమైన ఆపరేషన్ గురించి చెప్పుకొచ్చారు. ఈ ఇద్దరు మహిళా అధికారులు ఎవరు.. వీరి బ్యాగ్రౌండ్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

**వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్..**

పైలెట్ కావాలన్నది వ్యోమికా సింగ్ కల. అందుకోసం ఎంతో కష్టపడ్డారు కూడా. ఇంజనీరింగ్ పూర్తి చేసి వ్యోమికా.. తన కలను తీర్చుకునే దిశగా అడుగులు వేశారు. ఇందులో భాగంగానే 2004లో ఐఏఎఫ్‌లో చేరారు ఆమె. 2017లో వింగ్ కమాండ్ హోదా పొందారు. డిసెంబర్ 18, 2019న ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు. అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో కూడా చేతక్, చీతా హెలికాప్టర్లను నడిపి రికార్డు సృష్టించారు వ్యోమికా సింగ్. వైమానికి రంగంలో ఎంతో పేరు పొందారు. హై-రిస్క్ ఫ్లయింగ్ ఆపరేషన్లలో వ్యోమికా సింగ్ సేవలందించారు.

కర్నల్ సోఫియా ఖురేషి ఎవరంటే

సోఫియా ఖురేషీ స్వస్థలం గుజరాత్. 1990లో సోఫియా సైన్యంలో చేశారు. కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్‌కు చెందిన లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషి.. 2016లో పుణెలో జరిగిన ఎక్సర్‌సైజ్ 18 పేరిట భారత ఆర్మీకి చెందిన బృందానికి నాయకత్వం వహించి తొలి మహిళా అధికారణిగా చరిత్ర సృష్టించారు. ఇందులో 18 దేశాలు పాల్గొనగా.. కేవలం భారత్ బృందానికి మాత్రమే మహిళ నాయకత్వం వహించారు. ఆమెకు పీస్ కీపర్‌గా ఎంతో అనుభవం ఉంది. 2006 కాంగోలో పీస్ మిషన్‌కు ఆమె అందించిన సహకారం ప్రత్యేకంగా నిలిచింది. ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వకారణం. మూడు దశాబ్దాలకు పైగా భారత సైన్యానికి సేవలందించారు. ఆమె రాజీలేని వైఖరి, నిర్భయ ప్రయత్నాలతో ఎన్నో ప్రశంసలను అందుకున్నారు. అలాగే దేశ యువతను భారత సైన్యంలో చేరాలని కూడా సోఫియా ఖురేషి పిలుపునిచ్చారు.

## అమాయక పౌరులను చంపిన వారినే మట్టుబెట్టాం.. రక్షణ మంత్రి



**న్యూఢిల్లీ-నవభూమి::** ఆపరేషన్ సింధూర్ తో పహల్గాం ఉగ్రదాడిలో టూరిస్టులను అత్యంత కిరాతకంగా చంపిన వారికి గట్టి సమాధానమిచ్చామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మన అమాయక పౌరులను చంపిన వారినే మట్టుబెట్టామని, సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అత్యంత జాగరూకతతో ఈ దాడులు నిర్వహించామని చెప్పారు. మన సైనికులు అద్భుత పరాక్రమం ప్రదర్శించారని కొనియాడారు. 6 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ చేపట్టిన 50 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను రాజ్‌నాథ్ సింగ్ బుధవారంనాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను టార్గెట్ చేసుకుని సాయుధ బలగాలు విజయవంతంగా ఈ ఆపరేషన్ నిర్వహించారని అభినందించారు. పహల్గాంలో ఉగ్రవాదులు 25 మంది టూరిస్టులు, ఒక కశ్మీర్ పోనీ రైడ్ ఆపరేటర్‌ను అత్యంత పాశవికంగా హత్య చేశారని, ఇందుకు ప్రతిగా ఉగ్రవాదులపై దాడి చేసే హక్కును భారత్ సమర్థవంతంగా ఉపయోగించుకుందని రాజ్‌నాథ్ చెప్పారు. భారత సాయుధ బలగాలు చరిత్రను తిరగరాశాయని అన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. రామాయణంలో రావణాసురుడు సీతమ్మ వారిని నిర్బంధించిన అశోకవనాన్ని హనుమంతుడు నాశనం చేశాడని, అదే స్ఫూర్తితో భారత్ ప్రతిదాడి జరిపిందని ఉదహరించారు. "మన అమాయక పౌరులను ఎవరైతే చంపారో వారిని మాత్రమే మనం చంపాం" అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మన బలగాలు ఆపరేషన్ సింధూర్ నిర్వహించి ఉగ్రవాద శిక్షణా శిబిరాలను ధ్వంసం చేశాయి. గట్టి బదులిచ్చాయి. కచ్చితమైన ప్రణాళికతో ఇదంతా చేశాం. ఉగ్రవాదుల నైతికస్థైరాన్ని దెబ్బతీశాం. ఈ దాడులను ఉగ్రవాద శిబిరాలు, మౌలిక వసులకే పరిమితం చేశాం. మన సాయుధ బలగాల ధైర్యసాహసాలకు సెల్యూట్ చేస్తున్నాను" అని రాజ్‌నాథ్ అన్నారు.

## ఆపరేషన్ సిందూర్ దాడికి ముందు..దాడి తర్వాత ఎలా ఉందంటే..

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత సైన్యం పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ దాడులు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళం సమన్వయంతో ఖచ్చితమైన దాడులు చేసి, ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మొహమ్మద్ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేశాయి. ఈ దాడులు భారతదేశం ఉగ్రవాదంపై ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో మరోసారి స్పష్టం చేశాయి. ఆపరేషన్ సిందూర్?కు ముందు, జైష్ ఏ మొహమ్మద్ సంస్థ పాకిస్తాన్‌లోని బహవల్‌పూర్‌లో వారి ప్రధాన కార్యాలయం 'మర్కజ్ సుభాన్ అల్లాహ్' నుంచి ఉగ్రవాద కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఈ కేంద్రం భారత్‌పై అనేక దాడులకు కీలక స్థావరంగా పనిచేసింది. ముఖ్యంగా 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా దాడి, ఇక్కడ శిక్షణ పొందిన ఉగ్రవాదుల చేతిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంస్థ మసూద్ అజార్ నాయకత్వంలో గత రెండు దశాబ్దాలుగా భారత్‌లో ఉగ్రవాద దాడులకు కారణమైంది. అయితే తాజా దాడుల తర్వాత ఆ కార్యాలయం అస్తవ్యస్తంగా తయారైంది. దీంతోపాటు దాడికి ముందు అందులో ఉన్న ఉగ్రవాదులు సైతం ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

## ఇదిగో ఆధారాలు.. 'ఆపరేషన్ సిందూర్' వీడియోలు రిలీజ్ చేసిన ఆర్మీ






**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకున్నది. బుధవారం తెల్లవారుజామున 1 గంట సమయంలో 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ విరుచుకుపడింది. తొమ్మిది ఉగ్రవాద శిబిరాలు, శిక్షణా కేంద్రాలను భారత యుద్ధ విమానాలు ధ్వంసం చేశాయి. ఎంపిక చేసిన ఉగ్రవాద లక్ష్యాలపై భారత్ దాడి చేసిందని కల్నల్ సోఫియా ఖురేషి మీడియా సమావేశంలో తెలిపారు. కేవలం 23 నిమిషాల్లో నిర్దేశిత లక్ష్యాలను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన యుద్ధ విమానాలు ధ్వంసం చేశాయని వివరించారు. సుమారు వంద మంది ఉగ్ర వాదులు మరణించి ఉంటారని అంచనా వేశా రు. కాగా, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) లోని బహవల్‌పూర్‌లో ఉన్న జైషే ఈ మొహమ్మద్ ప్రధాన కార్యాలయం, మురిద్కేలోని లష్కరే తోయిబా బేస్ క్యాంపు, శిక్షణ కేంద్రం, కోట్లీలోని సూసైడ్ బాంబర్ ట్రైనింగ్, టెర్రర్ లాంచ్ బేస్, గుల్‌పూర్‌లోని ఉగ్రవాదుల లాంచ్‌ప్యాడ్, సవాయిలోని లష్కరే శిబిరం, సర్జల్, బర్నాలాలోని ఉగ్రవాదుల చొరబాటు కేంద్రాలు, మెహమూనాలోని హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్రవాద శిబిరం, బిలాల్‌లోని జేషే మహమ్మద్‌కు చెందిన మరో ల్యాంచ్‌ప్యాడ్‌ను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన యుద్ధ విమానాలు ధ్వంసం చేశాయి. కల్నల్ సోఫియా ఖురేషి ఈ వివరాలను మీడియాకు వివరించారు. ఆర్మీ విడుదల చేసిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## డంపింగ్ యార్డ్ పవర్ ప్రాజెక్టు లిఫ్ట్ తెగి ముగ్గురు మృతి

**సికింద్రాబాద్-నవభూమి:** జవహర్ నగర్ డంపింగ్ యార్డులో పవర్ ప్రాజెక్టు రెండవ దశ పనులు జరుగుతుండగా ప్రమాదవశాత్తు లిఫ్ట్ తెగి అందులో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు మృతి చెందారు. డంపింగ్ యార్డ్ లో పవర్ ప్రాజెక్టు లో భాగంగా చిమ్నీలో పనులు జరుగుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. పవర్ ప్లాంట్ కు సంబంధించిన లిఫ్టు ఒక్కసారిగా కూలినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఈ ఉదయం(బుధవారం) జరిగిన ఘటనలో ఉత్తరప్రదేశ్ కు చెందిన సురేష్ సర్కార్, ప్రకాష్ మండల్, అమిత్రాయ్ లు మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. ఘటన జరిగిన వెంటనే ముగ్గురిని హుటాహుటిన ఈసీఐఎల్ లోని శ్రీకర ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనలో మరికొందరికి గాయాలైనట్లు కూడా తెలుస్తోంది.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్
గురువారం
08 । మే । 2025



# ఇవానాతో యంగ్ హీరో లిప్ కిస్!

యంగ్ హీరో శ్రీవిష్ణు సినిమాలంటే ఎలా ఉంటాయో చెప్పాల్సిన పనిలేదు. ఆయన అన్నీ డిసెంట్ సినిమా లు..పాత్రలే పోషిస్తుంటాడు. హీరోయిన్లతో రొమాంటిక్ సన్నివేశాలు...పెదవి ముద్దులు...ఇంటిమేట్ సన్నివేశాలు లాంటివి ఉండవు. కథని నమ్మి సినిమా చేస్తాడు తప్ప అందులో అసభ్యత కొరుకోడు. ఇప్పటి వరకూ శ్రీవిష్ణు సినిమాలు చూస్తే ఈ సంగతి క్లియర్ గా అర్థమవుతుంది. అయితే 'సింగిల్' సినిమా కోసం శ్రీవిష్ణు రూల్స్ బ్రేక్ చేసినట్లు వినిపిస్తుంది. శ్రీవిష్ణు హీరోగా 'సింగిల్' చిత్రం తెరకెక్కిన సంగతి తెలిసిందే. ఇందులో ఇవానా, కేతిక శర్మ నాయికలుగా నటించారు. ఆద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కించిన చిత్రమిది. అయితే ఇందులో కొన్ని రొమాంటిక్ సన్నివేశాలకు దర్శకుడు ఛాన్స్ తీసుకన్నాడట. దీనిలో భాగంగా ఓ సన్నివేశంలో ఇవానా- శ్రీవిష్ణు మధ్య గాఢమైన పెదవి ముద్దు సన్ని వేశం ఒకటుందట. అక్కడ సీన్ డిమాండ్ చేయడంతో ఈ ముద్దు సన్నివేశం పెట్టినట్లు వినిపిస్తుంది. ఇదే నిజమైతే థియేటర్లో కాక మామూలుగా ఉండదు. ఎందుకంటే ఆ ముద్దు సన్నివేశలో నటించింది ఇవానా? ఆమెకు టాలీవుడ్ లో మంచి క్రేజ్ ఉంది. ఇవానా అంటే తెలుగు కుర్రాళ్లు అసాధారణమైన అభిమానం చూపిస్తారు. 'లవ్ టుడే' అనే డబ్బింగ్ సినిమాతోనే ఈ రేంజ్ లో ఫాలోయింగ్ ఏర్పడింది. అందులో డబుల్ మీనింగ్ డైలాగులు... బూతు సంభాషణలతో అమ్మడు బాగా దగ్గరైంది. అలాంటి బ్యూటీ పెదవి ముద్దులో నటించిందంటే? థియేటర్లలో అల్లకల్లోలం జరిగిపోదు. ఇవానాకున్న ఈ ఫాలోయింగ్ని ఎన్ క్యాష్ చేసుకుందామనే దర్శకుడు ఇలా ప్లాన్ చేసాడా? ఏంటి? మరి ఈ ప్రచారంలో నిజమెంతో తెలియాల్సి ఉంది.

నవచిత్ర





# సింపుల్ లుక్‌తో కిల్ చేసిన శ్రద్ధా

బికినీలు స్విమ్ సూట్లు అవసరమే లేదు. ప్రతిసారీ గ్లామర్ షోతో కుర్రకారును టీజ్ చేయాల్సిన పని లేదు. ఈ భామ అలా సింపుల్ గా రొటీన్ డ్రెస్ లో ఒక్క ఫోటోగ్రాఫ్ వదిలితే చాలు. దానికి కోట్లాదిగా ఉన్న ఫాలోవర్స్ గగ్గోలు పెడతారు. అలాంటి గొప్ప ఫ్యాషన్ సెన్స్ శ్రద్ధా కపూర్ కి ఉంది. ఈ బ్యూటీ వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్ లో వైరల్ అవుతున్నాయి. తాజాగా శ్రద్ధా షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. దీనిలో మెరూన్ కలర్ టీషర్ట్ ధరించిన శ్రద్ధా షార్ట్ హెయిర్ స్టైల్ తో కొంత ట్రెండీగా కనిపిస్తోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే శ్రద్ధా నటించిన స్త్రీ 2 సంచలన విజయంస ఆధించాక, అందరి దృష్టి స్త్రీ 3 పై ఉంది. తఈ బ్యూటీ వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. రాజ్ కుమార్ రావు మాట్లాడుతూ కథ, స్క్రిప్ట్ రెడీగా ఉంటే తాము కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ చిత్రం 2018 చిత్రం స్త్రీకి సీక్వెల్ . మాడాక్ ఫిల్మ్ హర్రర్-కామెడీ విశ్వంలో భాగం. ఇందులో రాజ్ కుమార్ రావు, శ్రద్ధ కూడా ప్రధాన పాత్రల్లో నటించారు. స్త్రీ 3లోను ఈ కాంబినేషన్ రిపీటవుతుంది.

# నిర్మాతగా మారడం వెనుక సమంత ప్లాన్ అదేనా?

సినీ ఇండస్ట్రీలో హీరోలకు ఉన్న డిమాండ్, క్రేజ్ హీరోయిన్లకు ఉండదు. అంతేకాదు, ఇండస్ట్రీలో హీరోలు ఉన్నంత కాలం హీరోయిన్లు కంటిన్యూ అవలేరు. లైమ్ లైట్ లో ఉంటూ ఫామ్ లో ఉన్నప్పుడు ఉండే డిమాండ్ ఎప్పుడూ ఉండదు. ఫామ్ లో ఉన్నప్పుడు వెంటపడే దర్శకనిర్మాతలు, ఫ్యాన్స్, మీడియా, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ ఆ ఫామ్ కోల్పోయాక వారిని లైట్ తీసుకుంటాయి.

ప్రస్తుతం సౌత్ స్టార్ హీరోయిన్ సమంత ఇలాంటి పరిస్థితుల్లోనే ఉంది. నాలుగేళ్ల ముందు వరకు వరుస సినిమాలతో బిజీగా ఉన్న సమంత, ఆ తర్వాత పలు కారణాలతో అనుకున్న ఫామ్ లో లేకుండా పోయింది. చైతన్య తో విడాకులు, అదే టైమ్ లో మయోసైటిస్ అనే వ్యాధితో ఎంతో బాధ పడుతూ సినిమాల నుంచి బ్రేక్ తీసుకోవడం జరిగాయి. అలా బ్రేక్ తీసుకున్న సమంతకు ఇప్పుడు అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత కూడా పెద్దగా ఛాన్సులు రావడం లేదు. దానికి తోడు సమంత వయసు కూడా పెరిగింది. అందుకే హీరోయిన్ గా ఛాన్సులు రావడం లేదు. ఎన్నో ఆశలు పెట్టుకుని సిటాడెల్ వెబ్ సిరీస్ చేస్తే అది అంచనాలను తట్టుకోలేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో సమంత చాలా తెలివైన స్టెప్ వేసింది. హీరోయిన్ గా అవకాశాలు తగ్గిన నేపథ్యంలో తనకు తెలిసిన ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి సొంతంగా నిర్మాణ సంస్థను ప్రారంభించి రెండు సినిమాలను మొదలుపెట్టింది. వాటిలో ఒకటి సమంత మెయిన్ లీడ్ గా వస్తున్న మా ఇంటి బంగారం కాగా, రెండోది సినిమా బండి ఫేమ్ ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వంలో సమంత కీలక పాత్రలో చేస్తున్న శుభం. వాటిలో మా ఇంటి బంగారం గురించి అనౌన్స్‌మెంట్ త ఎ . ఎలాంటి అప్డేట్ లేదు. కానీ శుభం సినిమా మాత్రం అసలెప్పుడు మొదలైందో ఎప్పుడు పూర్తైందో తెలియకుండానే నేరుగా రిలీజ్ కు రెడీ చేసి టీజర్ తో ఆడియన్స్ ముందుకు తీసుకొచ్చింది సమంత. శుభం మూవీ టీజర్, ట్రైలర్ రెండింటికి ఆడియన్స్ నుంచి మంచి బజ్ ను సంపాదించింది.మే 9న రిలీజ్ కానున్న శుభం సినిమాపై సమంతతో పాటూ చిత్ర యూనిట్ మొత్తం కూడా ఎంతో కాన్ఫిడెంట్ గా ఉంది. కామెడీ హర్రర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా సర్‌ప్రైజ్ హిట్ అవుతుందని ఫిల్మ్ నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అసలే ప్రస్తుతం బాక్సాఫీస్ పరిస్థితులేం బాలేవు. గత వారం వచ్చిన హిట్3 సినిమా సూపర్ హిట్ తెచ్చుకున్నప్పటికీ ఫ్యామిలీతో కలిసి ఆడియన్స్ థియేటర్లకు వెళ్లి చూసే సినిమాలు లేవు. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత ఫ్యామిలీలు మొత్తం చూసే సినిమా రాలేదనే చెప్పాలి. ఇప్పుడు శుభం ఆ లోటుని తీరుస్తుందా లేదా అనేది చూడాలి. అసలే స్కూల్స్ కు హాలిడేస్ ఇచ్చిన టైమ్ లో ఈ సినిమా రిలీజవుతుది. ఒకవేళ శుభం హిట్ అయితే థియేటర్లు కళకళలాడటంతో పాటూ అవసరమైన టైమ్ లో ఇండస్ట్రీకి ఒక సక్సెస్ కూడా దక్కినట్టవుతుంది. దాంతో పాటూ నటిగా, నిర్మాతగా సమంతకు కూడా బ్రేక్ దొరుకుతుంది. ఈ సినిమాను చూసి సమంతకు రాబోయే సినిమాల్లో కీలక పాత్రలు కూడా మరిన్ని వచ్చి ఆమె కూడా బిజీ అయ్యే ఛాన్సుంది. వీటన్నింటినీ లెక్కలోకి తీసుకునే సమంత నిర్మాతగా మారిందని అర్థం అవుతుంది. మరి శుభం సినిమా సమంతకు ఎలాంటి ఫలితాన్నిస్తుందో చూడాలి.



# నటి పచ్చ నెక్లెస్‌పైనే కళ్లన్నీ



న్యూయార్క్ మెట్ గాలా -2025 ఈవెంట్లో భారతీయ సెలబ్రిటీల హంగామా గురించి తెలిసిందే. ఈవెంట్లో ముఖేష్ అంబానీ కుమార్తె ఇషా అంబానీ స్పెషల్ లెహంగా, పచ్చ రంగు వజ్రాల నెక్లెస్ ప్రధానంగా హైలైట్ అయ్యాయి. ఇషా ధరించిన కార్టియర్ నెక్లెస్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఇది తన తల్లి నీతా అంబానీ ధరించే నెక్లెస్. ఇప్పుడు ప్రియాంక చోప్రా ధరించిన పచ్చ నెక్లెస్ టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. ఈవెంట్లో అత్యంత ఖరీదైన ఆభరణాలు ధరించి సందడి చేసిన వారిలో పీసీ కూడా ఉంది. మెట్ గాలా 2025 వేడుకల్లో ప్రియాంక చోప్రా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుఎస్ ఇన్‌ఫ్లుయెన్సర్ జూలియా చాఫ్ ఒక వీడియోని ఇన్ స్టాలో షేర్ చేసి.. అందులో ప్రియాంక నెక్లెస్ వివరాలను హైలైట్ చేసింది. వీడియోలో నీతా అంబానీ నెక్లెస్, ప్రియాంక చోప్రా నెక్లెస్ రెండూ హైలైట్ గా కనిపించాయి. 2024లో జామ్ నగర్ లోని ఓ భారీ ఈవెంట్లో నీతా అంబానీ పచ్చ నెక్లెస్ ధరించారని, పీసీ ధరించిన పచ్చల హారం ఇంచుమించు దానిని పోలి ఉందని ప్రభావశీలి ప్రశంసించారు.' ప్రియాంక చోప్రా 2025 మెట్ గాలాలో ఒలివియర్ రౌస్టింగ్ దుస్తుల్లో తళుకుబెళుకులు ప్రదర్శించింది. ఇంతకుముందు నల్ల పోల్కా డాట్స్ ఉన్న తెల్లటి దుస్తుల్లో కనిపించిన పీసీ ఆ తరవాత రకరకాల డిజైనర్ దుస్తుల్లో సందడి చేసింది. పీసీ ధరించిన ఆభరణాలలో పచ్చతో కూడిన పెద్ద వజ్రాల బల్గారి నెక్లెస్ అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రియాంక 241-క్యారెట్ల పచ్చల హారం ఫోటోలు వీడియోలు ఇప్పుడు ఇంటర్నెట్ లో సందడి చేస్తున్నాయి.కొత్త బల్గారీ పాలీక్రోమా హై జ్యువెలరీ కలెక్షన్ కు పీసీ మెట్ గాలా ఈవెంట్లో ప్రచారం చేసింది. బ్రాండ్ అంబాసిడర్ ప్రియాంక చోప్రా ధరించినది మాగ్నస్ ఎమరాల్డ్ నెక్లెస్ అని బల్గారీ కంపెనీ ఇన్ స్టాలో పేర్కొంది. 241.06 క్యారెట్ల ఎమరాల్డ్‌తో ఈ నెక్లెస్ ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత సున్నితమైన విలువైన రాళ్లలోని ఒకదానిని అమర్చి రూపొందించాం.. అని తెలిపింది. మెట్ గాలా ఈవెంట్ లో ప్రియానిక్ జంట సందడి చేసిన ఫోటోలు కూడా ఇప్పటికే వైరల్ అయ్యాయి. ఈ జంట మెట్ గాలాకు హాజరు కావడం ఇది వారి మొదటిసారి కాదు. 2017 నుంచి దీనిని కొనసాగిస్తున్నారు. నాలుగోసారి మెట్ గాలాలో ఈ జంట ఫోజులిచ్చింది. మెట్ గాలా నుంచి తిరిగి రాగానే పీసీ మహేష్ తో కలిసి ఎస్.ఎస్.ఎం.బి 29 షూటింగ్ షెడ్యూల్ ను పూర్తి చేయాల్సి ఉంటుంది.

# వెంకీ, నాగ్ ఆలస్యం అమృతం విషం..!



ఒక సినిమా హిట్ కొట్టగానే వెంటనే మరో ప్రాజెక్ట్ మొదలు పెట్టేయడం కామనే. కానీ కొందరు హీరోలు మాత్రం హిట్టు పడ్డాక కూడా ఇంకా టైం పాస్ చేస్తుంటారు. అది కూడా దాదాపు 80, 90 కి పైగా సినిమాల అనుభవం ఉన్న స్టార్స్ ఇలా హిట్టు పడ్డాక కూడా వెయిట్ చేయడం వెనుక రీజన్ ఏంటన్నది తెలియట్లేదు. ఈ లిస్ట్ లో ఉన్న ఇద్దరు హీరోలు ఎవరంటే.. ఒకరు కింగ్ నాగార్జున కాగా.. మరొకరు విక్టరీ వెంకటేష్. రెండేళ్ల క్రితం నా సామిరంగ సినిమాతో సూపర్ హిట్ అందుకున్నాడు నాగార్జున. ఆ సినిమాను విజయ్ బిన్ని డైరెక్ట్ చేశారు. అతను సొంత కథతో వస్తే రీమేక్ సినిమా ఇచ్చి ప్రాజెక్ట్ హిట్ అందుకున్నారు. ఐతే నా సామిరంగ తర్వాత నాగార్జున నెక్స్ట్ సినిమా విషయంలో జాప్యం చేస్తున్నారు. ఈ గ్యాప్ ఎందుకన్నది తెలియదు కానీ అక్కినేని ఫ్యాన్స్ మాత్రం అప్సెట్ లో ఉన్నారు. ఇక మరోపక్క విక్టరీ వెంకటేష్ కూడా సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో సూపర్ డూపర్ హిట్ అందుకున్నారు. ఆ సినిమా తర్వాత ఏం చేస్తారు అన్నది ఇప్పటివరకు క్లారిటీ రాలేదు. ఒకటి రెండు కథలు హోల్డ్ లో పెట్టారని టాక్. వెంకటేష్ సాటిస్ఫైడ్ గా లేరని టాక్. యువ హీరోలేమో ఒక పక్క సినిమా వెంట సినిమా చేస్తూ వెళ్తుంటే ఇన్నేళ్ల అనుభవం ఉన్న ఈ స్టార్స్ ఇద్దరు నెక్స్ట్ సినిమా కోసం చాలా టైం తీసుకుంటున్నారు. ఐతే అదేదో సామెత ఉన్నట్టు ఆలస్యం అమృతమే కానీ ఆ తర్వాత విషం కూడా అయ్యే ఛాన్స్ ఉంది. తీరా రెండేళ్లు అలా గ్యాప్ తీసుకుని అంచనాలకు తగిన సినిమాతో రాకపోతే ఫ్యాన్స్ డిజప్పాయింట్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. మరి ఆ విషయంలో వెంకీ, నాగ్ ఏం ఆలోచిస్తున్నారో తెలియదు కానీ వారి నెక్స్ట్ సినిమా అప్డేట్ కోసం మాత్రం ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ఐతే వారి వెర్షన్ ఏంటంటే ఎలాంటి సినిమా పడితే అలాంటి సినిమా చేసి ఫ్యాన్స్ ని నిరాశపరచడం కన్నా మంచి బ్లాక్ బస్టర్ కథతో రావాలని చూస్తున్నారు. ఐతే ఆ డెసిషన్ మేకింగ్ త్వరగా చేస్తే బాగుంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

# కుక్కలా అరవకండి.. దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే చర్యలు తప్పవు



'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా భారత సైన్యం మెరుపుదాడులు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదం, ఉగ్రవాద చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటుందని ఈ సమయంలో మౌనంగా ఉండడం మంచిందని తెలిపాడు. అలాగే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో పాటు తప్పుడు పోస్టులు పెట్టే ఆకతాయిలకు వార్నింగ్ ఇచ్చాడు. సైన్యం యుద్ధం చేస్తున్న సమయంలో పౌరులుగా దేశ ప్రజలందరూ తమ వంతు పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేసేవారిని ఎదుర్కోవాలని, వారిని న్యాయస్థానం ముందు నిలబెట్టాలని, సైబర్ క్రైమ్ విభాగాలకు సమాచారం అందించి వారిపై కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ నుండి ఎవరైనా దేశ వ్యతిరేకంగా, యుద్ధానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే వారిపై కఠినమైన కేసులు నమోదు చేస్తామని, దేశంపై బయటి నుండి లేదా లోపలి నుండి ఎలాంటి దాడి జరిగినా తీవ్రంగా పరిగణిస్తామని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు దేశ భద్రత గురించి అవగాహన లేకుండా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేయవద్దని ఆయన సూచించారు. దేశ సరిహద్దులను ఎలా కాపాడాలో వారికి తెలియదని, కాబట్టి జాతీయ భద్రత గురించి తెలియకుండా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేయవద్దని ఆయన అన్నారు. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు.

# భవిష్యత్తులో 'ఉగ్రవాదం' అనే పేరు వినపడకుడదు : విజయ్ దేవరకొండ



జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి చర్యకు సంబంధించి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మంగళ వారం అర్ధరాత్రి 1.44 గంటలకు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేసింది. పాకిస్థాన్ దాదాపు 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేయగా.. ఇందులో 70 మందికి పైగా ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం. అయితే భారత సైన్యం చేసిన ఆపరేషన్‌పై ప్రముఖులు ప్రశంసిస్తున్నారు. మేమంతా మీ వెంటే ఉంటామంటూ భారత సైన్యానికి మద్దతుగా పోస్ట్‌లు పెడుతున్నారు. తాజాగా నటుడు విజయ్ దేవరకొండ కూడా భారత సైన్యానికి మద్దతుగా పోస్ట్ పెట్టాడు.ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో దేశంలోని మన సైనికులు, మహిళలు, అమాయక ప్రజలందరి భద్రత కోసం ప్రార్థిస్తున్నాను.

# ఐపీఎల్‌పై ఆపరేషన్ సిందూర్ ప్రభావం.. ఈ మ్యాచ్‌లు జరుగుతయా లేదా..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025) 18వ సీజన్ ప్రస్తుతం ఉత్కంఠగా కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్ దాడి జరిగింది. ఈ ఎటాక్ నేపథ్యంలో మే 10 వరకు ఉత్తర భారత్?లోని ప్రధాన ఎయిర్ పోర్టులలో ఫ్లైట్స్ సేవలు బంద్ ఉంటాయని భారత ప్రభుత్వం ప్రకటించింది. ఈ కారణంగా ధర్మశాలలో జరగాల్సిన పలు ఐపీఎల్ మ్యాచ్‌లపై అనిశ్చితి నెలకొంది. ఈ ఆపరేషన్ నేపథ్యంలో భారత సరిహద్దులోని జమ్మూ, శ్రీనగర్, లేహ్, చండీగఢ్, జోధ్‌పూర్, అమృత్‌సర్, భుజ్, జామ్‌నగర్, రాజ్‌కోట్ వంటి విమానాశ్రయాలు మే 10 వరకు మూసివేయబడతాయి. ఇందులో ధర్మశాల ఎయిర్ పోర్ట్ కూడా ఉంది. ఈ పరిస్థితి ఐపీఎల్ షెడ్యూల్‌పై ప్రభావం చూపించేలా ఉంది. ఈ క్రమంలో మే 8న ధర్మశాలలో జరగనున్న పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య షెడ్యూల్ ప్రకారం జరిగే మ్యాచ్ అవకాశం ఉంది. ఈ రెండు జట్లు ఇప్పటికే ధర్మశాలకు చేరుకున్నాయి. విమానాశ్రయాల మూసివేత వారి ప్రయాణ షెడ్యూల్‌పై పెద్దగా ప్రభావం చూపలేదు. ఈ మ్యాచ్‌కు సంబంధించి ఎలాంటి అడ్డంకులు లేనప్పటికీ, రాబోయే మ్యాచ్‌లపై ఆపరేషన్ సిందూర్ ప్రభావం ఎలా ఉంటుందనేది తెలియాల్సి ఉంది.


# ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే జడేజా..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ లో ఆల్ రౌండర్స్ జాబితాలో భారత స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఏకంగా 400 రేటింగ్ పాయింట్స్‌తో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. అయితే బంగ్లాదేశ్ క్రికెటర్ మెహిదీ హసన్ మిరాజ్ ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని రెండో స్థానానికి చేరుకున్నాడు. ఐసీసీ అఫీషియల్ వెబ్‌సైట్‌లో బుధవారం తాజా ర్యాంకింగ్స్‌ను పొందుపర్చారు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో మిరాజ్ 116 పరుగులు రాబట్టడమేగాక, 15 వికెట్లు తీశాడు. దాంతో ఆల్‌రౌండర్స్ జాబితాలో అతను ఒక స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. అంతేగాక రెండో టెస్టులో సెంచరీ ద్వారా మిరాజ్.. ఐసీసీ బ్యాటర్స్ జాబితాలో కూడా 8 స్థానాలు మెరుగుపర్చుకుని 55వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ బ్యాటర్ జోయ్ రూట్ ఈసారి కూడా టాప్-20లో చోటు దక్కించుకోలేకపోయారు. అయితే జింబాబ్వే లెఫ్ట్ హ్యాండర్ సీన్ విలియమ్స్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 19వ స్థానానికి చేరుకున్నాడు. అదే సమయంలో బంగ్లాదేశ్‌కు చెందిన షద్మాన్ ఇస్లామ్ ఏకంగా 17 స్థానాలు మెరుగుపర్చుకుని 60వ స్థానానికి దూసుకెళ్లాడు. మిరాజ్ టెస్టు బౌలర్స్ విభాగంలో కూడా రెండు స్థానాలు మెరుపర్చుకుని 24వ స్థానానికి వెళ్లాడు.

నవక్రీడ

# దేశ ప్రజలే భారతమాతకు రక్షణ కవచం.. భారత బలగాలపై క్రికెటర్ సచిన్ ప్రశంసలు



**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గాంఉగ్రదాడి కి ప్రతీకారంగా భారత్ బలగాలు బుధవారం తెల్లవారుజామున ఆపరేషన్ సింధూర్ నిర్వహించాయి. ఆ ఆపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్ లోని మొత్తం 9 ఉగ్రవాద స్థావరాలపై భారత బలగాలు దాడులు చేసి పదుల సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. బలగాలు విజయవంతగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌పై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు సచిన్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఐకమత్యంలో భయం ఉండదని, బలానికి ఎల్లలు లేవని, దేశ ప్రజలే భారత మాతకు రక్షణ కవచమని సచిన్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రపంచంలో ఉగ్రవాదానికి తావు లేదని, మనమంతా ఒక జట్టని అన్నారు. కాగా సచిన్ టెండూల్కర్ సందర్భం వచ్చిన ప్రతిసారి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మాట్లాడారు. 2008 నవంబర్ 26న జరిగిన ఉగ్రదాడిపై కూడా సచిన్ స్పందించారు. అప్పుడు ఆయన ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ ఒక పవర్‌ఫుల్ మెసేజ్ ఇచ్చారు. 'నా అభిప్రాయంలో ఇది దేశంపై జరిగిన దాడి. ఇది ప్రతి భారతీయుడి హృదయాన్ని దెబ్బతీసింది. ఇది కేవలం ముంబై ప్రజలపై దాడి కాదు.' అని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో సచిన్ ఇంగ్లండ్‌పై సెంచరీ చేశారు. ఆ సెంచరీని ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**